అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 5-7-2023 | సమగ్ర తెలుగు దినపత్రిక | www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 136 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 10 పేజీలు | వెల : 6.50



పీడిత వర్గాల పక్షాన పోరాడటమే

అల్లూరికి నిజమైన నివాళి


- రాబోయే తరాలకు ఆయన ఓ స్ఫూర్తి : 125వ జయంతి ముగింపు వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- త్యాగానికి మారు పేరు : గవర్నర్ తమిళిసై
- గడ్డిపరకలను గడ్డపారలుగా మార్చారు : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీడిత వర్గాల హక్కుల కోసం, వారి పక్షాన పోరాడటమే స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజుకు మనమిచ్చే నిజమైన నివాళి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మంగళవారం హైదరాబాద్ లో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరి సీతారామారాజు 125వ జయంతోత్సవ ముగింపు వేడుకల్లో ద్రౌపదిముర్ముతో పాటు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో భీమవరంలోని అల్లూరి విగ్రహాన్ని రాష్ట్రపతి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అల్లూరి జీవితాన్ని ఒక జాతి, వర్గం ఆధారంగా పరిగణించలేమనీ, దేశం కోసం, ప్రజలందరి కోసం పోరాడిన ఆయన్ను దేశవాసులు సొంతం చేసుకున్నారని తెలిపారు. ఆయన ప్రజల సుఖదుఃఖాలను తన సుఖదుఃఖాలుగా మార్చుకోవడం ద్వారా ఆదర్శప్రాయుడయ్యారని చెప్పారు. ఆయన ఆదర్శాలను ఆచరించడమే నిజమైన శ్రద్ధాంజలి అవుతుందని సూచించారు. బ్రిటీష్ పాలకుల ...9లో

వాణిజ్య గ్యాస్‌పై బాదుడు

- రెండు నెలలు తగ్గించి..ఇపుడు రూ.7 పెంపు
- హైదరాబాద్‌లో ప్రస్తుత ధర..రూ.2325



న్యూఢిల్లీ : వాణిజ్య ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల ధరలను కేంద్ర ప్రభుత్వం మళ్లీ పెంచింది. సిలిండర్‌కు రూ.7 పెంచినట్టు ప్రభుత్వ రంగ మార్కెటింగ్ సంస్థలు మంగళవారం తెలిపాయి. పెరిగిన ధరతో న్యూఢిల్లీలో ఒక 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ. 1,780కు చేరుకుంది. చెన్నైలో రూ. 1,952కు చేరుకుంది. వాణిజ్య గ్యాస్ ధరలను మే, జూన్‌లో తగ్గించిన ప్రభుత్వం జులైలో మళ్లీ పెంచింది. వాణిజ్య, గృహ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల ధరలను ప్రతీ నెల 1వ తేదీన మార్కెటింగ్ సంస్థలు సమీక్షిస్తుంటాయన్న సంగతి తెలిసిందే. కాగా పెరిగిన ధరలతో హోటళ్లు, ఇతర విక్రయాలపై మరింత భారంపడనున్నది.

కాంపిటేటివ్ అథారిటీ సీట్లన్నీ తెలంగాణ విద్యార్థులకే

- స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ
- ఉత్తర్వులు జారిచేసిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వైద్య విద్య చదవాలనుకునే తెలంగాణ విద్యార్థులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రాష్ట్రంలోని వైద్య కళాశాల ప్రవేశాల నిబంధనలకు రూల్స్‌కు సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్ విభజన చట్టం, ఆర్టికల్ 371డీ నిబంధనలకు లోబడి వీటిని సవరించారు. దీని ప్రకారం, 2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కాంపిటేటివ్ అథారిటీ కోటాలోని 100 శాతం సీట్లను తెలంగాణ ...9లో

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

4 లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలి

- జీపు జాతా ప్రారంభోత్సవంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ-రాజేంద్రనగర్

రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో కార్మికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా వారికి కనీస వేతనాలు అమలు కావడం లేదని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతాను.. రంగారెడ్డి జిల్లా కాటేదాన్ చౌరస్తాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో రాష్ట్ర బృందం ఈ జీపుజాతాకు నాయకత్వం వహిస్తోంది. కాటేదాన్ నుంచి కొత్తూరు, షాద్‌నగర్ మీదుగా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల వరకు మొదటి రోజు జీపుజాతా కొనసాగింది. ఈ సందర్భంగా కాటేదాన్‌లో నిర్వహించిన సభలో వీరయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు 15 ఏండ్ల నుంచి వేతనాలు సవరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఐదేండ్లకోకసారి పెరిగిన ధరలకు అనుగుణంగా చట్టబద్ధంగా ప్రభుత్వం వేతనాలు సవరించాల్సి ఉన్నా.. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం పెంచకపోవడం బాధాకరం అన్నారు. 2021 జూన్‌లో ఐదు రంగాలకు కనీస వేతనం రూ.18వేలు నిర్ణయించినా ఉన్నత అధికారులు ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్లను కూడా యాజమాన్యాల ఒత్తిడికి లొంగి గెజిట్ చేయకుండా ముఖ్యమంత్రి కార్యాలయం అడ్డుకుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు కనీస వేతన సలహా మండలి ఏర్పాటు చేసి కాలయాపన చేస్తుందే తప్పా కార్మికులకు ఎలాంటి న్యాయం చేయడం లేదన్నారు. కార్మికులు పోరాడి తెచ్చుకున్న కార్మిక చట్టాలనూ మోడీ ప్రభుత్వం ...9లో



బజార్న పడిన బీజేపీ




బండిని కాదని కిషన్‌రెడ్డికి అధ్యక్ష పీఠం

- నేతలు, కార్యకర్తలు పార్టీ వీడకుండా చూడటమే పెద్దటాస్క్
- బండిని తొలగించడంపై పార్టీ శ్రేణుల ఆగ్రహం

తెలంగాణలో నాయకత్వ మార్పు బీజేపీకి మేలు చేయనుందా? లేక కీడు చేయనుందా? అధ్యక్ష మార్పు పార్టీ ముంచుడుకేనా? ఈటల పార్టీని వీడకుండా చేసిన ప్రయోగం దెబ్బతినబోతున్నదా? ఇంటి పోరు కాస్తా ఇక వీధి పోరుగా మారబోతున్నదా? ఎట్లాగూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది లేదు సచ్చేది లేదు గనుక బీఆర్ఎస్‌తో 'మీకు రాష్ట్రంలో అధికారం..మాకు కేంద్రంలో అధికారం' అంటూ చెలిమి కోసం బీజేపీ చేయి చాచిందా? ఆ క్రమంలో బండిని జాతీయ అధిష్టానం తప్పించిందా? అంటే అన్నింటికీ అవుననే సమాధానమే రాజకీయ విశ్లేషకుల నుంచి వస్తున్నది. అతి కష్టం మీద ఒప్పించి అధ్యక్ష పదవి కట్టబెట్టినా...కిషన్‌రెడ్డి దాన్ని ముండ్ల పీఠంగానే చూస్తున్నారనే చర్చ నడుస్తున్నది. బలవంతపు సంసారం ఎంతో కాలం నిలవదన్నట్టు ఈ బలవంతపు పదవిలో ఆయన ఎంత కాలం కొనసాగుతారనేదీ పెద్ద ప్రశ్నే. ఇంటిపోరు చక్కబెట్టి ఉన్న నేతలను, కార్యకర్తలను కాపాడటమే కిషన్‌రెడ్డి ముందున్న పెద్ద టాస్క్, అందులో ఆయన సఫలమయ్యేది కష్టమేనన్న అభిప్రాయం రాజకీయ పండింతుల నుంచి వినిపిస్తున్నది.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అధికారం కోసం పార్టీల్లో చీలికలు తేవడం, సామదానదండోపాయాలతో భయపెట్టి నేతలను చేర్చుకోవటం ద్వారా ముందుకెళ్తున్న బీజేపీకి తెలంగాణలో మాత్రం గట్టి స్ట్రోక్ తగిలింది. నిర్మాణపరంగా తలెత్తిన లోపాలతో కమలం పువ్వు రెక్కలు రాలిపోవడం మొదలైంది. ఆధిపత్యపోరు రూపంలో పట్టిన చెదలు రానున్నకాలంలో దేశవ్యాప్తంగానూ విస్తరించే అవకాశముంది. ఒక్కోనాయకుడిది ఒక్కో మాట.. ఒకరిపై మరొకరు ఫిర్యాదులు..మీడియా సాక్షిగా ప్రత్యారోపణలతో ఆ పార్టీకి రాజకీయంగా ఉన్న పరువు కాస్తా పోతున్నది. తెలంగాణలో నేతలపోరుతో నాయకత్వంలో మార్పులు, చేర్పులకు మొగ్గుచూపిన జాతీయ నాయకత్వం తప్పులో కాలేసినట్టే కనిపిస్తున్నది. ఈటల రాజేందర్‌తో పాటు ఇతర వలస నేతలు హస్తం గూటికి చేరకుండా అడ్డుకట్ట వేసేందుకు వేసిన నాయకత్వ మార్పు ఎత్తుగడ కాస్తా బెడిసికొట్టే అవకాశాలున్నాయి. ఈ నిర్ణయంతో తెలంగాణలో ఆ పార్టీ మరింత బలహీనం కాబోతున్నదా? అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. సౌమ్యుడనే ముద్ర ఉన్న కిషన్‌రెడ్డిని అధ్యక్ష పీఠం మీద కూర్చోబెట్టినా అది ఆయనకు ముండ్ల పీఠంగా మారే సూచనలే కనిపిస్తున్నాయి. బండి సంజయ్‌ని కాపాడేందుకు ఆర్ఎస్ఎస్ ఎంత ప్రయత్నించినా త్రిమూర్తుల (మోడీ, అమిత్‌షా, నడ్డా) ముందు అది తేలిపోయింది. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న బండి సంజయ్ రానున్న కాలంలో ...2లో



ఐ పాయే...

బండి సంజయ్‌ని పదవి నుంచి తప్పించడాన్ని ఆ పార్టీలోని మెజార్టీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. 'తెలంగాణలో బీజేపీ నడ్డి విరిచిన నడ్డా', 'బీజేపీ కొత్త అధ్యక్షుడు వచ్చిన వేళ బీఆర్ఎస్‌కు అభినందనలు', 'ఒక బీసీ పదవి పోయిన తర్వాత మీ కండ్లు చల్లబడ్డాయా?', 'ఐపాయే..ఆ ఊపు ఉండదిక', 'గులాబీ ప్రభుత్వం పట్ల ఎన్నికల ముందు కమలం పువ్వు ...2లో

బీజేపీలో జంపింగ్‌లకే అందలం

- ఏపీ, పంజాబ్ అధ్యక్షులు కాంగ్రెస్ వాళ్లే..



- బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఈటలకు తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ పదవి
- జాతీయ ఎగ్జిక్యూటివ్‌గా కాంగ్రెస్ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి
- తెలంగాణ అధ్యక్షుడిగా జి.కిషన్ రెడ్డి, ఏపీకి పురందేశ్వరి



వివరాలు 2లో..

దొడ్డి కొమురయ్య బలిదానం వృథా కాదు

ఆయన ఆశయ సాధనకు పాటుపడదాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మంత్రి జగదీశ్‌రెడ్డి

- రాష్ట్ర వ్యాప్తంగా దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతి కార్యక్రమం



నవతెలంగాణ- విలేకరులు

తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య బలిదానం వృథాకాదని, అతని ఆశయ సాధన కోసం పాటుపడుదామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన కృషి కొనియాడారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలోని పెద్దబండ ఎఫ్‌సీఐ ఫంక్షన్‌హాల్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి సభ నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి జూలకంటి రంగారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ...9లో



ప్రభుత్వాలు స్పందించకుంటే ఉద్యమం ఉధృతం

పౌర సమాజం మద్దతివ్వాలి

- బీజేపీ విద్రోహంపై నిలదీయాలి : 'పోలవరం నిర్వాసితుల పోరు కేక' పాదయాత్ర ముగింపు ధర్నాలో వక్తలు

వివరాలు 2లో..

గూడు..గోడు..!



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వం ఇండ్ల నిర్మాణాలు చేపట్టకపోవడం.. డబుల్ బెడ్ ఇండ్లూ పంపిణీ చేయకపోవడంతో అనేక ఏండ్ల నుంచి సొంత గూడు లేక నిరుపేదలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం గృహలక్ష్మీ పథకంలో భాగంగా ఇంటి స్థలం ఉన్న వారికి నిర్మాణం కోసం రూ.3లక్షలు అందజేస్తామని ప్రకటించింది. ఈ నెల నుంచే దరఖాస్తులు స్వీకరిస్తామని అప్పట్లో స్పష్టం చేసింది. తాజాగా ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం ...9లో

విడుదల కాని గృహలక్ష్మిపథకం మార్గదర్శకాలు

- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- స్పష్టతనివ్వని అధికారులు
- సొంతింటి నిర్మాణం కోసం నిరుపేదల ఎదురుచూపులు
- కొనసాగుతున్న తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక ఉద్యమం

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన గృహలక్ష్మి పథకం మార్గదర్శకాలు ఇంకా విడుదల లేదు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తామని జీఓ విడుదల చేసిన ప్రభుత్వం.. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు మాత్రం రూపొందించడం లేదు. జులైలో దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేయడంతో లబ్దిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రామాల నుంచి మహిళలు పెద్దఎత్తున కలెక్టర్ కార్యాలయానికి తరలివస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రాకపోవడంతో అధికారులు దరఖాస్తులు తీసుకోవడం లేదు. ఈ విషయం తెలియక గ్రామాల నుంచి నిరుపేదలు కలెక్టరేట్లకు వచ్చి నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం మార్గదర్శకాల విడుదలలో జాప్యం చేయడం మూలంగా నిరుపేదలు ఇబ్బందులు పడాల్సివస్తోంది.



పూరి గుడిసెలో నివాసముంటున్నాం

మాకు సొంత ఇల్లు లేదు. పూరి గుడిసెలోనే నివాసముంటున్నాం. ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని తెలియడంతో దరఖాస్తు చేసేందుకు కలెక్టరేట్‌కు వెళ్లాను. ప్రభుత్వం మాలాంటి పేదలకు ఇల్లు కేటాయించి నీడ కల్పించాలని కోరుతున్నాం.

-పద్మ రాజవేణి, ఖమాన, వాంకిడి మండలం

హైదరాబాద్‌కు మరో భారీ పెట్టుబడి

- రూ.330 కోట్లతో బయో మ్యానుఫ్యాక్చరింగ్ తయారీ యూనిట్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ భారీ పెట్టుబడి పెట్టనుంది. రూ.330 కోట్లతో ప్రపంచ స్థాయి బయో మ్యానుఫ్యాక్చరింగ్ తయారీ యూనిట్‌ని ఏర్పాటు చేయాలని ఆరిజిన్ ఫార్మాస్యూటికల్ కంపెనీ నిర్ణయించింది. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ రంగంలో మరో భారీ పెట్టుబడి చేరింది. తాజాగా ఆరిజిన్ ఫార్మాస్యూటికల్ సర్వీసెస్ సంస్థ సుమారు 330 కోట్ల రూపాయల పెట్టుబడితో ప్రపంచ స్థాయి తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్ నగరంలో ఉన్న జినోమ్ వ్యాలీలో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఫార్మా దిగ్గజ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీ సబ్సిడరీ సంస్థ అయిన ఆరిజిన్ ఫార్మాస్యూటికల్ ఈ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నది. డాక్టర్ రెడ్డీస్ చైర్మెన్ సతీష్‌రెడ్డి, ...9లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



చికెన్ ధరలు
హైదరాబాద్
వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 128
రిటైల్ (లైవ్)	రూ. 150
స్కిన్‌తో	రూ. 218
స్కిన్‌లెస్	రూ. 248

తప్పుడు వైరింగ్...కేబుల్ లోపాలు

- బాలాసోర్ ప్రమాదంపై సేఫ్టీ కమిషన్

న్యూఢిల్లీ : గతంలో చేసిన హెచ్చరికలను పెడచెవిన పెట్టకుండా ఉండి ఉంటే బాలాసోర్ ప్రమాదం జరిగి ఉండేది కాదని ఈ ఘటనపై విచారణ జరిపిన రైల్వే భద్రతా కమిషన్ (సీఆర్ఎస్) అభిప్రాయపడింది. లెవల్ క్రాసింగ్ లొకేషన్ బాక్స్‌లోని వైర్లను తప్పుగా కలిపారని, దీనిని సంవత్సరాల తరబడి ఎవరూ గుర్తించలేదని, దీనివల్ల నిర్వహణ పనులలో తేడా వచ్చిందని వివరించింది. నిర్వహణ పనులు పూర్తయిన తర్వాత వైర్లను తిరిగి ఎలా కలపాలన్న విషయాన్ని టెక్నీషియన్లకు అర్థమయ్యేలా 2015లో వైరింగ్ డయాగ్రమ్‌ను మార్చి ఆమోదం పొందారని, అయితే దానిని భౌతికంగా మార్చలేదని తెలిపింది. దీనివల్ల కేబుల్ టర్మినల్ రాక్ తప్పుడు సర్క్యూట్ పేర్లను చూపించిందని సీఆర్ఎస్ విచారణలో తేలింది. రైలు దిశను కనిపెట్టే 'పాయింట్'ను తెలుసుకునేందుకు 2018లో లొకేషన్ బాక్స్‌లో సర్క్యూట్ స్థానాన్ని మార్చారని, అయితే ఆ మార్పుకు అనుగుణంగా డయాగ్రమ్‌లో కానీ, టెర్మినల్ ర్యాక్‌లో కానీ వైర్లను కలపలేదని సీఆర్ఎస్ తెలిపింది. బాలాసోర్‌లో లొకేషన్ బాక్స్‌కు సంబంధించిన డయాగ్రమ్‌నే బహనగ బజార్‌లో కూడా వాడారని, అది తప్పుడు వైరింగ్‌కు దారి తీసిందని పేర్కొంది. లొకేషన్ బాక్స్‌ను రైలు పట్టాల వెంబడి అమరుస్తారు.

'ప్రమాదం జరగడానికి కేవలం పది నిమిషాల ముందు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌ను లూప్‌లైన్ నుండి సాధారణ అప్ లైన్‌కు పంపేందుకు స్టేషన్ మాస్టర్ అనుమతించారు. కొద్ది సెకన్ల తర్వాత మార్పును సూచించాల్సి ఉండగా వెంటనే సూచించారు. దీనికి 13-14 సెకన్ల సమయం పడుతుంది. వైరింగ్ సరిగా లేకపోవడం వల్లనే తప్పుడు సంకేతం అందింది. ఈ అసాధారణ పరిస్థితిని స్టేషన్ మాస్టర్ సిగ్నలింగ్ సిబ్బందికి తెలియజేసి ఉండాల్సింది. కోరమాండల్ ప్రమాదానికి రెండు వారాల ముందు ఖరగ్‌పూర్ డివిజన్‌లో తప్పుడు వైరింగ్, కేబుల్ లోపాల కారణంగా ఇలాంటి ఘటనే జరిగింది. ఆ తర్వాత లోపాలను సరిదిద్దుకొని ఉంటే కోరమాండల్ ప్రమాదాన్ని నివారించే అవకాశం ఉండేది. ఈ ప్రమాదానికి సిగ్నలింగ్, ఆపరేషన్ (ట్రాఫిక్) విభాగాలు రెండూ బాధ్యత వహించాలి' అని విచారణ కమిషన్ తెలిపింది.

ఆడపిల్ల పుట్టిందని అమ్మకానికి పెట్టిన తండ్రి

- పోలీసుల చొరవతో తల్లి ఒడికి చేరిన చిన్నారి



నవతెలంగాణ- వెల్గటూర్

మూడోసారీ ఆడపిల్ల పుట్టిందనే కోపం, డబ్బుపై ఉన్న దురాశతో కన్నతండ్రే పసికందును విక్రయించాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామంలో మంగళవారం వెలుగుజూసింది. వివరాల్లోకి వెళితే.. గుల్లకోట గ్రామానికి చెందిన జంగిలి జ్యోతి, లక్ష్మణ్ దంపతులకు మూడు నెలల కిందట మూడో సంతానంగా ఆడపిల్ల జన్మించింది. అప్పటికే వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. లక్ష్మణ్‌కు ఎలాగైనా డబ్బు సంపాదించాలనే దురాశ ఉండేంది. అతడి అత్యాశకు అతని తల్లి కూడా తోడైంది. వారిద్దరు కలిసి మూడో బిడ్డను అమ్మాలని నిర్ణయించుకున్నారు. ఓ ఆస్పత్రిలో ఆర్గనైజర్‌గా పనిచేసే లక్ష్మణ్ తన మూడో కూతురిని విక్రయించేందుకు జమ్మికుంటకు చెందిన ఓ వ్యక్తితో రహస్య ఒప్పందం చేసుకున్నాడు. రోజు మాదిరిగానే జ్యోతి ఇద్దరు పిల్లలకు స్నానం చేయిస్తుండగా, మూడో బిడ్డను లక్ష్మణ్ కారులో తీసుకెళ్లిపోయాడు. గమనించిన పెద్ద కూతురు.. చెల్లిని ఎవరో తీసుకెళ్లిపోతున్నారని తల్లికి చెప్పింది. జ్యోతి బయటకు వచ్చి కారును వెంబడించే ప్రయత్నం చేయగా.. వేగంగా వెళ్లిపోయింది. అప్పటికే భర్త డబ్బు తెచ్చుకుని ఇంట్లో దాచేసుకున్నాడు. ఈ విషయం గురించి ఎవరికీ చెప్పొద్దంటూ జ్యోతిని గదిలో బంధించాడు. విషయం ఈ నోట.. ఆనోట పాకి జ్యోతి తల్లిదండ్రులకు చేరింది. దీంతో పుట్టింటి వారు జ్యోతిని తీసుకుని వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. కన్న తండ్రే చిన్నారిని విక్రయించిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. తక్షణమే స్పందించి పోలీసులు పాపను కొనుగోలు చేసిన వారి నుంచి రక్షించి అదే రాత్రి జ్యోతికి అప్పగించారు. మంగళవారం భార్యాభర్తను, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు పిలిచి పోలీసులు విచారించారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదని సమాచారం.

గిరిజనులకు మినహాయింపు ఇవ్వాలి

- యూసీసీపై పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ సూచన
- చట్టంపై తొందర ఎందుకన్న ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపాదిత ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)పై ఎందుకు తొందరపడుతున్నారని ప్రతిపక్ష కాంగ్రెస్, డీఎంకే, బీఆర్ఎస్ పార్టీలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. దీని వెనుక ఉన్న ఉద్దేశమేమిటని ప్రశ్నించాయి. యుసీసీపై అభిప్రాయాలు సేకరించేందుకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (లా అండ్ జస్టిస్) సోమవారం నాడు సమావేశాన్ని ఏర్పాటు చేసింది. దీనిలో పాల్గొన్న ప్రతిపక్ష పార్టీలు బిల్లును తీసుకురావడంలో తొందరపాటు దేనికని ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. ప్రస్తుతం యూసీసీ అవసరం లేదని, అది వాంఛనీయం కూడా కాదని 21వ లా కమిషన్ తన నివేదికలో అభిప్రాయపడిందని ఆ పార్టీలు తెలిపాయి. కాగా ఈశాన్య ప్రాంతంలోనూ, దేశంలోని ఇతర ప్రాంతాలలోనూ నివసిస్తున్న గిరిజనులను యూసీసీ పరిధి నుండి మినహాయించాలని కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ సుశీల్ మోడీ సూచించారు. వారికి రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు రక్షణ కల్పిస్తోందని ఆయన గుర్తు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ సభ్యులు ఈ సమావేశానికి రాలేదు. బీఎస్పీ, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) పార్టీలు యూసీసీని సమర్థించాయి.

కేంద్రం వెనక్కి తగ్గదు

- సీఏఏపై ఆర్ఎస్ఎస్ నేత హొసాబలే

అహ్మదాబాద్ : పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసాబలే చెప్పారు. అయితే చట్టం అమలులో ఎదురయ్యే అవరోధాలను తొలగించేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్ నుండి వలస వచ్చిన హిందువులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ సీఏఏకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్ర, దుష్ప్రచారంలో భాగంగానే ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ఇబ్బందులు పడుతున్న మైనారిటీలకు పౌరసత్వం జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేసేందుకే సవరణ చట్టాన్ని తీసుకొస్తున్నామని ఆయన వివరించారు. దీని అమలుకు కేంద్రం కట్టుబడి ఉన్నదని చెప్పారు.

బజార్న పడిన బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

మార్పు ఎత్తుగడ కాస్తా బెడిసికొట్టే అ కిషన్‌రెడ్డికి సహకరించేది కష్టమే. బండి తన ట్విటర్‌లో ఇక నుంచి సామాన్య కార్యకర్తను మాత్రమే అని రాసుకున్నారు. మరోవైపు రఘునందన్‌రావుపై బండి గ్రూపు భగభగ మండిపోతున్నది. అధిష్టానానికి సైతం ఆ గ్రూపు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే రఘునందన్‌రావుపై వేటు పడే సూచనలు కనిపిస్తున్నాయి. 'పార్టీ లైన్‌కు భిన్నంగా మాట్లాడితే జశ్వంత్ సింగ్, ఉమాభారతి, కళ్యాణ్‌సింగ్ వంటి అగ్రనేతలనే పక్కనబెట్టిన చరిత్ర బీజేపీకున్నది. వ్యక్తులే ముఖ్యమనే వాళ్లకు పార్టీలో స్థానం ఉండదు' అని ఆ పార్టీ సీనియర్ నేత కాసం వెంకటేశ్వర్లు చేసిన వ్యాఖ్యలు రఘునందన్‌రావును ఉద్దేశించి చేసినట్టే కనిపిస్తున్నది.

నాలుగు గోడల మధ్య పెద్దలతో చర్చించాల్సిన అంశాలపై మీడియాకు ఎక్కడంపై బీజేపీ సీనియర్ నేతలు గరంగరం అవుతున్నారు. దుబ్బాక, హుజూరాబాద్ ఎన్నికల్లో రఘునందన్ రావు, ఈటల రాజేందర్ అనుచరులను బీఆర్ఎస్ కొనేసిన సమయంలో బీజేపీ కార్యకర్తలు పనిచేసి గెలిపించిన విషయాన్ని మరిచిపోవద్దని ఆ పార్టీ శ్రేణులు హెచ్చరిస్తున్నాయి. మరో నేత ఎస్.కుమార్ ప్రెస్‌మీట్ పెట్టి మరీ..'20 ఏండ్ల నుంచి పార్టీలో పనిచేస్తున్నా. బండి సంజయ్ సామాన్య కార్యకర్త నుంచి అధ్యక్షుడి వరకూ ఎదిగారు. బండి సంజయ్‌నే అధ్యక్షుడిగా కొనసాగుతారని నడ్డా, తరుణ్‌చుగ్ చెప్పినా సరే కావాలనే ఆయనపై పదేపదే విష ప్రచారం చేశారు. దీని వెనుక బీఆర్ఎస్, కాంగ్రెస్ కుట్రలు ఉన్నాయి. బండి సంజయ్ కండ్లు నెత్తికెక్కాయంట. ఎందుకు ఎక్కుతాయ్? పార్టీ బలోపేతం కోసం పాదయాత్ర పేరుతో వందల కిలోమీటర్లు నడిచినందుకా? కాళ్లకు బొబ్బలొచ్చినా, ఎండనకావానకా ప్రజల్లో తిరిగినందుకా? దేనికోసం కండ్లు నెత్తికెక్కాయి?ఏం మాట్లాడుతున్నారు?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇలా ఆర్ఎస్ఎస్ అనుబంధం ఉన్న నేతలంతా బండి మార్పును జీర్ణించుకోలేకపోతున్నారు.

ఐ పాయే...

(మొదటిపేజీ తరువాయి)

మరోమారు మానవత్వం చాటుకున్నది' 'గతంలో కిషన్‌రెడ్డి అధ్యక్షునిగా ఉన్నాడు. అప్పుడు బీజేపీ గ్రాఫ్ పెద్దగా ఏం లేదు' అంటూ హార్డ్‌కోర్ బీజేపీ కార్యకర్తలే తమ వాట్సాప్, ఫేస్‌బుక్ డీపీలలో కామెంట్లు పెట్టడం ఆ పార్టీ అధిష్టానం పట్ల ఎంత వ్యతిరేకతతో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. అదే సమయంలో 'బ్రహ్మాండమైన మెసేజ్. టర్మ్ పూర్తిచేసుకున్న బండికి ధన్యవాదాలు. బండి అగ్రెసివ్ లీడర్. కిషన్‌రెడ్డి హైలీ ఆక్సెప్టబులిటీ లీడర్. కిషన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత ముందుకు పోతుంది' అని ఎంపీ ధర్మపురి అరవింద్ కామెంట్ చేశారు. కిషన్‌రెడ్డి నాయకత్వాన్ని సమర్థిస్తూ కూడా పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ఈ పోస్టులన్నీ గ్రూపుల పోరుకు నిలువెత్తు సాక్ష్యం. బీజేపీలో ఇప్పటిదాకా నేతల మధ్య జరిగిన అంతర్గత పోరు రానున్న కాలంలో వీధిపోరుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. రఘునందన్‌రావుపై వేటు వేస్తే ఆయన పార్టీని వీడుతారనే చర్చా నడుస్తున్నది. బండి నమ్ముకుని బీజేపీలో చేరిన నేతలు ఒక్కొక్కరుగా పార్టీనే వీడే అవకాశముంది. పార్టీని త్వరలో వీడబోతున్నారన్న జాబితాలో వివేక్, విజయశాంతి, ఎ.చంద్రశేఖర్, తదితర కీలక నేతలు ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న నేతలను, కార్యకర్తలను కాపాడటమే కిషన్‌రెడ్డి ముందు ఉన్న పెద్ద టాస్క్. అందులో ఆయన ఏమేరకు సక్సెస్ అవుతారా? లేదా? అనేది వేచిచూడాల్సిందే.

బీజేపీలో జంపింగ్‌లకే అందలం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన జంపింగ్ నేతలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఎప్పటి నుంచో పార్టీ జెండా పట్టుకొని, కష్టనష్టాలకు ఓర్చి నిలబడిన వారిని కాదని నిన్న మొన్న బీజేపీలో చేరిన నేతలకు అగ్ర తాంబూలం లభిస్తోంది. కాంగ్రెస్ పాలనలో కేంద్ర మంత్రిగా చేసిన డి. పురం దేశ్వరిని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలిగా నియమించారు. అలాగే కాంగ్రెస్ పంజాబ్ అధ్యక్షుడిగా పని చేసిన సునీల్ జక్కర్‌ను పంజాబ్ బీజేపీ అధ్యక్షుడి గా నియ మించారు. బీఆర్ఎస్‌లో రాష్ట్ర మంత్రిగా చేసిన ఈటల రాజేందర్‌ను బీజేపీ తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా నియమించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఎన్. కిరణ్ కుమార్ రెడ్డిని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా నియమించారు. జార్ఖండ్ వికాస్ మోర్చా (జేవీఎం) అధ్యక్షుడిగా ఉన్న బాబూలాల్ మరాండీ, తన పార్టీని బీజేపీ (2020 ఫిబ్రవరి)లో విలీనం చేయడంతో ఆయనకు బీజేపీ జార్ఖండ్ అధ్యక్ష పదవి దక్కింది.

తెలంగాణకు జి.కిషన్ రెడ్డి,ఏపీకి పురందేశ్వరి

ఎన్నికలు సమీపిస్తున్న తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్ష మార్పులను చేసింది. తెలంగాణలో బండి సంజయ్, ఆంధ్రప్రదేశ్‌లో సోము వీర్రాజును పార్టీ అధ్యక్ష పదవుల నుంచి తప్పించి, వారి స్థానంలో జి.కిషన్‌రెడ్డి, డి. పురందేశ్వరిలను నియమించింది.ఈమేరకు ఈ విషయాన్ని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ మంగళవారం ఒక ప్రక టనలో వెల్లడించారు. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొ న్నారు. అలాగే, తెలంగాణలో బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మెన్‌గా ఈటల రాజేందర్‌ని, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఏపీ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డిని ఎంపిక చేశారు. వీరితో పాటు జార్ఖండ్ అధ్యక్షునిగా దీపక్ ప్రకాశ్ స్థానంలో మాజీ సీఎం బాబూలాల్ మరాండీ, పంజాబ్ అధ్యక్షుడిగా అహ్వనీ శర్మ స్థానంలో సునీల్ జక్కర్‌ను నియమించినట్టు ప్రకటనలో పేర్కొ న్నారు. ఇదిలా ఉండగా జులై 7న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్య దర్శులు, రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌లందరితో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమా వేశానికి బీజేపీ అధ్యక్షుడు జెపి నడ్డా, జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతో ష్ అధ్యక్షత వహిస్తారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు కేంద్ర మం త్రివర్గ సమావేశం కూడా జరిగే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి వర్గాన్ని పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉంది.

ప్రభుత్వాలు స్పందించకుంటే ఉద్యమం ఉధృతం

అమరావతి : పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరు ఆగదని సీపీఐ(ఎం) ఏపీ ప్రకటించింది. పాదయాత్ర ప్రారంభం మాత్రమేనని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకుంటే పోరాటాన్ని ఉధృతం చేసి బుద్ధి చెపుతామని హెచ్చరించింది. నిర్వాసితుల ఆందోళనలకు పార్టీలు, సంఘాలు, యావత్ పౌర సమాజం మద్దతు తెలపాలని పిలుపునిచ్చింది. బీజేపీ విద్రోహంపై నిలదీయాలని విజ్ఞప్తి చేసింది. ప్రాజెక్టు ఆలస్యానికి కారకులెవరో ప్రభుత్వాలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. సీపీఐ(ఎం) ఏపీ చేపట్టిన 'పోలవరం నిర్వాసితుల పోరు కేక' పాదయాత్ర ముగింపు సందర్భంగా విజయవాడలోని ధర్నాచౌక్‌లో మహా ధర్నా జరిగింది. సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అధ్యక్షత వహించారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రసంగిస్తూ... అకుంఠిత దీక్షతో నిర్వాసితులు చేసిన పాదయాత్ర వృథా కాదు. వారి పట్టుదల, శ్రమ సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతాయి. జలయజ్ఞంలో భాగంగా పోలవరం ప్రారంభ సమయంలో ఐదేళ్లల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి. 30 ఏండ్లయినా పూర్తి కాదన్నాం. 16 వేల కోట్లు కాదు 50 వేల కోట్లు కావాలన్నాం. అదే జరిగింది. ఆలస్యానికి కారకులెవరు? సర్వం త్యాగం చేసిన నిర్వాసితులా? జాతీయ ప్రాజెక్టు అన్న బీజేపీనా? బీజేపీ పంచన చేరి కాలక్షేపం చేసిన టీడీపీ కారణమా? బీజేపీ అడుగులకు మడుగులొత్తుతున్న వైసీపీనా? సమాధానం చెప్పాలి. నిర్వాసితులు కారణమని పాలకపార్టీలు ప్రచారం చేస్తున్నాయి. ప్రాజెక్టులో ఎవరికి ముందు ప్రాధాన్యమివ్వాలి? భూములు, ఇండ్లు త్యాగం చేసిన లక్ష కుటుంబాలకు కాదా? వాళ్ల రక్తాన్ని, ప్రాణాలను, బతుకులను చిదిమేసి అభివృద్ధిని మనం ఆస్వాదిద్దామా? పోలవరం వలన అయ్యే సశ్యశ్యామలంలో నిర్వాసితులకు భాగస్వామ్యం వద్దా? నిర్వాసితుల సమస్య రాష్ట్రానిది, మనది, ప్రజలందరిది. సమాజమంతా అండగా నిలబడి వారికి మద్దతివ్వాలి. ఏం జరిగినా తలొంచుకొని పోతారులే అనుకుంటే తిరుగుబాటు చేస్తారు. అలాంటి తిరుగుబాట్లు కోరుకుందామా? కోరుకోకూడదు. ప్రభుత్వం బాధ్యతగా సమస్యలు పరిష్కరించాలి. ఈసారి వరదలొస్తే కొండలెక్కరు.ఏపీ సీఎం జగన్ ఇల్లెక్కుతారు. తాత్కాలిక చర్యలపై సర్కారు అఖిలపక్షం వేసి గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులతో చర్చించాలి. కేంద్రం నిధులివ్వమంటే అప్పటి రేట్లు ఇప్పటి రేట్లనడానికి ఇదేమన్నా కూరగాయల బేరమా? ఎంతైతే అంతా ఇవ్వాలి. తొలిదశకు 12 వేల కోట్లని ఎన్నికల గిమ్మిక్కు చేస్తోంది బీజేపీ. తరచు ఢిల్లీ వెళుతున్న జగన్ ఎందుకు కేంద్రాన్ని నిధులు అడగట్లేదు. ఎందుకోసం మీ ములాఖత్‌లు, దండాలు దస్కాలు? సీఎంకు సిమెంట్, స్టీలు, ఇసుక మీద ప్రేమ. కమీషన్లొస్తాయని కాంట్రాక్టర్లపై ప్రేమ. మనుషులను పట్టించుకొనే పరిస్థితి లేదు. రాష్ట్రంలో ప్రజలకు సమస్యొస్తే తీర్చాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే. ఈమధ్య సీఎం తాను ప్రజల పక్షం అంటున్నారు. ప్రజలపక్షమో కాంట్రాక్టర్ల పక్షమో తేల్చుకోవాలి. పాదయాత్ర ప్రభుత్వాలకు కంటి పరీక్ష. చూడకపోతే పోరాటం ఉధృతం చేసి ఎన్నికల్లో వారిని గద్దె దించుతారు.

పాలనను స్తంభింపజేస్తాం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దిగిరాకపోతే ప్రతి గ్రామాన్నీ రణ క్షేత్రం చేస్తామని, పాలనను స్తంభింపజేస్తామని, సచివాలయాలను నడవనీయమని సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు హెచ్చరించారు. పాదయాత్ర తరువాత పది పదిహేను రోజులు చూస్తాం. ప్రభుత్వం స్పందించకపోతే విశాల మద్దతుతో ఐక్య పోరాటాన్ని ఉధృతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తాం. పోరాటం చివరికంటా సాగుతుంది. ముందు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించమంటే ప్రభుత్వం ముందు డ్యామేనంటోంది. నిరుడు జులైలో వచ్చిన వరద నిర్వాసితులకు పీడకలగా మారింది. వరదంటే ఉలిక్కిపడుతున్నారు. ఈ వరదలు ప్రభుత్వ సృష్టి. నదికి అడ్డంగా కట్ట కట్టడం వలన వరదలొస్తున్నాయి. పాదయాత్రలో తెలియని నిర్వాసితుల బాధలు అనేకం తెలిసొచ్చాయి. పట్టాలు, మందులు, మంచినీళ్లు సైతం అందించకుండా నిరుడు వరద సహాయ చర్యలపై ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ యేడు కూడా ముందస్తుగా ఏమీ సిద్ధం చేయలేదు. ఈసారి వరదొస్తే తాడేపల్లి ప్యాలెస్ ఎక్కుతారు. అశాస్త్రీయ కాంటూరు లెక్కలతో మభ్యపెట్టి మోసం చేస్తోంది సర్కారు. నిరుడు వరదలకు మునిగిన అన్ని గ్రామాలనూ ముంపు గ్రామాలుగా ప్రకటించి ఆర్ అండ్ ఆర్ అమలు చేయాలి. సీఎం జగన్ ఎందుకు ఢిల్లీ వెళుతున్నారు. కేంద్రం కాళ్లు పట్టుకుంటారో కాలర్ పట్టుకుంటారో పోలవరం నిర్వాసితుల గురించి చర్చించి నిధులు తీసుకురండి. తీసుకురాలేకపోతే రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి ఇవ్వండి. లేదంటే మీ స్వంత ఆస్తులమ్మి ఇవ్వండి. చిన్న సమస్యలపై రీజాయిండర్లు, ఫ్యాక్ట్ చెక్ అనే మీరు పోలవరం నిర్వాసితులపై ఎందుకు సమాధానం చెప్పట్లేదు?...

మీ వెంటే రాష్ట్రం

పోలవరం నిర్వాసితుల పోరాటం వెనుక ఈ రాష్ట్రం, కోట్లాది మంది ప్రజలు ఉన్నారని ఏపీ మాజీ మంత్రి, రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. మహాధర్నాకు ఆయన సంఘీభావం, పాదయాత్రికులకు అభినందనలు తెలియజేశారు. మీ ఆవేదనను, కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమకు కూడా ఇరిగేషన్ సదుపాయం కల్పించాలంటే పోలవరం అవసరం. అందుకే ప్రజలు బయటికి రాకపోయినా హృదయాంతరాల్లో నిర్వాసితులకు మద్దతిస్తున్నారు. మీకు వ్యతిరేకం చేస్తే ప్రభుత్వానికి బుద్ధి చెపుతారు. అమాయకులులే ఏం చేసినా ఊరుకుంటారనుకుంటే పొరపాటు. జార్ఖండ్‌లో మోడీ సర్కారు అదానీకి వేల ఎకరాలు కట్టబెట్టచూస్తే రైతులు ఎదురుతిరిగారు. చివరికి ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పారు. నిర్వాసితుల సమస్య ఆషామాషీగా తీసుకుంటే ఇక్కడా అటువంటి గుణపాఠం తప్పదు. ధర్నాలో ఇంకా ఇతర వామపక్ష పార్టీల నాయకులు, సంఘాల నేతలు ప్రసంగించారు. తొలుత ఆహ్వానితులను సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు స్వాగతం పలికారు.

నేటి నుంచి జీపీ వర్కర్ల సమ్మె

విధులు బహిష్కరించనున్న 60 వేల మంది కార్మికులు, ఉద్యోగులు

- మల్టీపర్పస్ విధానం రద్దు, వేతనాల పెంపుపైనే పట్టు
- 14 డిమాండ్లతో ముందుకు
- సమ్మెకు పాలకమండలి, ప్రజలు సహకరించాలి : జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లనున్నారు. 60 వేల మంది కార్మికులు విధులను బహిష్కరించనున్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు, వేతనాల పెంపుపైనే ప్రధానంగా వారు పట్టుపడుతున్నారు. 14 డిమాండ్లతో గత నెల ఐదో తేదీన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ రామారావుకు సమ్మెనోటీసు అందించినా సర్కారు నుంచి కనీస స్పందన రాలేదు. చర్చలకూ పిలవలేదు. ఈ నేపథ్యంలోనే పంచాయతీ కార్మికులు, కారోబార్లు, బిల్‌కలెక్టర్లు సమ్మెలోకి వెళ్తున్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు, కారోబార్, బిల్‌కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్, జీవో నెంబర్ 60 అమలు, తదితదిర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నారు. వారికి ఇప్పటిదాకా గ్రామపంచాయతీ నిధుల ద్వారా వేతనాలు ఇస్తున్నారు. మొన్నటిదాకా రూ.8,500 వేతనం అందగా..ప్రస్తుతం రూ.9,500 వేతనం దక్కుతున్నది. ఆ వేతనమూ ఇద్దరు, ముగ్గురు కార్మికులు పంచుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల ఒక్కొక్కరికి రూ.3 వేల నుంచి నాలుగు వేల రూపాయల వరకు మాత్రమే వస్తున్నది. అదీ నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నది. 11 నెలల నుంచి వేతనాలు ఇవ్వని జీపీలు కూడా ఉన్నాయి.

ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా వేతనాలివ్వాలనే డిమాండ్‌ను పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు తెరపైకి తెచ్చారు. బియ్యం, ఉప్పు,పప్పు ఇలా నిత్యావసరాల ధరలు భగభగ మండిపోతున్న క్రమంలో నాలుగైదు వేల రూపాయలతో ఇల్లు ఎలా గడుస్తుందని ప్రశ్నిస్తున్నారు. వేరే పనికి కూడా వెళ్లలేని దౌర్భాగ్య పరిస్థితి వారిది. ఉదయం ఆరు గంటలకు డ్యూటీకెక్కితే మధ్యాహ్నం 11 నుంచి 12 గంటల ప్రాంతంలో విధులు నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఇంత వండుకుని తిని మళ్లీ సాయంత్రం కూడా పనిచేయాల్సిన దుస్థితి నెలకొంది. మోరీలు తీస్తూ, మలం ఎత్తిపోస్తూ గొడ్డుచాకిరీ చేస్తున్నా తమ శ్రమను గుర్తించరా? అని పాలకులను ప్రశ్నిస్తున్నారు. పీర్సీలో కనీస వేతనంగా నిర్ణయించిన రూ.19 వేలను వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. ఎస్‌కే.డే ఇన్సూరెన్స్ పథకాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని ప్రతిపాదననూ సర్కారు ముందు పెట్టారు. మల్టీపర్పస్ విధానం కార్మికుల ప్రాణాలను హరిస్తున్నది. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కరెంటు పనిరాకపోయినా అతన్ని స్తంభంపైకి బలవంతంగా ఎక్కించగా..అతను విద్యుద్ఘాతంతో చనిపోయిన విషయం తెలిసిందే. నల్లగొండ, సిద్ధిపేట, కామారెడ్డి, తదితర జిల్లాల్లో ట్రాక్టర్లు బోల్తా పడి కార్మికులు చనిపోయారు. ఈ నేపథ్యంలోనే మల్టీపర్పస్ విధానం రద్దు అంశాన్ని కార్మికులు ప్రధాన డిమాండ్‌గా ఎత్తుకున్నారు. 2023 వచ్చినా 2011 జనాభా లెక్కల ప్రకారమే గ్రామాల్లో పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. దీంతో తక్కువ మంది కార్మికులు ఎక్కువ పనిచేయాల్సి వస్తున్నది. ఈ క్రమంలోనే అవసరమున్న చోట కొత్త సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. పంచాయతీ కార్మికులు, ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాదబీమా, యూనిఫారాలు, అలవెన్స్‌లు, తదితర సౌకర్యాలను వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మికులు చేస్తున్న డిమాండ్లన్నీ న్యాయమైనవే. వీటిని పరిష్కరించాల్సిన బాధ్యత సర్కారుదే.

డిమాండ్లు నెరవేర్చేదాకా సమ్మెలోనే

డిమాండ్లను పరిష్కరించే దాకా పంచాయతీ కార్మికులు, కారోబార్లు, బిల్‌కలెక్టర్లు సమ్మెలోనే ఉంటారు. ఇప్పటికే అధికారులు ఎన్నోసార్లు హామీలిచ్చారు. చేతులు దులుపుకున్నారు. హామీలు కాదు అమలు చేసేదాకా సమ్మె చేస్తాం. ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, పీఆర్సీ ద్వారా ఉద్యోగులకు, వేల వేల రూపాయల జీతాలు పెంచుకున్నరు కదా. మేం వద్దనట్లేదు. ఊర్లల్లో మోరీల్లోని మలమూత్రాలను ఎత్తిపోసి, ఇంటింటికీ పోయి కుళ్లిన చెత్తను తీసుకెళ్లి శుభ్రం చేస్తున్న కార్మికులు ముష్టి వెయ్యి రూపాయల వేతనం పెంచుతారా? జీపీ కార్మికుల్లో నూటికి 90 శాతానికిపైగా దళితులే ఉన్నారు కాబట్టి వివక్ష చూపుతున్నారా? ఇదెక్కడి అన్యాయం. వారికి కనీస వేతనాలు ఇవ్వాల్సిందే. ప్రాణాలు తీస్తున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి. అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలి.

తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్

స్టడీసర్కిల్‌లో సివిల్స్ కోచింగ్ ఎంపికకు 9న పరీక్ష

- నేటినుంచే హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ : డైరెక్టర్ శ్రీధర్

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన రాష్ట్ర స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ మెయిన్స్ (పది నెలల రెసిడెన్షియల్) కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు బుధవారం నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశమున్నది. ఈ మేరకు స్టడీసర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 3405 మంది అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈనెల తొమ్మిదిన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రాతపరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు స్టడీసర్కిల్ వెబ్‌సైట్ www.tsstudycircle.co.in ను సంప్రదించాలని కోరారు.

సెమీకండక్టర్ల సాంకేతికత యుద్ధంలో చైనా ప్రతీకారం

బీజింగ్: సెమీకండక్టర్ల తయారీలో సాంకేతికతను అభివృద్ధి చేయ టంపై అమెరికా ప్రోత్సాహంతో తనపైన విధించిన ఆంక్షలను చైనా తట్టు కుని నిలబడటమే కా కుండా.. ఎలక్ట్రానిక్ చిప్‌ల తయా రీలో ఉపయోగించే అరుదైన మౌలిక ముడిసరుకుల ఎగుమతులపై తానే నియంత్రణ విధిం చింది. చైనీస్ వాణిజ్య మంత్రిత్వ శాఖ విధించిన ఎగుమతి నియంత్రణలు ఆగస్టు 1వ తేదీనుంచి అమలులోకి వస్తాయి. కంప్యూటర్ చిప్స్ తయారీ లోను, సోలార్ ప్యానల్స్, అధునాతన రాడార్లలో వాడే పరికరాలవంటి అనేక ఉత్పత్తుల తయారీలోను వాడే గ్యాల్లియం, జర్మేనియం అనే అరుదైన లోహాల ఎగుమతుల పై ఈ నియంత్రణలు ఉంటాయి. జాతీయ భద్రతకు సంబంధించిన సమస్యల కారణంగా ఈ లోహాలను, వీటితో ఉత్పత్తి అయ్యే ఉత్పత్తులను ఎగుమతి చెయ్యాలంటే ఎగుమతిదారులు "ప్రత్యేక అనుమతి" తీసుకోవలసి ఉంటుందని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.

గ్యాల్లియం ఉత్పత్తిలో ప్రపంచంలో చైనాదే అగ్రస్థానం. అలాగే జర్మే నియంకు సంబంధించి చైనా ప్రధాన ఎగుమతిదారు. ఈ రెండు లోహాలను అత్యంత అవసరమైన ముడిసరుకులుగా యూరోపియన్ యూనియన్ ప్రకటించింది. అంటే ఐరోపా ఆర్థిక వ్యవస్థకు ఈ లోహాలు కీలకమైనవిగా యూరోపియన్ యూనియన్ భావిస్తున్నది. అమెరికా జియోలాజికల్ సర్వేని అనుసరించి 1987నుంచి అమెరికా గ్యాల్లియంను ఉత్పత్తి చేయలేదు. 2018-2021 మధ్యకాలంలో అమెరికా దిగుమతి చేసుకున్న గ్యాల్లియంలో 53శాతం చైనా నుంచి దిగుమతి చేసుకుంది. ఎలక్ట్రానిక్ చిప్స్ తయారీకి, కృత్రిమ మేధకు అవసరమైన సాంకేతికత ను చైనా అభివృద్ధి చేయకుండా అడ్డుకట్టవేయటానికి అమెరికా ప్రోద్బలంతో చిప్స్ తయారీకి ఉపయోగించే లితోగ్రఫీ మెషినరీని చైనాకు ఎగుమతి చేయకుండా డచ్ ప్రభుత్వం ఇటీవల ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో చైనా ఈ లోహాల ఎగుమతులపైన నియంత్రణలను విధించింది. డచ్ ప్రభు త్వ చర్య గర్హనీయమైనదని, అమెరికా "ప్రపంచాధిపత్యాన్ని" కొనసాగిం చటం కోసం ఇతర దేశాలపైన వత్తిడితెచ్చి ఇటువంటి పనులను చేయిస్తున్నదని చైనా విమర్శించింది. ప్రపంచ సెమికండక్టర్ సరఫరా గొలుసులో స్థిరత్వం కొనసాగాలంటే ఎగుమతి నియంత్రణలు ఉండకూడదని చైనా హితవు పలుకుతోంది. రెండు ముడి లోహాల ఎగుమతులపై చైనా విధించిన నియంత్రణలు ఎలక్ట్రానిక్ చిప్స్ తయారీకోసం అస్తిత్వంలోవున్న సరఫరా గొలుసులో స్థిరత్వంపైన హెచ్చరికగా భావించాలి. అమెరికా, దాని మిత్రదేశాలు చైనా పైన విధించిన ఆంక్షలకు ప్రతీకారంగా చైనా అరుదైన రెండు లోహాల ఎగు మతులపై నియంత్రణలను విధించింది. అంతేకాదు అధునాతన ఎలక్ట్రానిక్ చిప్స్ తయారీలోను, వాటి తయారీకి ఉపయోగించే లితోగ్రఫీ మెషినరీ తయారీలోను ఈ మధ్యకాలంలో చైనా గణనీయమైన విజయాలను సాధించింది. దానితో చైనాపైన ఆంక్షలను విధించిన అమెరికాలోనే సెమి కండక్టర్ పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

కాంగ్రెస్‌లో విలీనమే సరా?

అంతర్మథనంలో పార్టీ శ్రేణులు

- కాంగ్రెస్‌లో ఇమడలేమన్న అనుమానాలు
- ఏ దిక్కుకు వెళ్లాల్లో తెలియని దైన్యం
- ఇన్నేండ్ల శ్రమంతా వృథానేనా?అంటూ అసహనం
- రెండు నెల్లుగా విలీన తంతు నడుస్తుందని గుసగుసలు
- షర్మిల తెలంగాణలోనా? ఆంధ్రలోనా?



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల తమ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయబోతున్నారా?ఇందుకు ఆ పార్టీ రెండో శ్రేణి నేతలంతా సుముఖంగా ఉన్నారా? రాష్ట్రంలో అన్ని నియోజక వర్గాల్లో పోటీచేయించాలన్నా తగిన అభ్యర్థులు దొరికే పరిస్థితి లేనప్పుడు ఆ పార్టీని నడిపించడం సాధ్యమా? షర్మిలమ్మ వన్‌మెన్ షోతో ఆ పార్టీ మనుగడ ఎంత కాలం ఉంటుంది? ఇత్యాది ప్రశ్నలు ఆ పార్టీ శ్రేణుల్లో వెల్లువెత్తుతున్నాయి. మరి కొందరు పార్టీని నడపడమంటే ఆశామాషి కాదు సుమీ అంటూ..వైఎస్ ఆశయాలు నెరవేరాలంటే.. విలీనమే కరెక్టు అంటూ కుండబద్దలు కొడుతున్నారు. మరో వైపు రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. దీంతో ఆయా పార్టీల్లోని నేతలు అటునుంచి ఇటు..ఇటు నుంచి అటు దూకుతున్నారు. నిన్న వైరి వర్గంగా ఉన్నవారు..నేడు ఆలింగనాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో షర్మిల నేతృత్వంలోని వైఎస్‌ఆర్‌టీపీ దారెటు? అంటూ నెల రోజులుగా విస్తృతంగా చర్చ సాగుతున్న విషయం తెలిసిందే.

పార్టీ శ్రేణుల్లో ఆందోళన..

వైఎస్‌ఆర్‌టీపీ ఏర్పాటు నుంచి ఆ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న వారూ ఉన్నారు. మధ్యలో వెళ్లిన, వచ్చిన వారూ ఉన్నారు. ముఖ్యంగా వైఎస్‌ఆర్ అభిమానులు కాంగ్రెస్ పార్టీని కాదని వైఎస్‌ఆర్ టీపీలో పని చేస్తున్న వారూ లేకపోలేదు. వీరంతా కాంగ్రెస్‌లో ఇమడగలరా? అంటూ పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మరి కొందరు పార్టీ నేతలైతే..'గుర్తింపు' గురించి ఆందోళన చెందుతున్నారు.మరి కొందరైతే.. ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాల్లో పార్టీని 'హస్తం'లో విలీనం చేయడం ఒక్కటే ఆమెకు దారిగా కనిపిస్తున్నదని చెబుతున్నారు. పార్టీకి సరైన కేడర్ లేకపోవడం, ఒంటరిగా ఎన్నికలకు వెళ్తే ఓట్లు పడవని, డిపాజిట్లు గల్లంతవు తాయనే భయంతో విలీనం వైపే ఆమె మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తున్నది.

ఈ విషయంపై ఇప్పటికే కాంగ్రెస్ నేత కర్నాటక ఉపముఖ్యమంత్రి పార్టీ అధిష్టానంతో డీకే శివకుమార్‌తో జరిపిన చర్చలు పూర్తి కావొచ్చాయనీ, సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేవీపీ చేసిన వ్యాఖ్యలు కూడా ఇదే రూఢీ చేస్తున్నాయని ప్రజల్లో చర్చ జరుగుతోంది.

షర్మిల ఎక్కడంటూ చర్చ..

పరిస్థితులు మారినప్పుడు వారు వీరవుతారు, వీరు వారవుతారన్నట్టు షర్మిల పార్టీ పరిస్థితి కనిపిస్తున్నది. విలీనమైతే షర్మిల తెలంగాణలోనా? ఆంధ్రలోనా? అంటూ ముమ్మరంగా చర్చ సాగుతోంది. ముందు విలీనమైన తర్వాత...వైఎస్‌ఆర్ కూతురుగా పార్టీకి ఎక్కడ అవసరముంటే అక్కడ పనిచేస్తారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. తెలంగాణలో అధికారంలోకి రాబోయేది వైఎస్సార్‌టీపీయేననీ, సీఎం కాబోయేది కూడా తానేనని షర్మిల పలుమార్లు బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఇతర పార్టీల లీడర్లు తమకు అక్కర్లేదనీ, తామే నాయకులను సృష్టించుకుంటామని ప్రస్తావించారు.



అయితే పార్టీలోనే గుర్తింపు ఉన్న నేతలెవరూ లేకపో వడంతో కేడర్ క్రమంగా తగ్గుతూ వస్తున్నది. పార్టీ ఇలాగే ఉంటే ఉనికికే ప్రమాదమని భావించినందునే ఆమె కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది. కర్నాటక ఫలితాలు సాకుగా అక్కడి కాంగ్రెస్ నేత డీకే శివ కుమార్‌తో నేరుగా భేటీ అయిందని ద్వితీయ శ్రేణి నేతలు చెవులు కొరుక్కుంటున్నారు.

ఒంటరి పోరాటం..

తెలంగాణలో సంక్షేమ పాలన లేకుండా పోయిందని 2021 ఫిబ్రవరి 9న షర్మిల వైఎస్సార్‌టీపీని స్థాపించారు. నాటి నుండి రెండేండ్లుగా ఒంటరిగానే పోరాడుతున్నారు. నిరుద్యోగుల ఆత్మహత్యలు మొదలు, టీఎస్‌పీఎస్ పేపరు లీకేజీల వరకు, పాదయాత్రలు, ధర్నాలు, దీక్షలు ఇలా అనేక రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో కేసులు, అరెస్టులను ఎదుర్కొంది. రాష్ట్రంలో రాజన్న రాజ్య స్థాపనే లక్ష్యంగా ప్రచారం సాగించింది. కానీ.. ఇప్పుడు ఒక్కసారిగా విలీన వార్తలు లీకులవ్వటంతో ఎవరికి తోచిన రీతిలో వారు విశ్లేషించుకుంటున్నారు. వైఎస్‌ఆర్ సంక్షేమ పాలన్ను కాంగ్రెస్ ద్వారానే సాధ్యమని ఆమె భావించి ఉంటారని ముక్తాయించుకుంటున్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధంకండి

- వర్సిటీల నిర్వహణలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కృషి కీలకం: సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- ఓయూ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సదస్సు



నవతెలంగాణ- ఓయూ

యూనివర్సిటీలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్లో మంగళవారం ఓయూ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పాలడుగు భాస్కర్ మాట్లాడారు. రాష్ట్రంలో 18 యూనివర్సిటీలలో సుమారు పదివేల మంది సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. విశ్వవిద్యాలయాల కార్యకలాపాల నిర్వహణలో సిబ్బంది కృషి చాలా కీలకమని రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు ప్రశంసించింది కానీ వారి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి ఇప్పటివరకు చేయలేదన్నారు. ఇప్పటికైనా హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులు అందరూ ఐక్యంగా పోరాడితే మన హక్కులు సాధించుకోవచ్చని సూచించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జులై 7న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్జీవో అధ్యక్షులు జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో ఉన్న కార్మికులందరం ఐక్యంగా పోరాడాలని, మీ పోరాటాలకి ఎన్జీవో ఆర్గనైజేషన్ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు.

ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జె.వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్రం వచ్చి తొమ్మిది సంవత్సరాలు కావస్తున్నా కార్మికులను ఇప్పటికీ పర్మినెంట్ చేయకపోవడం దుర్మార్గం అన్నారు. ఓయూ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలలో కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలలో ఏజెన్సీల ద్వారా అవుట్‌సోర్సింగ్ కార్మికుల నియామకాలు జరిపి వారి వేతనాలలో కోత విధిస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. కార్మికులకు బస్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ అయిన సిబ్బందికి రూ. 5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ విట్టల్‌గౌడ్, ఉపాధ్యక్షులు వెంకటయ్య, గోవింద్, టెక్నికల్ అధ్యక్షులు నాగరాజు, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శివశంకర్, ఓయూ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ జనరల్ సెక్రెటరీ సీతారాం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రావు, ఉపాధ్యక్షులు అనసూయ, నాయకులు పుష్పలత, రాణి, మహేందర్ మక్సూద్, యాదగిరి, సీతయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మృతి

- భారత్ కళాశాలకు చెందిన విద్యార్థులుగా గుర్తింపు
- ఇబ్రహీంపట్నం రాయపోలు వద్ద ఘటన



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయపోలు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందారు. ఇబ్రహీంపట్నం పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరుకు చెందిన ఎస్.నారాయణరెడ్డి (19), లంగర్ హౌస్ డిఫెన్స్ కాలనీకి చెందిన ఈ.భాను ప్రసాద్ (19), హస్తినాపూర్‌కు చెందిన కె.నవీన్(19) ముగ్గురు విద్యార్థులు ఇబ్రహీంపట్నం సమీపంలోని భారత్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరు ముగ్గురూ ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోలు నుంచి ఇబ్రహీంపట్నం వైపు బైకుపై వస్తున్నారు. కాగా ఇబ్రహీంపట్నం నుంచి రాయపోలు వైపు వెళ్తున్న ఓ కారు.. జనహర్ష దాటిన తర్వాత హెచ్‌బీ పెట్రోల్ పంప్ వద్దకు రాగానే కారు, బైక్ ఒక్కసారిగా ఢీకొన్నాయి. కారు, బైక్ ఇరువురూ అతివేగంతో ఉండటంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు. కారులో రెండు హెయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న వారికి పెను ప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఇబ్రహీంపట్నం సీఐ రామకృష్ణ తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామపంచాయతీల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరిం చాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావుకు మంగళవారం ఆయన లేఖ రాశారు.రాష్ట్రవ్యాప్తంగా 12,760 గ్రామపంచాయతీల్లో 50 వేల మంది సిబ్బంది పారిశుధ్యయ కార్మికులు, స్వీపర్లు పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లుగా వివిధ కేటగిరీల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. పంచాయతీల్లో జీవోనెంబర్ 51 ద్వారా మల్టీ పర్పస్ విధానాన్ని తెచ్చి కేటగిరీలను రద్దు చేసి నైపుణ్యం రకరకాల పనులు చేయించడం వల్ల కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారనీ, ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపోయిన కుటుంబాలకు కనీసం పరిహారమైనా ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

పంచా యతీలకు జనాభాను బట్టి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామనీ, కొత్త చట్టం రూపొందించి పటిష్టం చేస్తామని వేతనాలు పెంచి వారికి ప్రత్యేక తరహాలో నిర్ణయాత్మకమైన ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. జీవోనెంబర్ 60 ప్రకారం నిర్ణయించిన వేతనాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. పంచాయతీల్లో పెరుగుతున్న జనా భాకు అనుగుణంగా కొత్త నియామకాలు చేసు కుంటూ పాత కార్మికుల వేతనాలే కొత్తవారికి పంపకాలు చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వానికి, అధికారులకు అనేక విజ్ఞప్తుల తర్వాత కూడా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గురువారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నారని తెలిపారు.

కార్మికులు రెక్కలు ముక్కలు చేసుకుని గ్రామాలను శుభ్రం చేసి అద్దంలా తీర్చిదిద్ది ప్రజల ఆరోగ్యాలను కాపాడు తుంటే ప్రభుత్వం వారిపట్ల వివక్షత చూపడం తగదని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

డిమాండ్లు...

- జీవోనెంబర్ 60 ప్రకారం నెలకు స్వీపర్లకు రూ.15,600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500 వేతనంగా నిర్ణయించాలి. లేదా పీఆర్సీ మినిమం బేసిక్‌పేను రూ.19 వేలు చెల్లించాలి. ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలివ్వాలి. సిబ్బందిని పర్మినెంట్ చేయాలి.
- జీవోనెంబర్ 51ని సవరించాలి. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి.
- పంచాయతీల్లో అవసరాన్ని బట్టి డీపీవో అనుమతి ప్రకారం కొత్త నియామకాలు చేసి, వేతనాలు పెంచాలి. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, గ్రాట్యూటీ, వారాంతపు సెలవులు వంటి సౌకర్యాలు కల్పించాలి. గుర్తింపు కార్డులివ్వాలి. ఎనిమిది గంటల పనివిధానాన్ని అమలు చేయాలి.
- ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం రూ.10 లక్షలివ్వాలి. ఇన్సూరెన్స్ రూ.5 లక్షలతోపాటు ఒకరికి ఉద్యోగమివ్వాలి.
- అక్రమ తొలగింపులు ఆపాలి. యూనిఫారం, చెప్పులు, సబ్బులు, గ్లౌజులు, మాస్కులు తదితర సౌకర్యాలు కల్పించాలి.

సన్‌సిటీ వద్ద కారు బీభత్సం

- వాకింగ్‌కు వెళ్లిన తల్లీకూతురిని ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ఇద్దరు మృతి
- మరో ఏడుగురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-గండిపేట్

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం బండ్లగూడ సన్‌సిటీ వద్ద కారు బీభత్సం సృష్టించింది. కారు డ్రైవర్ నిద్రమత్తులో అతివేగంగా డ్రైవ్ చేయడంతో మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన తల్లీకూతుళ్లను కారు బలంగా ఢీకొట్టింది. దాంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. నార్సింగి ఎస్ఐ సతీష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్షాకోట్‌లోని శాంతినగర్‌కు చెందిన తల్లీ కూతుళ్ల అనురాధ (48), మమత (26) ఇద్దరూ మంగళవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లారు. లంగర్‌హౌజ్ నుంచి అప్పా వైపు వెళ్తున్న కారు.. అప్పా రేడియల్ రోడ్డుపై టర్నింగ్ వద్ద అదుపు తప్పి వాకింగ్ చేస్తున్న తల్లీకూతుళ్లను ఢీకొట్టింది. ఈ ఘటనలో తల్లీకూతురు అక్కడికక్కడే మృతిచెందారు. ఏడుగురు గాయపడగా వారిని స్థానిక ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ఈ ఘటన జరిగినట్టు పోలీసులు గుర్తించారు. మృతుల్లో అనురాధ గృహిణి కాగా ఆమె కూతురు మమత బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఘటనా స్థలం నుంచి పరారైన కారు డ్రైవర్‌ను పోలీసులు సాయంత్రం పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మైదానాలు

మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలో క్రీడా మైదానాలను సిద్ధం చేస్తు న్నామని మంత్రులు వి శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో 1988 ఒలంపిక్స్ క్రీడల సందర్భంగా నిర్మించిన క్రీడా మైదానాలను పరిశీలించినట్టు వారు తెలిపారు. భవిష్యత్తులో ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్ లాంటి అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించేందుకు దేశానికి అవకాశం వస్తే ఆ క్రీడలను రాష్ట్రంలో నిర్వహించేందుకు మైదానాలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇక్కడి నుంచి దేశానికి ఎక్కువ మంది అంతర్జాతీయ క్రీడాకారులను అందించడమే లక్ష్యంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 17వేల గ్రామీణ క్రీడా ప్రాంగణాలను నిర్మించామని పేర్కొన్నారు. మహబూబ్ నగర్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం లాంటి పట్టణాల్లో అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రాంగణాలను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సీఎం కప్ క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించామని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో గోల్ఫ్ కోర్టు పేరుతో షామీర్ పెట్ లో 230 ఎకరాల భూమి లీజుకు తీసుకున్న సంస్థపై నిబంధనలు పాటించని కారణంగా న్యాయ పోరాటం చేసి లీజును రద్దు చేసి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రపంచంలోనే అత్యుత్తమ క్రీడా విధానాన్ని అమలు చేయబోతున్నామని తెలిపారు. ఈ పర్యటనలో తెలంగాణ పర్యాటక శాఖ ఎమ్‌డీ మనోహర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆర్వి కర్ణన్ పాల్గొన్నారు.

గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలివ్వాలి

- ఇండ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలి : జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ధర్నా, భారీ ర్యాలీ



నవతెలంగాణ - ములుగు

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని, ఇండ్లు లేని వారికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని తెలంగాణ ప్రజాసంఘాల ఐక్య పోరాట వేదిక రాష్ట్ర నాయకులు సూడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం పేదలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అంతకు ముందు డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు.తీశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు ఎండీ అమ్జద్ పాషా అధ్యక్షతన జరిగిన ధర్నాలో సూడి కష్టారెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఇల్లు లేని పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు నిర్మించి ఇస్తామన్న ప్రభుత్వ వాగ్దానం అమలుకు నోచుకోలేదన్నారు. సొంత ఇంటి స్థలం లేని నిరుపేదలు ప్రభుత్వంపై ఆశతో ఏండ్ల తరబడి ఎదురు చూసి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారని తెలిపారు.

రాష్ట్రంలో 65 కేంద్రాల్లో సుమారు లక్ష మందికి పైగా పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, వారందరికీ ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా పస్రాలో వందలాది మంది పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, వారికి ఇండ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు.. భూ కబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికార పార్టీ అండదండతో అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు.

కానీ పేదలు 100 గజాల స్థలం ఆక్రమిస్తే పోలీసులు వారి ఇండ్లను కూలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో భవిష్యత్తులో విస్తృత పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ధర్నాలో రైతు సంఘం జిల్లా నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ గఫూర్ పాషా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఐద్వా జిల్లా నాయకులు కవిత, కారం రజిత, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొచ్చు సంజీవ, రత్నం ప్రవీణ్, గుడిసెవాసులు, తదితరులు పాల్గొన్నారు.

పాత వాటర్ బాటిల్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం

- మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో ఘటన



నవతెలంగాణ-రాజేంద్రనగర్

రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత వాటర్ బాటిల్ గోదాంలో సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి దాటిన తర్వాత టాటానగర్‌లోని ప్లాస్టిక్ వాటర్ బాటిల్ గోదాంలో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. ఆ గోదాంలో ప్లాస్టిక్ పెద్ద ఎత్తున నిల్వ ఉండటంతో భారీగా మంటలు ఎగిసిపడి పక్క గోదాంకి వ్యాపించాయి. ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగలు వ్యాపించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఐదు ఫైర్ ఇంజన్లు నాలుగు గంటలు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ప్రమాద సమయంలో గోదాంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం సంభవించిందని యాజమాని పోలీసులకు తెలిపారు. ఈ ఘటనకు షార్ట్ సర్క్యూట్ కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ వ్యతిరేకశక్తులను కేసీఆర్ విడదీసే ప్రయత్నం

- కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిమయం
- ఒక్క ఎకరాకూ నీళ్లివ్వకుండా రూ.80వేలకోట్లు ఖర్చు
- ప్రజాభిమానం ముందు తోకముడిచారు
- జనగర్జన సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు : సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ఖమ్మం

పాట్నాలో జరిగిన బీజేపీ వ్యతిరేక పార్టీల కూటమి సమావేశానికి వచ్చిన అఖిలేష్‌యాదవ్‌తో సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో విడిగా మంతనాలు జరుపుతూ ఐక్యమవుతున్న కూటమి పక్షాలను విడదీసే ప్రయత్నం చేస్తున్నారని సీఎల్పీ నాయకులు మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. ఇలా బీజేపీకి మేలు చేయడానికి బీఆర్ఎస్ కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు వేసిన ప్రతి ఓటూ బీజేపీకే చెందుతుంది కాబట్టి ప్రజలు ఆలోచించాలని కోరారు. ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నట్టు మూడు నెలల నుండే జిల్లా, మండల కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించినట్టు తెలిపారు. ఇది జిల్లా అధికార యంత్రాంగానికి కూడా తెలిసి కూడా ఉద్దేశపూర్వకంగా సభను అడ్డుకోవాలని, విశ్వ ప్రయత్నాలు చేశారన్నారు. అయినా ప్రజా అభిమానం ముందు వారి ప్రయత్నాలు విఫలం చెందాయని తెలిపారు. తండోపతండాలుగా ప్రజలు హాజరై సభను విజయవంతం చేశారన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ద్వారా అదనంగా ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రచార ఆర్భాటాలతో 45 లక్షల ఎకరాలకు నీరు ఇస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాగ్ కూడా కాళేశ్వరం ప్రాజెక్టు విధానాలను తప్పు పట్టిందని గుర్తుచేశారు. ఒక్క ఎకరానికి నీరు ఇవ్వకుండా రూ.80 వేల కోట్లు ఖర్చు పెట్టామని చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ నీళ్ల కోసం అయితే రాష్ట్రం తెచ్చుకున్నామో ఆ నీళ్ల రాకుండా చేస్తున్నారని అన్నారు. అనంతరం ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ మడుపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో భట్టి విక్రమార్కను ఘనంగా సన్మానించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ ఉపాధ్యక్షులు పోట్ల నాగేశ్వరరావు, పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, వడ్డే నారాయణరావు, పుచ్చకాయల వీరభద్రం, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ నాయకులు దాసరి దానియల్, పీపుల్స్ మార్చ్ పాదయాత్ర కన్వీనర్ బుల్లెట్ బాబు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొన్నారు.

సంపాదకీయం

బీజేపీ బండారం

'మేడిపండుచూడు మేలిమై ఉండు... పొట్టవిప్పిచూడు పురుగులుండు' అనే నానుడి రాష్ట్ర బీజేపీకి సరిగ్గా సరిపోతుంది. శుద్ధపుష్పంగా భావించే ఆ పార్టీ బురద బండారం బట్టబయలైంది. ఒక్కొక్కటిగా అసంతృప్త గళాలు విచ్చుకుంటున్నాయి. ఎన్నికల వాతావరణం దగ్గర పడుతున్న కొద్దీ ఆ పార్టీపై మబ్బులు కమ్ముకుంటున్నాయి. లుకలుకల తెప్పలు తరుముకొస్తున్నాయి. చివరకు ఆ పార్టీ అధ్యక్షుడినే తొలగించాల్సిన పరిస్థితి తెచ్చాయి. ఉన్న ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలది తలోదారి. పదవుల కోసం వెంపర్లాట. ముఠాల పోరు, ట్వీట్ల వార్ నడుస్తున్నది. తాజా పరిణామాలే ఇందుకు సాక్ష్యం. నివురు గప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి కాస్తా, ఎమ్మెల్యే రఘునందన్‌రావు రూపంలో పెల్లుబుకింది. 'దుబ్బాకలో గెలుపు నా స్వయం కృషే తప్ప, కమలానిది కాదనడంతోనే' బీజేపీ డొల్లతనం తేటతెల్లమైంది. అలాగే పార్టీ గురించి ఉన్నది ఉన్నట్టు కక్కేశాడాయన. బండి సంజయ్ అవినీతిపరుడనీ, తన కులమే తన ఎదుగుదలకు పెద్ద అడ్డంకి అంటూ చెప్పుకొచ్చాడు. భార్య పుస్తెలతాడమ్మి నామినేషన్ వేసిన బండికి, వందల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలంటూ ప్రశ్నించడం కూడా ఊరువాడా కోడై కూస్తున్నది. ఇకపోతే ఆ పార్టీ అగ్రనేతలు అమిత్‌షా, నడ్డాతోపాటు ఇతర నేతలపైనా ప్రధాని మోడీ కోర్టులో వకాల్తా వేస్తానని విరుచుకు పడటం గమనార్హం. ఇది ఆ పార్టీలోని అంతర్గత కుమ్ములాటలను కండ్లకు కట్టింది. మరి దీనిపై కమలనాథులు 'చింతన్‌బైటక్' చేస్తారో ? లేదో ? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

> ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి బదులు, నేతలకు పదవుల పంపకాలు చేస్తే సరిపోతుందని భావించిన 'మోషా'లకు ఇప్పుడు తెలంగాణ పార్టీలో నెలకొన్న పరిణామాలు దిమ్మె తిరిగేలా చేస్తున్నాయి. త్వరలో జరగనున్న ప్రధాని రాష్ట్ర పర్యటన నేపథ్యంలో, ఆ పార్టీలోని గొడవలు అగ్రనాయకత్వానికి సవాలే. రాజకీయాలు ప్రజలకోసమే గానీ, పదవులు కోసం కాదు. కాకూడదు. ఇప్పుడు తెలంగాణలో తాను తవ్విన గోతిలో తానే పడుతుండటం బీజేపీ వక్ర బుద్ధికి, కుత్సిత రాజకీయాలకు తార్కాణం.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సారథ్య బాధ్యతలు అప్పగించినా, ఆయనా అసంతృప్తితోనే అంగీకరించాడని వార్తలు. తమది క్రమశిక్షణ గల పార్టీ అంటూ గొప్పలు చెప్పుకునే బీజేపీ, తాజా ఘటనలతో ఇరుకున పడుతున్నది. ఇక కాంట్రాక్టులు, పదవుల ఆశతో కాషాయ కండువా కప్పుకున్న ఇతర పార్టీ నేతలంతా తిరుగు ప్రయాణానికి మూటాముల్లే సర్దేస్తున్నారు. తొలి నుంచీ ఈటల బీజేపీలోకి రావడం బండికి ససేమిరా ఇష్టం లేదు. అసంతృప్తితో ఆయన చేసిన ఢిల్లీ టూర్లు, ఆయనకు ఎన్నికల నిర్వహణ అధ్యక్ష పదవీ వచ్చేలా చేయడమేగాక బండి కొంపకు నిప్పుపెట్టాయి. కర్నాటక ఎన్నికలకు ముందు నుంచే రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ పడిపోతున్నదనే సంగతిని కేంద్ర నిఘా సంస్థ ఎప్పుడో హెచ్చరించిదట. మతమనే ఇంధనంతో మంటకాచుకోవడమే తప్ప, రాష్ట్రానికి బీజేపీ ఏం వెలగబెట్టిందో ఇప్పటికీ చెప్పలేకపోతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులిమ్మంటే పక్కనున్న కర్నాటక, మహారాష్ట్రతోపాటు గుజరాత్‌కు తప్ప మరే రాష్ట్రం కేంద్రానికి గుర్తేరాదు. పేదల ఉపాధి నిధులను రూ. 85 వేల కోట్ల నుంచి రూ 35 వేల కోట్లకు తగ్గించిన ఘనత బీజేపీది. ఇప్పుడు ఆయా రాష్ట్రాల్లో ఇతర పార్టీలను చీలుస్తూ దుష్ట రాజకీయాలు చేస్తున్నది. సుపరిపాలన, సుస్థిర ప్రభుత్వాలంటూ గప్పాలు కొడుతూ కాంగ్రెస్ మాదిరిగానే తరచూ ముఖ్యమంత్రులను మార్చడం, ఆయా రాష్ట్రాల అధ్యక్షులను ఇంటికి పంపడం చేస్తూనే ఉంది. అధికారమే పరమావధిగా దుశ్చర్యలన్నీ చేస్తూనే, కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తుతున్నది.

కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి, రెచ్చగొట్టి పబ్బం గడుపుకునేందుకు బీజేపీ చేసే కుట్రలు, కుతంత్రాలు అన్నీ ఇన్నీ కావు. రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకునే ప్రయత్నంలో విలువల వలువలూడగొడుతున్నది. ఆయా రాజకీయ పార్టీల నేతలకు వలవేయడం, ఆనక పట్టించుకోకపోవడమే ఆపార్టీ నైజం. దాన్నే విధానంగా పాటిస్తూ సాగుతున్నది. కలహాల కమలంలో ఇప్పుడు జరుగుతున్న గొడవలు ఆ పార్టీ సంస్కృతిని తెలియజేస్తున్నవి. కాగా పొంగులేటి, జూపల్లిని లాగి తమ గంపకింద కమ్మేసుకుందామనుకున్న ఆ పార్టీ ఆశలు అడియాశలే అయ్యాయి. ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి బదులు, నేతలకు పదవుల పంపకాలు చేస్తే సరిపోతుందని భావించిన 'మోషా'లకు ఇప్పుడు తెలంగాణ పార్టీలో నెలకొన్న పరిణామాలు దిమ్మె తిరిగేలా చేస్తున్నాయి. త్వరలో జరగనున్న ప్రధాని రాష్ట్ర పర్యటన నేపథ్యంలో, ఆ పార్టీలోని గొడవలు అగ్రనాయకత్వానికి సవాలే. రాజకీయాలు ప్రజలకోసమే గానీ, పదవులు కోసం కాదు. కాకూడదు. ఇప్పుడు తెలంగాణలో తాను తవ్విన గోతిలో తానే పడుతుండటం బీజేపీ వక్ర బుద్ధికి, కుత్సిత రాజకీయాలకు తార్కాణం.



పీక్ డిమాండ్ పేరుతో 'కరెంట్ షాక్'!

బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలెవరినీ వదిలేలా లేదు. భారాల మీద భారాలు వేస్తూనే ఉన్నది. తాజాగా విద్యుత్ చార్జీల బాదుడుకు రంగం సిద్ధం చేసుకుంది. పీక్ డిమాండ్ పేరుతో అధిక చార్జీల జీఓ అమలుకు ఆదేశాలు జారీచేసింది. దీన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నది. అయితే ఇప్పటికే కేంద్రం తీసుకున్న నిర్ణయాలతో ప్రజలు నానాయాతన పడుతున్నారు. ఉదాహరణకు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు వల్ల అనేక కష్టనష్టాలు సంభవించాయి. ఇవి చాలవన్నట్టుగా విద్యుత్ చార్జీలు పెంచి కార్పొరేట్ శక్తులకు కడుపునింపే ప్రయత్నం శరవేగంగా అమలు చేస్తున్నది. ప్రతిరోజూ ఉదయం 6గంటల నుండి 10గంటల సమయంలో విద్యుత్తు చాలామందికి వినియోగిస్తారు. ఎందుకంటే ఆఫీసులకు, పాఠశాలలకు వెళ్లే సమయమది. సాయంత్రం ఇంటికి వచ్చిన వాళ్లు అదే సమయంలో పడుకునేముందు వరకూ విద్యుత్‌ను ఎక్కువ వాడుతారు. ఈ సమయాలని అదునుగా తీసుకొని విద్యుత్ ఉదయం, సాయంత్రం వాడకంపై అధిక చార్జీలు వసూలు చేయాలంటూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఎంతవరకు సమంజసం? మోడీ చెప్పే అచ్చేదిన్ ఇదేనా? పర్యావరణం, సాంప్రదాయ ఇంధన వనరులు, జలవిద్యుత్, వాటిని ప్రోత్సహించేందుకు అంటూ దీనిపై కుంటిసాకులు చెబుతోంది.

సంప్రదాయ వనరుల ఇంధనం ఇప్పటికే ప్రయివేటు కార్పొరేటు సంస్థల చేతుల్లోనే ఉన్నాయనేది వాస్తవం. వారికి లబ్ధి చేకూర్చడం, వారికి అధిక ధనం కట్టబెట్టడం కోసమే పీక్ అవర్ పేరుతో జనాన్ని బాదేందుకు సిద్ధమైంది బీజేపీ సర్కార్. ఇప్పటికే గ్యాస్ బండ సబ్సిడీ ఎత్తేసి రూ.1200లు చేశారు. ఇప్పుడు విద్యుత్ సంస్కరణల పేరుతో అధిక చార్జీలు వసూలు చేసే చర్యలకు పూనుకుంటున్నారు. పీక్ అవర్‌లో కరెంటు వాడితే అధిక చార్జీలు చెల్లించాలని, తర్వాత వాడే కరెంటు చార్జీలు 20శాతం రాయితీ అంటూ బంగారం, బట్టల దుకాణాలలో వ్యాపారస్తులు ఇచ్చే డిస్కౌంట్ రూపంలో ప్రకటనలు చేస్తున్నారు. ముందు గానే టారిఫ్ రేట్లు పెంచి దానిలో 20శాతం రాయితీ అంటూ మరో మోసపూరిత వ్యాపారానికి కేంద్రం తెరలేపిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ కొత్త విధానాన్ని తొలుత వాణిజ్య పారిశ్రామిక వినియోగ దారులకు అమలుపరిచి, అనంతరం గృహ వినియోగదారుల కరెంటు కలెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించి అమలు పరుస్తామని చెపుతున్నారు. 30రోజులకు తీయవలసిన విద్యుత్ బిల్లులు గడువు దాటిన అనంతరం తీస్తున్నారు. నెలలో 100యూనిట్లు వినియోగిస్తే ఒక యూనిట్‌కు రూ.3.60 పైసలు చొప్పున చెల్లించాలి. అదే కనుక రెండు మూడు రోజులు ఆలస్యంగా బిల్లులు తీస్తే 106యూనిట్లు బిల్లు వస్తే యూనిట్ ధర రూ.6.90పైసలు చొప్పున మొత్తం 106యూనిట్లకు డబ్బులు చెల్లించాలి. ఒక్కొక్క యూనిట్‌కి రూ.3 చొప్పున అదనపు బిల్లు చెల్లించాలి. మనకు తెలియకుండానే మన జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఈ రీతిగా పై అధికారుల ఆదేశాలు అనుసరించి బిల్లులు ఆలస్యంగా తీస్తూ మనలను దోపిడీ చేస్తున్నారు.

> అత్మనిర్భర భారత్‌లో భాగంగా కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అనుమతినిచ్చింది. రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణల అమలు జరపాలని విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రయివేటుకరించాలని కేంద్రం, తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నది. దీనిపై సమగ్ర అధ్యాయనం చేసి ప్రజలకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి కేసీఆర్‌పైన ఉన్నది.

ఇవి కాక ఫిక్స్‌డ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, విద్యుత్ డ్యూటీ, ట్రూ ఆఫ్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు, అంటూ పలు రకాల చార్జీల పేరుతో ప్రజలను బాదుడే బాదుతున్నారు. ప్రయివేట్ విద్యుత్ జనరేషన్ కంపెనీలు, బొగ్గు సరఫరా కంపెనీల ధనదాహానికి రాష్ట్ర ప్రజలను బలి చేస్తున్నారు. వాస్తవానికి అఖిల భారత స్థాయిలో గ్రిడ్డు ఏర్పరచిన తర్వాత జల విద్యుత్ వాటా పెరిగింది. విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గినప్పటికీ ప్రయి వేటీకరణ వల్ల, పెట్టుబడిదారులకు విపరీతంగా లాభాలు కట్ట బెట్టడం కోసమే విద్యుత్ తయారీ వ్యయాన్ని ఎక్కువ చేసి చూపించి ప్రజలపై అధిక భారాలు మోపుతున్నారు. ప్రస్తుతం నడుస్తున్న మీటర్లు తొలగించి వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లు బిగించబోతున్నారు. ఈ మీటర్ల ధర సుమారు రూ.7 వేల నుండి 13 వేల వరకు ఉంటుందని, మీటర్ చార్జీల ఖరీదును మన నుండి వసూలు చేయబోతున్నారు. స్మార్ట్ మీటర్లు తయారు చేసే ఆదానీ లాంటి ప్రయివేట్ కంపెనీల పెరుగుదల కోసమే మోడీ సర్కార్ పనిచేస్తుంది. ఆ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆత్మనిర్భర భారత్‌లో భాగంగా కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అనుమతినిచ్చింది, రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణల అమలు జరపాలని విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రయివేటుకరించాలని కేంద్రం, తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నది. దీనిపై సమగ్ర ఆధ్యాయనం చేసి ప్రజలకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి కేసీఆర్‌పైన ఉన్నది.

- తోట సాంబశివరావు

పోలీసు దురాగతం : రెండో వారంలోకి ఫ్రెంచి నిరసనలు!



ఎం. కోటేశ్వరరావు

అల్జీరియా-మొరాకో సంతతికి చెందిన 17సంవత్సరాల నహేల్ అనే కుర్రవాడు ట్రాఫిక్ సిగ్నల్ నిబంధనలను ఉల్లంఘించాడంటూ పోలీసులు గుండెల మీద కాల్చి చంపిన దురంతం ప్రస్తుతం ఫ్రాన్స్‌ను ఊపివేస్తున్నది. జూన్ 27న పారిస్ శివార్లలోని నాన్‌తెరేలో ఈ దారుణం జరిగింది. ఇరవై తొమ్మిదవ తేదీన అంత్యక్రియల సందర్భంగా దేశమంతటా ఆగ్రహించినవారి తీవ్ర నిరసనలు, దాడులు కొనసాగుతున్నాయి. మధ్యేవాద, వామపక్ష పార్టీలు, శక్తులు ఈ ఉదంతాన్ని ఖండించాయి, నిరసనలో పాల్గొన్నాయి. జాత్యహంకారి, హంతకుడైన పోలీసు అధికారికి మద్దతుగా విరాళాలు ఇవ్వాలని పచ్చిమితవాద నేషనల్ ఫ్రంట్ పార్టీ నేత మేరీనె లీపెన్ ఇచ్చిన పిలుపు మేరకు కొద్ది గంటల్లోనే మిలియన్ డాలర్లకు పైగా వసూలైంది. నాలుగు సంవత్సరాల క్రితం "పసుపు చొక్కాల" ఆందోళన జరిగినప్పుడు పోలీసుల మీద దాడి చేసిన మాజీ బాక్సర్‌కు మద్దతుగా నిధుల సేకరణకు పిలుపు ఇచ్చినప్పుడు వెంటనే ఆ నిధి సేకరణను ప్రభుత్వం నిలిపివేసింది. ఇప్పుడు అలా జరగలేదు. అరబ్బులను చంపండి మీరు మిలియనీర్లు కావచ్చు అని ఈ నిధి సేకరణ సందేశం ఇస్తున్నదని వామపక్ష నేత డేవిడ్ గుయిరాడ్ ఒక ట్వీట్‌లో పేర్కొన్నాడు. ఈ చర్య అన్యాయం జరుగుతున్నదనే మనోభావాలను రగిలించటంతో పాటు ఉద్రిక్తతలు మరింతగా పెరిగేందుకు దోహదం చేస్తుందని స్లీపింగ్ జైంట్స్ అనే సంస్థ పేర్కొన్నది. ఒక మేయరు ఇంటి మీద తగులబడుతున్న కారును తోలి దాడికి పాల్పడ్డారంటే జాతి వివక్ష ఎలాంటి

> ఫ్రాన్స్‌లో అధికారాన్ని నెట్టుకువస్తున్న మక్రాన్ ప్రభుత్వానికి తాజా ఆందోళనతో ఎదురైన సవాలు ఎంత తీవ్రమైనదంటే బ్రసెల్స్‌లో జరుగుతున్న ఒక సమావేశం నుంచి ముందుగానే స్వదేశానికి చేరుకోవటం, జర్మనీ పర్యటన వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. పెన్షన్ సంస్కరణలకు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్న సమయంలో బ్రిటన్ రాజు చార్లెస్ కూడా ఈ ఏడాది ప్రారంభంలో ఫ్రెంచి టూర్‌ను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. మన దేశంలోని మణిపూర్‌లో పరిస్థితి ఎంతగా దిగజారిందో తెలిసిందే. శాంతిగా ఉండాలని కనీసం ప్రధాని నరేంద్రమోడీ నోటి వెంట ఒక్క ముక్కరాలేదు, స్వయంగా పరిస్థితిని తెలుసుకొనేందుకు అక్కడకు వెళ్లలేదు.

పరిస్థితికి దారి తీస్తుందో వెల్లడించింది. దేశంలో తలెత్తిన ఉద్రిక్తత కారణంగా అధ్యక్షుడు మక్రాన్ జర్మనీ పర్యటనను రద్దు చేసుకున్నాడు. మైనారిటీల పట్ల దేశంలో ఉన్న జాతివివక్ష గురించి మరోసారి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఆందోళన రెండో వారంలో ప్రవేశించింది.

ఉదయం ఎనిమిది గంటలపుడు మెర్సిడెజ్ కారు నడుపుతున్న నహేల్ దురుసుగా ఒక స్టాప్ వద్ద ఉన్న ఇద్దరు పోలీసుల మీద దురుసుగా కారును పోనిచ్చేందుకు చూసాడనే కథనాలు వెలువడ్డాయి. అది వాస్తవం కాదని, వారిద్దరూ కారు పక్కనే ఉన్నట్లు, కారు కదలక ముందే ఒక పోలీసు కారులో ఉన్న నహేల్ మీద తుపాకి గురిపెట్టినట్లు కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమంలో దర్శనమిచ్చాయి. కాల్పులు జరిపిన తరువాత అదుపుతప్పిన కారు సమీపంలోని ఒక స్తంభాన్ని ఢీకొట్టి ఆగింది. 'నీ తలలో బుల్లెట్ దిగుతోంది' అన్న మాటలు వినిపించినట్లు ఒక టీవీ ఛానల్ పేర్కొన్నది. కాల్పులు జరిపినపుడు నహేల్‌తో పాటు కారులో మరో ఇద్దరు ఉన్నారని వారిలో ఒకడు పోలీసులతో మాట్లాడినట్లు, మరొకడు కారు దిగి పారిపోయినట్లు చూసిన వారు చెబుతున్నారు. కాల్పులు జరపటానికి ముందు బస్సులు వెళ్లే మార్గంలో వెళుతున్న కారును ఇద్దరు పోలీసులు మోటారు సైకిళ్ల మీద వెంబడించి ఆపేందుకు చూడగా నహేల్ కారును ఆపలేదు, కొంత దూరం వెళ్లిన తరువాత ట్రాఫిక్ కారణంగా నిలపాల్సి వచ్చింది. వెనుకనే వచ్చిన పోలీసుల్లో ఒకడు కారు పక్కకు వచ్చి కాల్పులు జరిపాడు. ఈ తీరుతో జనంలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. చైనా పర్యాటకులు వెళుతున్న బస్‌పై జరిగిన దాడి తరువాత అనేక దేశాలు తమ పౌరులను హెచ్చరిస్తూ ఫ్రాన్స్ వెళ్లవద్దని సలహా ఇచ్చాయి.

గతవారం రోజులుగా దేశమంతటా వేలాది మంది సాయుధ పోలీసులను మోహరించి హింసాకాండను ఆపేందుకు పూనుకున్నారు. వేలాది మందిని అరెస్టు చేశారు. హింసాకాండకు పాల్పడుతున్న వారు తన మనవడి మరణాన్ని సాకుగా చూపుతున్నారని అమ్మమ్మ నాదియా ఒక టీవీలో చెప్పింది. ఆందోళనలు విరమించాలని కోరింది. నహేల్ ఉదంతం ఇలాంటి పరిస్థితిని ఎందుకు సృష్టించిందన్నది ప్రశ్న. 2020లో అమెరికాలోని మినియాపోలిస్ పట్టణంలో పోలీసులు జార్జి ఫ్లాయడ్ అనే నల్లజాతి యువకుడిని ఊపిరాడకుండా చేసి చంపిన తీరును చుట్టుపక్కల ఉన్నవారు తీసిన వీడియో సంచలనంగా మారి ఆందోళనకు దారితీసింది. నహేల్‌ను కాల్చి చంపుతున్న వీడియో కూడా అలాంటి ప్రతిస్పందననే కలిగించింది. 2005లో పోలీసులు వెంటాడినప్పుడు ప్రమాదానికి గురై ఇద్దరు మరణించినప్పుడు దేశమంతటా మూడు వారాల పాటు తీవ్ర ఆందోళనలు జరిగాయి. ఆ తరువాత ఇప్పుడు అదే మాదిరి ఫ్రాన్సులోని మైనారిటీలు ఆందోళనకు పూనుకున్నారు. ఫ్రెంచి పోలీసుల దుర్మార్గపూరిత వైఖరి, జాతి వివక్ష తీరుతెన్నులకు ఈ ఉదంతాలు నిదర్శనం.

నెలల తరబడి సాగిన పెన్షన్ సమ్మెలు, ఇతర ఆందోళనలతో అట్టుడికిన ఫ్రాన్స్‌లో అధికారాన్ని నెట్టుకువస్తున్న మక్రాన్ ప్రభుత్వానికి తాజా ఆందోళనతో ఎదురైన సవాలు ఎంత తీవ్రమైనదంటే బ్రసెల్స్‌లో జరుగుతున్న ఒక సమావేశం నుంచి ముందుగానే స్వదేశానికి చేరుకోవటం, జర్మనీ పర్యటన వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. పెన్షన్ సంస్కరణలకు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్న సమయంలో బ్రిటన్ రాజు చార్లెస్ కూడా ఈ ఏడాది ప్రారంభంలో ఫ్రెంచి టూర్‌ను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. మన దేశంలోని మణిపూర్‌లో పరిస్థితి ఎంతగా దిగజారిందో తెలిసిందే. శాంతిగా ఉండాలని కనీసం ప్రధాని నరేంద్రమోడీ నోటి వెంట ఒక్క ముక్కరాలేదు, స్వయంగా పరిస్థితిని తెలుసుకొనేందుకు అక్కడకు వెళ్లలేదు. తమ రాష్ట్రంలో శాంతినెలకాల్పాలని కోరుతూ ఢిల్లీ వచ్చిన ఆ రాష్ట్రానికి చెందిన వివిధ పార్టీల ప్రతినిధులను కూడా కలుసుకొనేందుకు అవకాశం ఇవ్వలేదు. అమెరికా, ఈజిప్టు వెళ్లి సుభాషితాలు చెప్పివచ్చారు. సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించేందుకు ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ మంగళవారంనాడు దేశంలోని 220మంది మేయర్లతో(స్థానిక సంస్థల అధిపతులు) సమావేశం కానున్నట్లు వార్తలు వచ్చాయి.

అల్జీరియా ఫ్రెంచి వలసగా ఉన్న కాలంలో ఫ్రెంచి దళాలు జరిపిన దారుణమారణకాండలు ఇప్పటికీ గుర్తుకు వస్తాయి. అనేక మంది అల్జీరియన్స్ ఫ్రాన్స్‌లో స్థిరపడ్డారు. అలాంటి కుటుంబానికి చెందిన వాడే గత నెలలో పోలీసుల చేతిలో మరణించిన నహేల్. వలస వచ్చిన ఆఫ్రికా అరబ్బులు, ఇతరులు అంటే ఫ్రెంచి అధికార యంత్రాంగానికి చిన్న చూపు, నేరగాండ్లుగా చూస్తారు. వారితో మమేకం కావటానికి బదులు దమనకాండ ప్రదర్శిస్తారు. అందుకే వారు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో తరచూ వివాదాలు జరుగుతుంటాయి. పశ్చిమ దేశాలలో అమెరికా తరువాత ఫ్రాన్స్‌లోనే పోలీసుల చేతుల్లో ఎక్కువ మంది మరణిస్తున్నారు. ఉక్రెయిన్ సంక్షోభం, ఆర్థిక దిగజారుడు పరిణామాలు, వలసదారుల అంశాల మీద ఐరోపా దేశాల్లో పరిస్థితి దిగజారుతోంది.ఇటువంటి స్థితిలో జనంలో ఉన్న అసంతృప్తి ఇలాంటి ఉదంతాలు జరిగినపుడు ఊహించని రీతిలో వెల్లడవుతుంది. ఫ్రాన్స్ ఆందోళనకు పూర్వరంగమిదే. నహేల్ హత్య ఊహించని ఉదంతమైనా దానికి ప్రతికూల స్పందన గూడు కట్టుకున్న అసంతృప్తికి నిదర్శనం. ఇటీవలి కాలంలో ఫ్రెంచి అధినేత మక్రాన్ తమకు మరింత వ్యూహాత్మక స్వయం నిర్ణయాధికారం ఉండాలని, ప్రపంచ వ్యవస్థలో బహుళనాయకత్వం ఉండాలని గట్టిగా



చెబుతున్నారు. ఇది అమెరికా గురించే అన్నది స్పష్టం. మక్రాన్‌ను దారిలోకి తెచ్చుకొనేందుకు పెత్తందారీ ఏకఛత్రాధిపత్యం చెలాయించాలని చూస్తున్న శక్తుల హస్తం కూడా తాజా కొట్లాటల వెనుక ఉండవచ్చని కొందరు అనుమానిస్తున్నారు. అమెరికాకు నచ్చని వైఖరిని తీసుకున్నప్పుడల్లా ఫ్రాన్స్‌లో కొట్లాటలు జరగటాన్ని బట్టి ఇలా అనుమానించాల్సి వస్తోందని చెబుతున్నారు. అందువలన ఇది ఒక్క ఫ్రాన్స్‌కే కాదు, ఐరోపా సమాఖ్యకు, దేశాలకు ఒక హెచ్చరిక అని చెప్పవచ్చు.

ఐరోపాలో ఇటీవలి కాలంలో ముస్లిం వ్యతిరేక వైఖరితో ఉన్న పచ్చిమితవాద శక్తులు రెచ్చిపోతున్నారు. ఫ్రాన్స్ కొట్లాటల్లో పాల్గొన్నది వలస వచ్చిన లేదా ఎప్పటి నుంచో అక్కడ స్థిరపడిన ముస్లింలు, అరబిక్ లేదా ఆఫ్రికన్ దేశాల నుంచి వలస వచ్చిన వారని చెబుతున్నారు. తాజా పరిణామాల గురించి మీడియాలో చర్చ జరుగుతున్నది.

> గడచిన ఐదు దశాబ్దాల్లో ప్రపంచీకరణ తెచ్చిన మార్పు ఫ్రాన్సులోనూ ఇతర పశ్చిమ దేశాల్లోనూ అనేక పరిణామాలు, ఉద్యమాలు, ఆందోళనలకు దారి తీసింది. వస్తు దిగుమతులు తమ ఉపాధిని దెబ్బతీసిందనే అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోంది. పెట్టుబడిదారీ విధానం విఫలమైందనే అభిప్రాయం రోజురోజుకూ బలపడటానికి దారి తీస్తోంది. గత రెండు దశాబ్దాల్లో ఏ నేతా ఎదుర్కోనటువంటి తీవ్ర సవాలును మక్రాన్ ఎదుర్కొంటున్నట్లు కొందరు విశ్లేషించారు.

ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే పోలీసులకు మరింత శిక్షణ అవసరమని, జాతి వివక్ష అంశాన్ని పరిష్కరించాలని, పేదలు-ధనికుల మధ్యపెరిగిన అంతరాన్ని తగ్గించాలని, నిరుద్యోగం పెరుగుదల గురించి సూచనలు చేస్తున్నారు. నిజానికి ఇవి కొత్తవి కాదు ఎప్పటి నుంచో ఉన్నవే. ప్రపంచీకరణ తెచ్చిన సంక్లిష్ట సమస్యలు ఏడాదికేడాది పెరుగుతున్నాయి. అమెరికా, ఐరోపా ధనిక దేశాలు ప్రపంచీకరణ క్రమంలో ఉత్పత్తి ఖర్చు అధికంగా ఉందనే కారణంతో ఇతర దేశాల నుంచి పారిశ్రామిక వస్తువులను దిగుమతి చేసుకొని సేవారంగం మీద కేంద్రీకరించాయి. ఈ విధానంతో నిరంతర వృద్ధి సాగదని తేలింది. ప్రపంచ అభివృద్ధిలో అసమతూకానికి దారితీసింది, ప్రపంచీకరణకు వ్యతిరేకతను పెంచింది. కరోనా, ఉక్రెయిన్ సంక్షోభం సమస్యల తీవ్రతను వేగతరం కావించింది. ఆర్థిక మందగమన ప్రతికూల పర్యవసానాలు పేద, మధ్య తరగతి మీద భారాలను మోపుతున్నాయి. స్థిరమైన ఉపాధి, అవసరాలకు అనుగుణంగా పెరిగే రాబడి, కుటుంబ జీవనం సంతోషంగా ఉంటుందనే అంశాల మీద ఆశలను తుంచివేస్తున్నది. వీటికి జాత్యహంకారం కూడా తోడైతే ఇక చెప్పనవసరం లేదు. అసంతృప్తి కనిపించని గ్యాస్ మాదిరి వ్యాపిస్తే మండటం క్షణాల్లో జరుగుతుంది. గడచిన ఐదు దశాబ్దాల్లో ప్రపంచీకరణ తెచ్చిన మార్పు ఫ్రాన్సులోనూ ఇతర పశ్చిమ దేశాల్లోనూ అనేక పరిణామాలు, ఉద్యమాలు, ఆందోళనలకు దారి తీసింది. వస్తు దిగుమతులు తమ ఉపాధిని దెబ్బతీసిందనే అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోంది. పెట్టుబడిదారీ విధానం విఫలమైందనే అభిప్రాయం రోజురోజుకూ బలపడటానికి దారి తీస్తోంది. గత రెండు దశాబ్దాల్లో ఏ నేతా ఎదుర్కోనటువంటి తీవ్ర సవాలును మక్రాన్ ఎదుర్కొంటున్నట్లు కొందరు విశ్లేషించారు. పార్లమెంటులోని 577 స్థానాలకు గాను మక్రాన్ నాయకత్వంలోని రినయసెన్స్ పార్టీకి 251సీట్లే ఉన్నాయి. రెండవ సారి ఎన్నికైనప్పుడు సంపూర్ణ మెజారిటీ రాకపోవటంతో ద్వితీయ రౌండ్‌లో మితవాది మారినే లీపెన్ మీద 58శాతం ఓట్లతో గెలిచాడు. మరో నాలుగు సంవత్సరాలు అధికారంలో కొనసాగేందుకు పార్లమెంటులో ప్రతిపక్షాల సహకారంతోనే గట్టెక్కే అవకాశం ఉంది. వచ్చే ఏడాది జరగనున్న పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా మక్రాన్ ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

సెల్: 8331013288

ఉపా చట్టం తెలంగాణలో చెల్లదని ప్రకటించాలి!

నియంతృత్వ ప్రభుత్వాలకు కుట్ర సిద్ధాంతాలంటే బాగా చాలా ఇష్టమని చెబుతుంటారు. ఎందుకంటే నిరసనను నేరమయమైనదిగా చూపించవచ్చు, తమ నేర స్వభావాన్ని సమర్థించుకోవచ్చు. ప్రభుత్వాలను నడిపించే పెద్దల ప్రయోజనాలకు ప్రజా ప్రయోజనాలకు మధ్యన అనివార్యంగా తలెత్తే సంఘర్షణను అందరి దృష్టి నుండి తప్పించవచ్చు. చిన్న, చితక, పుల్ల, పరక అన్నింటినీ కట్టి ఒక మూలన పడేయవచ్చు, పైగా ఇదేమంత పెద్ద కష్టమైన విషయం కూడా కాదు. రాజ్యరక్షణలో నిమగ్నమైన రక్షక భటులు కాస్త 'అతి'గా రక్షణ కోసం పూనుకుంటే చాలు. కుట్రకేసులు ఎప్పుడు కావాలంటే అప్పుడు పెట్టుకోవచ్చు.


ములుగు జిల్లా, పస్ర సర్కిల్‌లో తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో నమోదయిన యఫ్ఐఆర్‌లో 152మంది మీద నమోదైన ఈ కుట్రకేసు ఇక నుంచీ 'తాడ్వాయి కేసు'గా పిలవబడుతుందను కుంటాను. ఈ కేసును ఎత్తివేయాల్సిందిగా కోరుతూ ఏర్పాటైన ఫోరమ్ ఎగినెస్ట్ రిప్రెషన్‌లో మాట్లాడుతూ, పద్మజాషా ఇలా అన్నారు. బ్రిటిష్‌వారు ఆనాటి స్వాతంత్రయోధులపై చాలా కుట్ర కేసులు పెట్టేవారు. కానీ, వాటిల్లో ఎంతో, కొంత పాక్షిక నిజం అన్నా ఉండేది. ఇప్పటి పాలకులు పెడుతున్న కేసులలో కనీసం అది కూడా కన్పించటం లేదు నిజమే. ముజఫర్‌పూర్ కేసులో ఖుదీరాం బోస్, ఢిల్లీ కుట్రకేసులో రాస్‌బిహారీబోస్, పెషావర్ కుట్ర (1922) కేసులో ముజాహిర్లు కాన్పూర్ - బోల్షివిక్ (1924) కేసులో యం.ఎన్.రాయ్, డాంగే, అహ్మద్, ఇలా కొందరి కైనా ప్రమేయం ఉండింది.

కానీ ఇప్పటి కుట్రకేసులో ఇరికించ బడుతున్న నిందితుల నుంచి ఆమాత్రం ప్రమాదం కూడా పొంచి ఉఉందేమోనన్న అపోహ కూడా ప్రభుత్వాలకు ఉంటున్నదని అనుకోలేం. ఎందుకంటే ఏ క్రిమినల్ కుట్ర కేసులోనైనా ముందు నేరారోపణకు గురవుతున్న వారి మధ్య నేరానికి సంబంధించి ఒక పూర్వ అవగాహన, ఒప్పందం ఉండి తీరాలి. కేవలం ఉంటేనే సరిపోదు. అందుకు సంబంధించిన విధ్వంసకర పరిణామాలు జరిగి ఉండాలి లేదా జరుగుతూ ఉండాలి. నేటి తాడ్వాయి కేసులో ఆరోపణ ఏమిటంటే - ప్రభుత్వ అధికారులపై దాడులు చేయబూనటం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయటం, ఆదివాసీ, గిరిజన తెగల ప్రజలను నిషేధిత పార్టీలో సభ్యులుగా చేరమని ఒత్తిడి చేయటం, ప్రజలనుంచి బలవంతంగా చందాలు వసూలు చేయబూనటం - చిట్ట చివరగా, ప్రజా ప్రభుత్వాన్ని తుపాకులతో పడగొట్టాలనుకోవడం.

గమ్మత్తు ఏమిటంటే 1969లో పెట్టిన పార్వతీపురం కుట్ర కేసులో, నాగిరెడ్డి కుట్ర కేసులో, 1974లోని సికింద్రాబాద్ కుట్ర కేసులో, 1977లో చిత్తూరు కుట్రకేసులో, 1986లో రాంనగర్ కుట్ర కేసులో, 1992లో బెంగుళూరు కుట్ర కేసులో సరిగ్గా ఇలాంటి ఆరోపణలే ఉన్నాయి. జనవరి 16, 1970 నాడు పార్వతీపురం కుట్ర కేసులో, శ్రీకాకుళం జిల్లాలో నమోదయిన యఫ్.ఐ.ఆర్‌లో నూట నలభై ఎనిమిది మంది పేర్లు చేర్చబడినాయి. చారుమజుందార్, కాను సన్యాల్ ప్రేరణతో వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం వంటివారు ప్రభుత్వ అధికారులపై దాడికి సంకల్పించారని, ప్రభుత్వాన్ని హింసాత్మక పద్ధతులలో పడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణ. ఇది ఇలా ఉండగానే, కేసు నడుస్తుండగానే, వెంపటాపు సత్యం, ఆదిబట్ల కైలాసం, డా॥ చాగంటి భాస్కరరావు, సుబ్బారావు పాణిగ్రాహి, పంచాది కృష్ణమూర్తి, నిర్మల, గణపతి వంటి ఎందరో "ఎన్‌కౌంటర్" పేరిట చనిపోయారు.

తాడ్వాయి కేసులో నిందితుల జాబితా పార్వతీపురం కుట్ర కేసులో సంఖ్య కంటే పెద్దది. కేసు 2022 లోనే నమోదయినా, ప్రస్తుతానికి డెమోక్లియస్ కత్తిలా అలా వేలాడబడి వుంది. ఎప్పుడు నిందితుల మెడల మీదికి దించాలో చెప్పాల్సిన రాజకీయ నిర్ణయం జరిగినట్లు లేదు. ఈ కేసు నమోదయిన తర్వాత నిందితులు ఒకర్ని ఒకరు పరిచయం చేసుకున్నారు. 42వ నిందితుడిని కన్వీనర్‌గా ప్రకటించుకున్నారు. ఇంతమంది నిందితుల్ని కలిపిన నేరం కచ్చితంగా తాడ్వాయి కేసుదే. అయితే అందర్నీ కలుసుకోలేరు వాళ్ళు, కొందరు ఇప్పటికే చనిపోయారని చెబుతున్నారు. సుధా భరద్వాజ్ లాంటి వాళ్ళు ఎల్గార్ పరిషత్ కేసులో, కండీషన్ బెయిల్‌పై ఉన్నారు కనుక ఇక్కడికి రాలేరు.

సైద్ధాంతిక భేదాభిప్రాయాలు ఉన్న వాళ్ళను



కూడా ఒకే గ్రూపులోకి చేర్చడం కూడా ఈ కేసు మహిమే. విమలక్క, సంధ్యలు వేర్వేరు. మావోయిస్టు సభ్యులు పూర్తిగా వేరు. చాలామంది న్యాయవాదులు పొద్దున లేస్తే న్యాయ దేవత ముందు హాజరు వేయించుకునే వారు. కన్నాభిరాన్ సజీవుడై ఉండి ఉంటే ఆయన తప్పకుండా ఈ కేసులో ఉండేవారు. ప్రాసిక్యూటర్ ఆఫ్ ప్రాసిక్యూటర్స్‌గా పేరు గాంచిన కన్నాభిరాన్ పాత కుట్ర కేసులన్నిటినీ వాదించే అవకాశం, గెలిచే సులువు దొరికినాయి కానీ, ఇప్పుడైతే తాడ్వాయి కేసులో కచ్చితంగా ఆయన కూడా ఒక నంబర్ అయివుండే వాడనిపిస్తోంది. ఒకానొక కుట్ర కేసులో జస్టిస్ రావు, కన్నా భిరాన్‌తో "రాజ్యంలో నమ్మకం లేని వాళ్ళు కోర్టులో 'రిట్' వేయటం ఎందుకని" ప్రశ్నించారు. దానికి కన్నాభిరాన్ బదులిస్తూ 'ఇక్కడ, ఈ కోర్టులో వారి విలువలు గావు పరీక్షంపబడేది - మీ విలువులు పరీక్షకు గురవుతాయి' అని ధైర్యంగా, బంతిని అవతలి కోర్టులోనికి నెట్టివేశారు. సిసిఫస్‌లా పోరాడుతూనే ఉన్నారు జీవితమంతా.

ఇప్పుడు ప్రొ॥ హరగోపాల్‌పై , పద్మజాషాపై, గడ్డంలక్ష్మణ్‌ల పై కేసులు ఎత్తివేశారని తెలిసింది. వీళ్ళ మీదనే ఎందుకు ఎత్తివేశారో తెలియదు. ఒక పోలీస్ ఆఫీసర్ చమత్కరించినట్లు 'ఉపా' కేసు మంత్రించి వదిలిన తర్వాత, తానే వెనక్కి తీసుకోలేని ఆదిపురుష్ బాణమా? ఇవ్వాటి వరకూ కుట్ర కేసులలో శిక్షలు పడటం చాలా అరుదు. కోర్టులకు వెళ్ళడం, న్యాయవాదుల ఖర్చులు ఉచ్చరించడం, ఇందుకోసం ఇల్లు, ఒళ్ళు గుల్ల చేసుకోవడం, ఇంకెప్పుడూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడకుండా ఉండటం, అంత సమయం మిగలకుండా ఉండటం - ఇవే నిందితులు ఎదుర్కొనే శిక్షలు. వీరిని చూసి మిగతా పౌరులు " భద్రలోగ్ " లాగా భయభక్తులతో బ్రతకడం జరిగి తీరాలి. అందునా 'ఉపా' కేసు మరింత కఠినతరం. బెయిల్ దొరక్కుండా సంవత్సరాలపాటు విచారణ ఖైదీలుగా గడపాల్సి వస్తుంది. పౌరులను ప్రజాస్వామ్య ప్రక్రియలో లేకుండా చేయడం ఇలా తేలిగ్గా సాధ్యమవుతుంది. అందుకేనేమో కేసును పూర్తిగా వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు లేరు. మిగతా వారందరిపై కేసు నడవబోతున్నట్లే కన్పడుతోంది. చాలామంది కేంద్ర ప్రభుత్వం సంధించిన లక్ష్యమేమోనని మొదట్లో భావించారు. తీరా తెలంగాణ ప్రభుత్వందే ఈ పుణ్యమంతా అని తెలిసి చాలామంది నివ్వెరపోయారు. నిన్న గాక మొన్న ఆకాశమంత అంబేద్కర్ విగ్రహాన్ని నిలబెట్టాం. అంబేద్కర్ సెక్రెటేరియట్ కట్టుకున్నాం. మన రాజ్యాంగానికి ప్రజాస్వామ్యం ఆక్సిజన్. ప్రజాస్వామ్యమంటే ప్రజలు చైతన్యవంతులుగా, తమ నిర్ణయాలు తాము తీసుకునే అధికారం ఉందని తెల్సిన వారిగా, ప్రజాస్వామ్య ప్రస్థానంలో భాగం పంచుకోవటం. విభేదించడం, సంఘాలు నిర్మించుకోవడం, హక్కులుగా వాడుకోవడం. పౌర అభ్యసనం అంటే రాజ్యాంగ ప్రవేశికను నెమరు వేయటం కాదు గదా! ఎవరు సంకెళ్ళు వేసినా తెంచివేయడమే ప్రజాస్వామ్యం కదా!


> నిన్న గాక మొన్న ఆకాశమంత అంబేద్కర్ విగ్రహాన్ని నిలబెట్టాం. అంబేద్కర్ సెక్రెటేరియట్ కట్టుకున్నాం. మన రాజ్యాంగానికి ప్రజాస్వామ్యం ఆక్సిజన్. ప్రజాస్వామ్యమంటే ప్రజలు చైతన్యవంతులుగా, తమ నిర్ణయాలు తాము తీసుకునే అధికారం ఉందని తెల్సిన వారిగా, ప్రజాస్వామ్య ప్రస్థానంలో భాగం పంచుకోవటం. విభేదించడం, సంఘాలు నిర్మించుకోవడం, హక్కులుగా వాడుకోవడం. పౌర అభ్యసనం అంటే రాజ్యాంగ ప్రవేశికను నెమరు వేయటం కాదు గదా! ఎవరు సంకెళ్ళు వేసినా తెంచివేయడమే ప్రజాస్వామ్యం కదా!

కేంద్ర ప్రభుత్వ అసహనంపై, అప్రజాస్వామిక విధానాలపై పోరాటం సాగించే వారిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కేసును ఇంకా కొందరిపై నడపడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. మినహాయింపులు లేకుండా కేసును మూసి వేయడం, 'ఉపా, దేశ ద్రోహనేరం లాంటి చట్టాలను నా మ్యానిఫెస్టోలో చోటు లేదని' తక్షణమే ప్రకటించటమే ప్రభుత్వానికి గౌరవం - అది బాధ్యత కూడా.

- వి.వి. రమణారావు, 9848809990

కమలం పార్టీలో

నైరాశ్యం





రాష్ట్ర అధ్యక్షపదవికి 'బండి' రాజీనామా పట్ల స్పందించని శ్రేణులు

- కిషన్‌రెడ్డి నాయకత్వాన్నీ స్వాగతించని కార్యకర్తలు
- ఎన్నికల నిర్వహణ కమిటీ బాధ్యతలు తీసుకున్న 'ఈటల'కూ అదే పరిస్థితి
- సోషల్‌మీడియాలో సంజయ్‌పై విపరీతమైన ట్రోల్స్..
- కొందరు సంజయ్‌ను తప్పించడాన్ని ఖండిస్తుంటే..
- మరికొందరేమో ఇది మంచి పరిణామమేనంటూ పోస్టులు
- కిషన్‌రెడ్డి నాయకత్వమూ ఫెయిలవడం తప్పదని ఇంకొందరి పెదవివిరుపు


రాష్ట్ర బీజేపీ నాయకత్వంలో తీసుకొచ్చిన మార్పుల పట్ల ఆ పార్టీ శ్రేణులు ఏ ఉలుకూపలుకూ లేకుండా ఉండిపోయారు. సామాజిక మాధ్యమాల్లో తప్ప భౌతికంగా ఎక్కడ నిరసనలుగానీ, సంబురాలుగానీ నిర్వహించలేదు. అందులోనూ కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించడం పట్ల ఇక్కడి పార్టీ శ్రేణులు గప్‌చుప్‌గానే ఉన్నాయి. సంజయ్ అనుచరవర్గంలో నైరాశ్యం నెలకొనగా.. ఆయన వ్యతిరేక వర్గం మాత్రం లోలోపల సంబురాలు చేసుకుంటున్నారు. మరోవైపు తనకు సరైన ప్రాధాన్యత లేదని తరుచూ సన్నిహితులు, స్నేహితుల వద్ద వాపోయిన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ బాధ్యతలు అప్పగించినా ఆయన శ్రేణులూ మిన్నకుండిపోయినట్టే కనిపిస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కమలం శ్రేణుల్లో నైరాశ్యమే నెలకొన్నట్టుగా బీజేపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం తరువాత పరిస్థితులే అద్దం పడుతున్నాయి.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్ ఎంపీ సంజయ్‌ని నియమించిన అనంతర పరిణామాల్లో పార్టీ శ్రేణుల్లో మొదట్లో జోష్ కనిపించింది. క్రమంగా అది ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోనే తగ్గుతూ వచ్చింది. అందుకు కారణం లేకపోలేదు. రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిననాటి నుంచి ఆయన ఎక్కువగా హైదరాబాద్‌కు పరిమితం కావడం, రాష్ట్ర రాజకీయాల్లోనే క్రియాశీలకంగా ఉండటంతో ఇక్కడి పార్టీ బలోపేతంగానీ, ఇక్కడి శ్రేణులతో దగ్గరవడం వంటి పరిస్థితులు పెద్దగా లేవనే చెప్పాలి. అందులోనూ మొదట్నుంచి ఇక్కడి పార్టీలో సంజయ్ వర్గం, వ్యతిరేకవర్గమూ కొనసాగుతూ వచ్చింది. ఇన్నాళ్లుగా పార్టీ రాష్ట్ర పగ్గాలు చేతబట్టిన సంజయ్ కూడా పలు రాజకీయ పరిణామాల్లో కొంత ఫెయిల్ అవుతూ వచ్చారు. అధికారపార్టీ తిట్టడమే పనిగా పెట్టుకున్న ఆయన రాష్ట్ర ప్రజల ప్రయోజనాలపై పెద్దగా పెదవి విప్పింది లేదు. దీంతో ఆయన వ్యవహారంపై పెద్దఎత్తునే వ్యతిరేకత పెరిగింది. సోషల్‌మీడియాలో ఆయనపై ట్రోల్స్ కూడా పెరిగాయి. మరోవైపు బీజేపీ ప్రజాప్రతినిధులు నిజామాబాద్ ఎంపీ అరవింద్, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు పార్టీ వ్యవహారాల్లో సంజయ్‌తోపాటు కలిసి పోయిన సందర్భాలు తక్కువగా ఉన్నాయి. అందులోనూ ఇద్దరూ ఆయనకు వ్యతిరేకంగా స్వరమూ వినిపించారు. రఘునందన్‌రావు అయితే ఏకంగా 'భార్య పుస్తెలు అమ్మి ఎన్నికల్లో గెలిచినా అని చెప్పిన సంజయ్‌కు వంద కోట్లు ఎక్కడివి?' అంటూ చేసిన వ్యాఖ్యలు దుమారమే రేపాయి. సంజయ్‌ను బాధ్యతల నుంచి తప్పించగానే ఆయన మద్దతుదారులు జీర్ణించుకోలేకపోతున్నారు. మరోవైపు ఆయనకు కేంద్ర కేబినెట్‌లో చోటు ఇస్తారన్న ఆశతోనూ ఉన్నారు. ఓ మహిళా నేత అయితే ఏకంగా 'సంజయ్ భవిష్యత్‌లో ప్రధాని అభ్యర్థిగా ఎదిగే అవకాశమూ ఉంటుంది' అని చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్రస్థాయిలో ట్రోల్స్ కొనసాగుతున్నాయి.

కార్పొరేటర్ నుంచి ఎంపీగా.. ఆపై రాష్ట్ర అధ్యక్షునిగా...

ఆర్ఎస్ఎస్ భావాజాలం ఉన్న సంజయ్ .. కార్పొరేటర్ నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి వరకు ఎదిగారు. హిందుత్వ ఎజెండానే నమ్ముకొని బాల్యం నుంచే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లో సేవకుడిగా ఉన్న ఆయన బీజేపీలో విద్యార్థి విభాగం నుంచి పలు పదవుల్లో బాధ్యతలు నిర్వహించారు. ఎంపీగా గెలిచే నాటికి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పని చేశారు. కరీంనగర్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. చివరికి 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌పై గెలుపొందారు. అనంతరం పరిణామాల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలూ చేపట్టారు. అయితే అధికారపార్టీకి కౌంటర్లు ఇవ్వడం, ప్రతి ఎన్నికల్లోనూ తన మార్క్ చూపించే స్థాయిలో సభలూ, ప్రజాసంగ్రామయాత్రలు నిర్వహించడంతో ఆయన నిత్యం వార్తల్లో నిలుస్తూవచ్చారు.



బీఆర్ఎస్ ప్రస్థానం నుంచి బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ వరకూ...

తెలంగాణ ఉద్యమంలో, బీఆర్ఎస్‌లో కీలక నేతగా ఉన్న ఈటల... అప్రతిహతంగా 7 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో టీఆర్ఎస్ తరఫున కమలాపూర్ నుంచి తొలిసారిగా గెలుపొందిన ఆయన... కేసీఆర్ పిలుపుతో 2008లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, ఉప ఎన్నికల్లో మళ్లీ గెలిచారు. 2009నుంచి 2021 వరకు జరిగిన సాధారణ, ఉప ఎన్నికల్లో ఆయన 5సార్లు విజయం సాధించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014, 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గెలుపొంది... కేసీఆర్ మంత్రివర్గంలో రెండుసార్లు బాధ్యతలు నిర్వర్తించారు. 2021లో నెలకొన్న పరిణామాలతో బీజేపీ గూటికి చేరుకున్న ఈటల రాజేందర్ .. ఉపఎన్నికల్లో మాతృపార్టీ బీఆర్ఎస్‌తో తలపడి విజయం సాధించారు. అయితే అది కేవలం ఆయన మీద ఉన్న సానుభూతితోనే గెలిచారన్నది నిర్వివాదాంశంగా చెప్పవచ్చు. అయినప్పటికీ బీజేపీలో తనకు సరైన గుర్తింపు లేదని సన్నిహితులు, అనుచరుల వద్ద చెబుతూ వస్తున్న ఈటల... కొన్ని రోజుల క్రితం ఆ పార్టీ అగ్రనేతలతో భేటీ అయ్యారు. ఇటీవల కొన్ని రోజులుగా బీజేపీలో సందిగ్ధ పరిస్థితులు నెలకొన్న వేళ... ఈటలకు ఎన్నికల కమిటీ చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తూ అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ నిర్ణయం పట్ల ఆయన అనుచరుల్లో ఆనందం నెలకొన్నా... ఇదే జిల్లాలోని బండి సంజయ్ వర్గంలో మింగుపడటం లేదనే చర్చ సాగుతోంది. అయితే ఈటల రాజేందర్‌కు ఆర్ఎస్ఎస్ బ్యాక్‌రౌండ్ లేకపోవడంతోనే ఆయనకు పార్టీ పగ్గాలు ఇవ్వకుండా కేవలంఎన్నికల నిర్వహణ కమిటీ బాధ్యతలు అప్పగించారని తెలుస్తోంది.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండలంలోని నారా యణపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరం ఎస్ఏ-2 పరీక్షలలో మొదటి, ద్వితీయ స్థానాలు పొందిన 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు రెడ్డి మిత్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మెడల్స్ పంపిణీచేశారు. అలాగే 10వ తరగతిలో మొదటి స్థానం సాధించిన ఎండపెల్లి రిషత్ 9.5 జీపీఏ సాధించగా అతనికి 3వేల నగదు అందజేసి శాలువాతో సన్మానించారు. విద్యార్థులందరు బాగ చదివి ఉన్నత స్థానాలను చేరుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాలిపెల్లి కృష్ణహరి సూచించారు. ఈ బహుమతులు ప్రతి నెలా(ఎఫ్ఏఎస్, ఎస్ఏఎస్) అందజేస్తామని విద్యార్థులకు తమవంతు సహకారం ఎల్లవేళలా అందిస్తామని రెడ్డి మిత్ర సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ గరిపెల్లి రమేష్, రెడ్డి మిత్ర సంఘం సభ్యులు నిమ్మ మల్లారెడ్డి, నిమ్మ కిష్టరెడ్డి, నిమ్మ సుధాకర్‌రెడ్డి, మోతె మల్లారెడ్డి, మోతె నర్సింహరెడ్డి, మోతె కిషన్‌రెడ్డి, మోతె దేవిరెడ్డి, గోగూరి లక్ష్మారెడ్డి, గోగూరి శ్రీనివాస్‌రెడ్డి, గోగూరి రత్నాకర్‌రెడ్డి, వంగల దేవిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. కృష్ణహరి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం

కరీంనగర్‌లోని స్వస్తిక్ హాస్పిటల్‌లో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలలోకి వెళితే.. రాజన్న సిరిసిల్లా జిల్లాకు చెందిన రేకుల మహిపాల్ రెడ్డి(36) కరీంనగర్‌లోని స్వస్తిక్ హాస్పిటల్‌లో నివాసముంటున్నారు. స్వస్తిక్ హాస్పిటల్‌లో యాజమాన్యం డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్‌తో స్వస్తిక్ హాస్పిటల్‌లో భాగస్వామ్యం ఉంది. ఇదే హాస్పిటల్‌లో భాగస్వామ్య ఇన్‌చార్జిగా, పార్ట్నర్‌గా పని చేస్తున్నారు. మహిపాల్ రెడ్డి దంపతులు వన భోజనాలు ఉన్నాయని వన్‌పల్లి గ్రామానికి వెళ్లారు. ఈనెల 2న మహిపాల్ రెడ్డి హాస్పిటల్ వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. రాత్రి స్వస్తిక్ హాస్పిటల్‌లో బెడ్‌రూంలోని బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం అందగా కుటుంబీకులు వెళ్లే సరికి విగత జీవిగా ఉన్నాడు. రెండు ఫోన్లు కూడా డాక్టర్ ప్రవీణ్ దగ్గరనే ఉన్నాయని మృతుడి భార్య రేఖ తెలిపారు. కొద్ది కాలంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్, భార్య డాక్టర్ ప్రత్యూషతో విభేదాలు ఉన్నాయని, నా భర్త మరణానికి ఈ డాక్టర్లు ముఖ్య కారణమని రేఖ వాపోయారు. సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తెలిపి న్యాయం చేయాలని కరీంనగర్-2 పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల సంక్షేమం ఎక్కడ..?

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు

కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

నవతెలంగాణ-కరీంనగర్

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వానికి విద్యారంగంపై పట్టింపు లేదని, విద్యార్థుల సంక్షేమాన్ని కేసీఆర్ విస్మరిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ లు అన్నారు. స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. విద్యారంగం పట్ల ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు ఫీజులు డొనేషన్ల రూపంలో అడ్డగోలుగా విద్యార్థుల నుంచి దండుకుంటున్న ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోవడంలేదన్నారు. రాష్టంలో బీటెక్ విద్యా ఫీజుల కంటే ఎల్‌కేజీ విద్యా ఫీజులే ఎక్కువగా ఉన్నాయని, పాఠ్యపుస్తకాలను సైతం సూపర్ మార్కెట్ల వలె అమ్ముతున్నారని, ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టినా చలనం లేదన్నారు. కేంద్రం జిల్లాకో నవోదయ పాఠశాల, ఐటీ ఐఐటీ ఐఐఎం లాంటి అనేక విద్యాసంస్థలు తెలంగాణలో నెలకొల్పాల్సి ఉన్న ఏర్పాటు చేయకుండా తెలంగాణకి రావాల్సిన విద్యాసంస్థలను గుజరాత్‌కి కేటాయిస్తున్న రాష్ట్ర బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామరాపు వెంకటేష్, మచ్చ రమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అన్వర్, హరీష్, జిల్లా ఆఫీస్ బేరర్ మామిడిపల్లి హేమంత్, నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల ఆక్రమణపై స్పందించని సీఎం

- జిల్లా కాంగ్రెస్ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మెన్ సమద్

నవతెలంగాణ-కరీంనగర్

జిల్లాలో వక్ఫ్ ఆస్తుల ఆక్రమణపై ముఖ్యమంత్రి స్పందించట్లేదని జిల్లా కాంగ్రెస్ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మెన్ సమద్ నవాబ్ అన్నారు. మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు కరీంనగర్ అసెంబ్లీ పరిధిలోని వక్ఫ్ ఆస్తులను ఆక్రమించడాన్ని ఖండించారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కరీంనగర్ అసెంబ్లీ పరిధిలోని మైనారిటీ నేతలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ వక్ఫ్ ఆస్తులను తిరిగి ప్రభుత్వానికి అందజేయడం, వాటిని పరిరక్షించడానికి కాంగ్రెస్ పక్షాన 14మంది మైనారిటీ సభ్యులతో కూడిన వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ నియమించారు. ఈ సందర్భంగా కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, పరిరక్షణ కమిటీ చైర్మెన్ సమద్ నవాబ్ మాట్లాడారు. దేవుని పేరుతో దానం చేసిన వక్ఫ్ ఆస్తులను ముఖ్యమంత్రితో సహా బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆక్రమిస్తున్నారన్నారు. కరీంనగర్ వక్ఫ్ బోర్డ్ కమిటీ వేయలేదని, నగరంలో వక్ఫ్ కమర్షియల్ కాంప్లెక్స్ ల ద్వారా రూ.8కోట్ల కిరాయిలు రావలసి ఉందని, వాటికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి కేసీఆర్‌కి, మైనారిటీ వెల్ఫేర్ చైర్మెన్ కొప్పుల ఈశ్వర్‌కి లేఖ రాసినా స్పందించలేదన్నారు. పరిరక్షణ కమిటీ వైస్ చైర్మెన్ రహమత్ హుస్సేన్ మాట్లాడుతూ..ఈ విధంగా బీఆర్ఎస్ నేతల వల్ల ఆక్రమణకు గురైన వక్ఫ్ ఆస్తుల రక్షణ కోసం నియమించిన ఈ పరిరక్షణ కమిటీ వక్ఫ్ ఆస్తుల ఆక్రమణ గురించి జిల్లాలోని మైనారిటీల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు భవిష్యత్తులో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో వక్ఫ్ బోర్డు పరిరక్షణ కమిటీ సభ్యులు ఎండీ తాజ్, ఎస్ఏ మొసీన్, సయ్యద్ అఖిల్, సయ్యద్ ఖమరుద్దీన్, ఎండీ నిహాల్ అహ్మద్, అబ్దుల్ రెహమాన్, ఎండీ ఇమ్రాన్, షేక్ షహెన్షా, షేక్ చాంద్, ఎండీ నవాజ్ (న్యాయవాది), ఎండీ ఇర్ఫాన్, ఎండీ లయిక్, హైమద్ అలీ పాల్గొన్నారు.



రోడ్డు సౌకర్యం కల్పించండి

నవతెలంగాణ-కరీంనగర్



కరీంనగర్ వ్యవ సాయ మార్కెట్ యార్డులో నగరపాలక సంస్థ ద్వారా రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం మార్కెట్ యార్డులో నగర మేయర్ యాదగిరి సునీల్ రావుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ రెడ్డవేణి మధు వినతిపత్రం అందించారు. వ్యవసాయ మార్కెట్ యార్డుకు లోపలికి వచ్చే దారిలో మార్కెట్ యార్డ్ కమాన్ నుంచి ప్రధాన గేట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు చేసి, నిధులు కేటాయించి సీసీ రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్, బీజేపీ నాయకుల కుర్చీలు కదులుతున్నాయి

- కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్



ఖమ్మం జనగర్జన సభకు వచ్చిన జనాన్ని చూసి బీఆర్ఎస్, బీజేపీ నాయకుల పీటలు కదులుతున్నాయని తెలిపోయి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్య పింఛన్లు నెలకు నాలుగువేలు చొప్పున ఇస్తామంటే సాధ్యం కాదని అంటున్నారని కోట్ల రూపాయలు కమీషన్ల పేరు మీద దండుకోవడం మాత్రమే బీఆర్ఎస్ నాయకులకు తెలుసని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతున్నామని, రాజస్తాన్‌లో రూ.500లకే గ్యాస్ సిలీండర్, కర్ణాటకలో మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో రైతులకు పండించిన పంటపై క్వింటాల్‌కు 500ల చొప్పున బోనస్ ఈ విధంగా ఇచ్చిన ప్రతిహామీ నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్‌దే అని తెలిపారు. బండి సంజయ్ కుమార్ పుస్తెలమ్మి ఎన్నికలలో పోటీ చేసానని చెప్పి వంద కోట్లు ఎలా సంపాదించాడనీ, బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్న మాటలకు బండి సంజయ్ కుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎండీ తాజ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ అఖిల్, కుర్ర పోచయ్య, సయ్యద్ ఖంరొద్దిన్, దన్న సింగ్, ముక్క భాస్కర్, మెతుకు కాంతయ్య, షబానా మహమ్మద్, ఊరడి లత, పోరండ్ల రమేష్, ఎండీ చాంద్, షేక్ శేహెన్న, బాలబద్రి శంకర్, జీడి రమేష్, మామిడి సత్యనారాయణ రెడ్డి, రాజ్ కుమార్, మహమ్మద్ భారీ, కమల్ పాల్గొన్నారు.

టీపీఆర్‌పీఏ ఆధ్వర్యంలో ధర్నా



ఎస్‌టీఓకు వినతి పత్రాన్ని ఇస్తున్న టీపీఆర్‌పీఏ సభ్యులు

నవ తెలంగాణ - హుజురాబాద్ : తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ (టీపీఆర్‌పీఏ) రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంగళవారం ఎస్‌టీఓ హుజురాబాద్ కార్యాలయం ముందు హుజురాబాద్ యూత్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చందుపట్ల జనార్ధన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు మాట్లాడుతూ... ప్రతినెలా 1న పెన్షన్ చెల్లించేలా చూడాలని, గత పీఆర్సీ కాలపరిమితి ముగిసినందున రెండవ పీఆర్సీని వెంటనే నియమించి జులై 1నుంచి ఐఆర్ చెల్లిస్తూ పెండింగ్లో ఉన్న రెండు డీఏలు డీఆర్లు వెంటనే మంజూరు చేయాలని అదేవిధంగా ప్రతి జిల్లా కేంద్రంలో వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఈ హెచ్ ఎస్ స్కీం కింద కార్పొరేట్ వైద్యాన్ని పెన్షనర్లకు అందించాలన్నారు. గత పీఆర్సీ సిఫార్సు ప్రకారం 20సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగులకు పూర్తి పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివరాత్రి ఈశ్వరయ్య, చీకట్ల సమ్మయ్య, కోశాధికారి మండల వీరస్వామి, జిల్లా శాఖ ఉపాధ్యక్షులు బొంగొని వెంకటయ్య, శనిగరం నరేందర్, ఎం .డి. మునీరుద్దీన్, జి.రామకష్ణ, మండల బాధ్యులు జి.బుచ్చిరాజం, జి.గంగయ్య పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు సెలెక్షన్స్



ఆటల పోటీలు నిర్వహిస్తున్న పి ఈ టి లు

నవతెలంగాణ - జమ్మికుంట

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశం కొరకు మంగళవారం స్థానిక బాయ్స్ హై స్కూల్ మైదానంలో మండల స్థాయి సెలక్షన్స్ నిర్వహించారు. విద్యార్థులకు హైట్, వేయిట్, వర్టికల్ జంప్, స్టైయిట్ బ్రాడ్ జంప్, షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, ఫ్లై రన్ నిర్వహించారు. మండల స్థాయిలో అర్హత కలిగిన వారు బుధవారం ఉదయం 8గంటలకు 4, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, జిల్లా స్థాయి సెలక్షన్స్ అర్హత పొంది, రాష్ట్ర స్థాయి సెలక్షన్స్ అవకాశం పొందాలని , డి వై ఎస్ఓ నోటిఫికేషన్ ఆధారంగా అర్హత తేదీలను ఇవ్వటం జరిగిందని తెలిపారు. ఈ అవకాశం మండల విద్యార్థులు వినియోగించుకోవాలని టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ బి పేరెంట్ కమిటీ చైర్మెన్ దూడపాక శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు రేణుక, శేఖర్, శ్రీనివాస్, సుమన్, సత్యనారాయణ, ఉమ, తిరుమల, రాజేందర్ పాల్గొన్నారు.

ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ - జమ్మికుంట: జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో జమ్మికుంట ప్రీమియం లీగ్-1 క్రికెట్ టోర్నమెంట్ మహాలక్ష్మి ఐరన్ హార్డ్వేర్ యజమాని రామడుగు రవీందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన జమ్మికుంట మున్సిపల్ చైర్మెన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాము టోర్నమెంట్ నిర్వాహకులు మాచర్ల రాజు, విక్కీ, విజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో 'గాయత్రి' విద్యార్థుల విజయ దుందుభి



కళాశాల టాపర్స్ ను అభినందిస్తున్న ముస్కే వీర్రాజు

నవతెలంగాణ - జమ్మికుంట : శాతవాహన యూనివర్సిటీ పరీక్ష ఫలితాలలో స్థానిక గాయత్రి డిగ్రీ పీజీ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని కళాశాల కరస్పాండెంట్ ముష్కే వీర్రాజు తెలిపారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంగళవారం స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాల ఆవరణంలో పూల మాలలతో అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడారు. ఇటీవల ప్రకటించిన డిగ్రీ ఫలితాలలో మా కళాశాల విద్యార్థులు అత్యధిక జీపీఏ గ్రేడ్ సాధించడమే కాకుండా పాస్ పర్సంటేజ్ కూడా డివిజన్ లోనే నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు.కళాశాలలో అనుభవం, క్వాలిఫైడ్ అధ్యాపకులచే విద్య బోధన అందిస్తామని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు స్వీయ పర్యవేక్షణలో స్టడీ అవర్స్, యోగా ఏర్పాటు చేసి విద్యార్థుల మానసిక ఒత్తిడి తగ్గించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపల్ ఎస్ కుమారస్వామి మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు చక్కటి ప్రణాళికతో కూడిన విద్యను అందిస్తామని, క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి అనేకమంది విద్యార్థులకు పేరుగాంచిన కంపెనీలలో ఉద్యోగాలు సాధించేలా కృషి చేసినట్టు వివరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కేవలం ఫీజు రీయింబర్స్మెంట్‌తో ఉచిత విద్యను అందజేస్తున్నామని తెలిపారు.కాబట్టి విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షలలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెమోరాండం ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అంజి బాబు, సాగర్, రమేష్, భాస్కర్, చంద్రయ్య పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలి

బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న జివి. రామకష్ణారావు

నవతెలంగాణ-మానకొండూర్ : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమ కారులు కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జీవి రామకృష్ణారావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలోని సుడా క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన శ్రీనివాస్ నగర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లోని ప్రతి కార్యకర్త రాబోయే రోజుల్లో సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరే విధంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో సత్సంబంధాలు ఏర్పరచుకొని రాష్ట్రంలో పార్టీ ని తిరుగులేని శక్తిగా తయారు చేయడానికి ప్రతి కార్యకర్త సహకరించాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జడ్పిటిసి తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షులు రామంచ గోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎరుకల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు ఎరవేణి చంద్రయ్య, గ్రామ ఉప సర్పంచ్ బేతి రాజయ్య, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

పలు గ్రామాల్లో బూత్‌ల పర్యవేక్షణ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మానకొండూర్

మానకొండూర్ మండలంలోని లింగపూర్ రంగపేట, వెల్ది, లక్ష్మీపూర్, వేగురుపల్లి గ్రామాల్లో బిజెపి మండల అధ్యక్షులు రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో స్వల్పకాలిక విస్తారక్ వెంకటేష్ పర్యటించి బూత్ లను పర్యవేక్షించారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణాచారి, ఆసరి రమేష్ యాదవ్, పోలవేణి అనిల్ యాదవ్, మారం సంపత్ యాదవ్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు మడ్డి రాకేష్, గోపు వీరారెడ్డి, మారం హరీష్, మారం అశోక్, బొంకూరి రాజేష్, మారం శ్రీమాన్, అనుపురం శ్రీనివాస్, గడమల్ల దీక్షిత్, ఎనగంటి భావనరుషి, తాళ్లపల్లి పెద్ద తిరుపతి, రాపాక లక్ష్మణ్, ఉప్పు సాయినితీష్, ఎడ్ల గంగయ్య పటేల్, పున్నం శ్రీకాంత్, సుంక సందీప్, రాపాక నవీన్, రంగస్వామి, చంద్రయ్య, వేణు, కొల్లూరి విజయ్ కాంత్, జంగ మధు, పతెం సంపత్, రాజు, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



గ్రామ అధికారులకు అవగాహన కల్పిస్తున్న జరిపి చైర్‌పర్సన్

నవతెలంగాణ - కొనరావుపేట : ప్రజల ఆరోగ్యంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి అన్నారు మంగళవారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ఆరోగ్య పారిశుధ్య, పోషకాహార దినోత్సవం కార్యక్రమంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ఆరోగ్య, పారిశుధ్య, పోషకాహార దినోత్సవం ప్రతి నెలా మొదటి బుధవారం ప్రతి గ్రామంలో జరుపుకోవాలన్నారు. ఆరోగ్య లక్ష్మి పతకం ద్వారా అంగన్ వాడి కేంద్రాలలో గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, ఎంపిడిఓ రామకష్ణ, సిడిపిఓ సుచరిత, సూపర్ వైజర్ గంగలక్ష్మి, పంచాయితీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు

నవతెలంగాణ- పెద్దపల్లి :

జీపీ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. మంగళవారం జీపీ కార్మికుల సమ్మె పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రెండేండ్లుగా అనేక రూపాల్లో ఆందోళనలు, పోరాటాలు నిర్వహించినా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందని పేర్కొన్నారు. అందుకే రాష్ట్రంలోని గ్రామపంచాయతీ ఉద్యోగ,కార్మిక యూనియన్‌లన్నీ జేఏసీగా ఏర్పడి ఈనెల 6న నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ సమ్మెలో పెద్దపెల్లి జిల్లాలోని గ్రామపంచాయతీ ఉద్యోగ,



కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి, కాజా, పెద్దపల్లి మండల అధ్యక్షుడు మామిడిపల్లి తిరుపతి, నాయకులు ఎండి, ముస్తఫా, పి, చంద్రయ్య, ఎండి, రహీం, మామిడిపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు



స్పోర్ట్స్ గేమ్ లో విద్యార్థులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం :

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు, ఐదవ తరగతి విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్ అర్హత పరీక్షలను నిర్వహించినట్టు ఇన్‌చార్జి ఎంఈఓ ఆనందరావు తెలిపారు. ఇందులో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను త్వరలో జగిత్యాలలో జరిగే జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలో పాల్గొంటారని తెలిపారు. వీరికి ఎత్తు బరువు 30 మీటర్లు, రన్, వర్టికల్ జంప్, స్టాండింగ్ బ్రాండ్ జంప్, షటిల్ రన్, ఫ్లెక్సీబిలిటీ టెస్ట్, మెడిసిన్ బాల్‌తో 800 మీటర్ల పరుగు నిర్వహించినట్టు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మద్దిరాల గణేష్, పీడీ కృష్ణ ప్రసాద్, పీఈటీలు రాజు, సరిత పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఇంట్లో ఎమ్మెల్యేకు తేనేటి విందు

నవతెలంగాణ ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా ఎంపీటీసీ దేశెట్టి శాంతి జీవన్ ఇంటికి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు వెళ్లాడు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఎమ్మెల్యేకు తేనేటి విందు ఇచ్చారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయాలను కొద్దిసేపు చర్చించారు. కాగా నూతనంగా నిర్మించిన ఇంట్లోకి ఎమ్మెల్యే రావడం ఎంతో సంతోషాన్నించిందని ఎంపీటీసీ శాంతి జీవన్ దంపతులు తెలిపారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ భారతీ రమేష్, సర్పంచ్ లింగంపల్లి గంగాధర్, మాజీ సర్పంచ్ పుప్పాల నర్సయ్య తోకల డేవిడ్, సుంకరి రాజేష్, సమ్మెట రఘు, యేసు రత్నం, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు



తేనేటి విందు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ట్రిబుల్ ఐటీకి మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివిన వైష్ణవి అనే విద్యార్థి బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపిక కావడం జరిగిందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ నవీన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపల్ దాసరి నవీన్. ఉపాధ్యాయులు పలువురు గ్రామస్తులు అభినందించారు



మహాత్మాజ్యోతిబాపూలే విగ్రహావిష్కరణ

నవతెలంగాణ ఇబ్రహీంపట్నం :

ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో మంగళ వారం మహాత్మా జ్యోతిబావు పూలే విగ్రహాన్ని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని తిరుమల నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ రానవేని సత్యనారాయణ ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఆవిష్కరించారు. జడ్పీటీసీ కంతం భారతి రమేష్, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచ్ లింగంపల్లి గంగాధర్, ఎంపీటీసీ దేశెట్టి శాంతి జీవన్, నాయకులు నేమూరి సత్యనారాయణ, జగన్ రావు, మాజీ సర్పంచ్ పుప్పాల నర్సయ్య, ముదిరాజ్ కులస్తులు సల్వాల రాజేశ్వర్, తోకల డేవిడ్, జానశంకర్, బైండ్ల సంజీవ్, బొజ్జ పెద్ద మల్లయ్య నడిపి మల్లయ్య, నేమూరి శ్రీను, గరిగే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ జూలపల్లి

ముదిరాజ్ సంఘం పెద్దపల్లి జిల్లా కమిటీ చైర్మెన్‌గా కొలిపాక నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా జూలపల్లి మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు జెట్టి సతీష్ చైర్మెన్ సన్మానించారు. జిల్లా కమిటీ డైరెక్టర్ కనకట్ల స్వామి, ముదిరాజ్ మహాసభ ఎలిగేడు మండలం అధ్యక్షులు రాయ నవేణి శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు బొజ్జ కనకయ్యసంపత్, చొప్పరి రవి, తీగల రమేష్, కీర్తి శ్రీనివాస్, మొండయ్య, గుజ్జేటి సంపత్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లిలో స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు పోటీలు

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండలంలో జిల్లా ప్రజా పరిషత్ బాలుర పాఠశాలలో స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీలను ఎంఈవో జెండా ఊపి ప్రారంభించారు. ఏ.అశ్వంత్ తేజ, పెద్దాపూర్ కె.అవంతిక, ఎస్‌సి కాలనీ పెద్దాపూర్ ఎస్.మణిదీప్, ఎంపీపీఎస్ జూలపల్లి పి.రిశ్వంత్, ఎస్సీ కాలనీ జూలపల్లి విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం పి. లచ్చయ్య,పిడి సురేష్,పిటిలు సిహెచ్ వాణి, వెంకటేష్, రాజేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



జెండా ఊపి ప్రారంభిస్తున్న మండల విద్యాధికారిని

పట్టణ అభివృద్ధి పేరిట కోట్ల రూపాయల దోపిడీ

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

మన ఊరు మన ఉష కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దపల్లి పట్టణంలోని సాగర్‌రోడ్ 12వ వార్డులో యాత్ర నిర్వహించి మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధి పేరిట కోట్ల రూపాయలు దోచుకోవడమే తప్ప పట్టణంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. 12వ వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ చాలా అధ్వానంగా ఉందని, ఎన్నో ముస్లిం కుటుంబాలు మురుగు కాలువ పక్కనే జీవనం కొనసాగిస్తున్నారన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను మార్చే విధంగా తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదర్శ్‌నగర్‌లోని 26 సంవత్సరాల యువకుడు బీటెక్ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూసి ఉద్యోగం రాకపోవడంతో ఆందోళన చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హనుమయ్య జిల్లా ఇంచార్జ్ మొలుమూరి చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేష్ పటేల్, అసెంబ్లీ కోశాధికారి ఎండి రియాజ్, పెద్దపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండి అజీమ్, జూలపల్లి మండల అధ్యక్షులు సిపెల్లి కొమురయ్య, శ్రీరాంపూర్ మండల అధ్యక్షులు కుమ్మరి కుంట రవికుమార్, మాజీ అసెంబ్లీ అధ్యక్షులు బొంకూరి సాగర్ పాల్గొన్నారు.



బీఎస్పీ పథకాలను వివరిస్తున్న దాసరి ఉష

వేజ్ బోర్డు లాభాల వాటా వెంటనే చెల్లించాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

నవతెలంగాణ-రామగిరి

సింగరేణి కార్మికులు ఈ సంవత్సరంలోని లాభాల వాటా వెజ్ బోర్డు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని ఎస్‌సిఈయు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. అన్ని కమిటీలలో అన్ని సంఘాలకు సమాన భాగస్వామ్యం కల్పించాలన్నారు. మంగళవారం ఆర్జీ3 ఏరియాలోని అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టులో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించి గేట్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం లాభాలు వాటా, 11వ, వేజిబోర్డ్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. అన్ని కమిటీలలో అన్ని సంఘాలకు సమాన అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ మతోన్మాద విధానాలను దూకుడుగా అమలు చేస్తోందని, కొత్త బావులు సింగరేణికి అనుమతి ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బావులను ఓసిలు చేసి మట్టి, బొగ్గు తీయడం ప్రయివేట్‌కు ఇస్తుందని, కార్మికుల ఉద్యోగ భద్రత అగమ్య గోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం అవుతాయన్నారు. కాళీగా ఉన్న సోలార్ హీటర్స్ బిగించాలని, కబోర్డ్స్ అందరికి అందుబాటులో ఉండాలని, యాక్టింగ్ చేస్తున్న వారికి యాక్టింగ్ రాయాలని అన్నారు. సీఐటీయూ నాయకులు ఏరియా అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, ఏరియా కార్యదర్శి దొమ్మటి కొమురయ్య, డివిజన్ అధ్యక్ష కార్య దర్శులు, ఎమ్.వెంకటేశ్వర్లు, ఈ.కుమార్, కె. వేణుగోపాల్, అహ్మద్ పాషా, సంతోష్, డిరవికుమార్,ఎమ్.సదానందం, శీలం దుర్గా ప్రసాద్‌రావు, అశోక్,జె రవి, రాజ్ కుమార్, దేవ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు..



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి

గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

పెద్దపల్లి కలెక్టర్ సంగీత సత్యనారాయణ

నవతెలంగాణ -పెద్దపల్లి :

గ్రామాల్లో అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని పెద్దపల్లి కలెక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖ అధికారులతో జీపీ భవనాల నిర్మాణం, తెలంగాణకు హరితహారం, బీసీ కుల వృత్తుల ఆర్థిక సాయం, తదితర అంశాలపై సమీక్షించారు. గ్రామాల్లో ప్రతి శ్మశాన వాటికకు తప్పనిసరిగా నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయంలో పరిస్థితుల ప్రకారం నీటి సరఫరా, విద్యుత్ సరఫరా కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని, తాగునీటి అవసరాల కోసం బోర్‌వెల్ ఏర్పాటు, మిషన్ భగీరథ నుంచి కనెక్షన్ తీసుకోవడం, విద్యుత్ కోసం సోలార్ ప్యానల్ ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్ తీసుకోవడం వంటి వాటిని పరిశీలించి పక్కా ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 98 గ్రామ పంచాయతీలలో నూతన భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, జులై 10 నాటికి వీటిలో నిర్మాణ పనులు తప్పనిసరిగా ప్రారంభించాలన్నారు. హరితహారం క్రింద జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 9 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు తయారు చేశామని, ఇప్పటివరకు 5 లక్షల మేర మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తించి గుంతల తవ్వకానికి పరిపాలన అనుమతులు మంజూరు చేశామని, లక్షా 50 వేల గుంతలు తవ్వకం పూర్తి చేశామని అధికారులు వివరించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రంగారెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

గుడుంబాను పూర్తి స్థాయిలో అరికట్టాలి

జగిత్యాల ఎస్పీ ఎగ్గడి భాస్కర్

నవతెలంగాణ- జగిత్యాల టౌన్

గుడుంబాను పూర్తి స్థాయిలో అరికట్టాలని జగిత్యాల ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. జిల్లా పోలీస్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా కార్యాచరణతో జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు కృషి చేయాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గుడుంబా, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా జిల్లాలోకి వచ్చే లిక్కర్‌ను నిరోధించడానికి తీసుకోవాలసిన చర్యలపై పోలీస్, ఎక్సైజ్ అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. గుడుంబా బట్టీలను ఏర్పాటు చేసి గుడుంబా తయారు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అవసరమైతే వారిని సంబంధిత తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలని సూచించారు. బెల్లం పటిక వంటి విక్రయాలను పూర్తి స్థాయిలో నియంత్రించాలన్నారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికలకు జిల్లా ఎక్సైజ్ అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. జిల్లా పరిధిలోని అన్నీ బార్డర్ పీఎస్ పరిధిల్లో (స్టాటిక్ సర్వే లెన్స్ టీమ్స్) చెక్ పోస్టలను ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. డీఎస్పీలు శ్రీనివాస్, రాజశేఖర్ రాజు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ చంద్రబాబు నాయక్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐలు పాల్గొన్నారు.



పోలీస్, ఎక్సైజ్ అధికారులతో జిల్లా ఎస్పీ సమావేశం

నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల విక్రయాలు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ పాఠశాలలో విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలను ఏబీవీపీ నాయకులు మంగళవారం పట్టుకున్నారు. అనంతరం విద్యాధికారులకు సమాచారమివ్వగా పుస్తకాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ.. పెద్దపల్లి పట్టణంలోని ట్రినిటీ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా బుక్స్ స్టాల్ పేరుతో పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తున్నారని తెలిపారు. లాభార్జన ధ్యేయంగా విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కీసర మనిషా, వేల్పుల నాగచంద్ర, జిల్లా హాస్టల్ కన్వీనర్ రాసురి ప్రవీణ్, జిల్లా ఎస్ ఎఫ్ ఎస్ కన్వీనర్ సందనవేన ఓమేష్, అరవింద్, జగ్గంపల్లి అభి, శ్రీనివాస పాల్గొన్నారు.



సీజ్ చేస్తున్న విద్యా శాఖ అధికారులు

సంఘం నుండి మల్లాపూరపు కుమార్ తొలగింపు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ :

మహనీయుల ఆశయ సాధన సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డ మల్లారపు కుమార్, మొలగూరి సదిలను సంఘం నుండి తొలగిస్తున్నట్టు మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం తెలిపారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఇతర సంఘాల నాయకులతో లాలూచిపడి విలువ తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి తీరు సమాజానికి చేటు చేసేదిలా ఉండటంతో సంఘం నుండి తొలగిస్తున్నట్లు కైలాసం స్పష్టం చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు అలువల శంకరయ్య, పట్టణ అధ్యక్షులు కండే కరుణాకర్, జనరల్ సెక్రెటరీ స్వామి, నీరుకుల్ల మహేందర్, అలువాల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న బొంకూరి కైలాసం

దుబాయిలో ఘనంగా వేదవ్యాసుడు వేడుకలు

నవతెలంగాణ జగిత్యాల టౌన్ :

గంగపుత్రుల ఆదిగురువు వేదవ్యాస మహర్షి వేడుకలు దుబాయిలో ఘనంగా జరిగాయి. వ్యాస గురు పౌర్ణమిని పురస్కరించుకొని గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం అధ్యక్షులు సముద్రాల తిరుపతి ఆధ్వర్యంలో వేద వ్యాసుడి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు తోకల శంకర్,కార్యదర్శి బోరే ఇందయ్య, కోశాధికారి సముద్రాల నరేష్, మేడి రమేష్, గౌరవ సలదారులు పల్లికొండ రాములు, బోరే రాజన్న, నిర్మల్ జిల్లా అధ్యక్షులు పుట్టి రాజు, నర్సింలపల్లె అధ్యక్షులు మేడి రాములు, రాంపూర్ అధ్యక్షులు పందిరి రాజేష్, రాంపూర్ కార్యదర్శి కొండ్రు నారాయణ, చింతలపల్లి అధ్యక్షులు జింక నరసయ్య, తాళ్లపేట అధ్యక్షులు నెన్నెల రాజేష్, వెల్గటూర్ గౌరవ సలదారులు గుమ్ముల నరేష్, హనుమంతుపల్లి కార్యదర్శి బోరె రాకేష్, ధర్మారం ఉపాధ్యక్షులు పందిరి చంద్రయ్య నంబాల గౌరసలదారులు పల్లికొండ సురేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ధర్నా

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ నాయకులు మహాధర్నా మంగళ వారం నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్, జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ బెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బోధన, బోధనేతర ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.



కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక



నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మల్యాల, జగ్గయ్యపల్లి గ్రామం లోని పలు పార్టీల నుండి పలువురు యువకులు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు చింతకుంట విజయరమణ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్,గజవేన సదయ్య, వీరయ్య, శ్రీధర్ రెడ్డి, నగేష్,జీవన్ రెడ్డి, రాజ్కుమార్ పాల్గొన్నారు.

ఈనెల 7న జిల్లాస్థాయి యువ ఉత్సవ్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ :

నెహ్రూ యువ కేంద్ర సంఘటన ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేంద్ర పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో జూలై 7న జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ఎం.వెంకట్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి యువ ఉత్సవంలో 15 నుంచి 29 ఏండ్లలోపు యువతీ యువకులు పాల్గొన వచ్చని తెలిపారు. కవిత్వం, పెయింటింగ్, మొబైల్ ఫోటోగ్రఫీ, ఉపన్యాస పోటీలు, గ్రూపు సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కవిత్వం, పెయింటింగ్, మొబైల్ ఫోటోగ్రఫీ పోటీలకు ప్రథమ బహుమతి 1000,ద్వితీయ బహుమతి 750, తృతీయ బహుమతి 500,ఉపన్యాస పోటీకి ప్రథమ బహుమతి 5000,ద్వితీయ బహుమతి 2000,తృతీయ బహుమతి 1000, గ్రూపు సాంస్కృతిక పోటీలకు ప్రథమ బహుమతి 5000,ద్వితీయ బహుమతి 2500, తృతీయ బహుమతి రూ.1,250 ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు జూలై7న ఉదయం 9 గంటలకు ట్రినిటీ ఫార్మసి కళాశాల, కెనాల్ రోడ్, పెద్దపల్లిలో పాల్గొనాలని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎల్. రమణకు పితృ వియోగం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ తండ్రి ఎల్.జి రామ్ (80) సోమవారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జగిత్యాలలోని స్వగృహంలో కన్నుమూశారు. ఎల్.జీ రామ్ మృతదేహానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ దంపతులు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో పాటు పలువురు పూలమాల వేసి నివాళలర్పించారు.



పచ్చి రొట్టె ఎరువుల వాడకంపై అవగాహన

నవతెలంగాణ-కథలాపూర్ :

మండలంలోని సిరికొండ గ్రామంలో పచ్చిరొట్టె ఎరువుల వాడకంపై క్షేత్రస్థాయిలో రైతులకు మంగళవారం మండల వ్యవసాయ అధికారి యోగిత అవగాహన కల్పించారు. పచ్చి రొట్టె ఎరువుల కింద ప్రభుత్వం సబ్సిడీ ద్వారా జీలుగా, జనుము విత్తనాలను అందిస్తుందని, పచ్చిరొట్టె ఎరులను నాటిన 45 రోజుల తర్వాత పూత దశలో ఉండగానే భూమిలో కలియదున్ని ఒక బస్తా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేసి కుల్లింపజేయడం ద్వారా నేలసారం పెరుగుతుందన్నారు. నత్రజని సంబంధిత ఎరువులను 30 శాతం మేర తగ్గించుకోవచ్చని సూచించారు. సర్పంచ్ గాండ్ల వీణ, ఎంపిటిసి కొప్పుల హైమావతి , స్వామి, జలంధర్, కొడిపెల్లి అంజయ్య, బూర్గుల నరసయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు వినీత, షమీన, శేఖర్, వైష్ణవి ,సుష్మ పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల హర్షం

నవతెలంగాణ-కోరుట్ల

తెలంగాణ మోడల్ స్కూల్ ప్రారంభం నుంచి నేటి వరకు బదిలీలు లేవని, తాజాగా ప్రభుత్వం ఉపాధ్యాయుల బదీలీలు షెడ్యూల్ విడుదల చేసినందుకు ప్రోగ్రిసివ్ మోడల్ స్కూల్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాజు జాదవ్ హర్షం వ్యక్తం చేశారు. కోరుట్ల మండలం కల్లూరు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు స్వీట్లు తినిపించుకున్నారు. పది సంవత్సరాలుగా మోడల్ స్కూల్ టీచర్‌ల బదిలీలు లేవని బదిలీలకు సహకరించిన ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్టీయూ రాష్ట్ర బాధ్యులు శ్రీపాల్‌రెడ్డి, మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ రమణ, రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్‌లకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నర్సయ్య రమేష్, ప్రవీణ్, మహేష్, నరేష్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, రమేష్, ఖాన్, అనతిత షర్మిల తదితరులు పాల్గొన్నారు



స్వీట్లు తినుపించుకుంటున్న ఉపాధ్యాయులు

ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని సాయిరాం పుర కాలనీలో ఉన్న శ్రీ అభయాంజనేయ ఆలయంలో గత 41 రోజుల క్రింద ఆలయంలోని విగ్రహాలను ప్రతిష్టించారు. మంగళవారం నాటికి ప్రతిష్ఠించి 41 రోజుల పూజలో భాగంగా ఆంజనేయ స్వామికి పంచామృతంతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి హెూమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దురిషెట్టి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు కుమారస్వామి, రవి, నడిగడ్డ రాజు, ఎంపీడీవో ప్రభు, దురిశెట్టి కిరణ్, పాయికారి రవి, శ్రీగద్దె నరేందర్, కటుకం సునీల్, జక్కుల ప్రసాద్, హరి, అర్చకులు పణీంద్ర శర్మ పాల్గొన్నారు.



భోజనం పెడుతున్న కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ

రజక సంఘానికి రూ.4లక్షలు మంజూరు

నవతెలంగాణ-కోరుట్ల :

పట్టణంలోని రజక సంఘానికి బిఆర్ఎస్ నాయకుడు కల్వకుంట్ల సంజయ్ రూ.4లక్షల ప్రొసీడింగ్ కాపీని మంగళ వారం అందజేశారు. సంఘాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు అన్నం అనీల్, కౌన్సిలర్‌లు పవన్, శ్రీనివాస్, రజక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ కాపీ ఇస్తున్న సంజయ్

జిల్లా స్థాయి క్విజ్ పోటీలో మండల విద్యార్థులు

నవతెలంగాణ కోరుట్ల

మండంలోని మోహన్ రావుపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్సియల్ లిటరీన్ క్విజ్ పోటీలో పాఠశాల విద్యార్థులు వేదశ్రీ, సాయిదీప్ తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లలిత, వెంకటస్వామి, పిస్క రమేష్, గ్రామ సర్పంచ్ సరికెళ్ళ మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పోటీలో గెలిచిన విద్యార్థులకు ఉపాధ్యాయుల అభినందన

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ఏబీవీపీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యాసమితి సభ్యుడు రాపాక సాయి కుమార్ మాట్లాడుతూ.. 1200 ప్రాణ త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్టంలో ఇప్పటికి విద్యార్థులకు నిరాశ మిగిలిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విస్తరక్ నల్ల నవీన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్తీక్, సునీల్, రాజు, నగర కార్యదర్శి మనువాద నందు, జిల్లా హాస్టల్స్ కన్వినర్ నీరేటి శ్రీనివాస్, మనోహర్, మహేష్, శ్రవణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.



మంత్రికి ఎల్‌ఐసీ ఏజెంట్ల వినతి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఏజెంట్లు కోరారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సహకారంతో మంగళవారం జగిత్యాల బ్రాంచ్ అధ్యక్షుడు ఏ. వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి పాదం ఐలయ్య, కోశాధికారి జున్ను మల్లయ్య ఆధ్వర్యంలో పలువురు ఎల్‌ఐసి ఏజెంట్లు కలెక్టరేట్‌లో మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిశారు. బ్రాంచ్ పరిధిలో వెయ్యి మందికి పైగా ఏజెంట్లు పని చేస్తున్నారని, వారందరికి ఒక వేదికగా ఏజెంట్ల సంఘ సంక్షేమ భవనానికి స్థలం కేటాయించాలని లియాఫీ నాయకులు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే ఏజెంట్ల సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషను ఆదేశించారు.



ఆర్థిక అక్షరాస్యతపై జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్ :

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత పైన క్విజ్ పోటీలను నిర్వహిస్తున్న తరుణంలో బ్లాక్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు "ఆర్థిక అక్షరాస్యత" పైన జిల్లా స్థాయి క్విజ్ పోటీలను పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్బీఐ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లైజనింగ్ అధికారి శ్రీ కుమార్ హాజరయ్యారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆదాయం, పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉంటూ సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో ఎస్. అన్విత, ఎస్. అమూల్య (జెడ్పీ హైస్కూల్, వెల్లటూరు), ద్వితీయ స్థానంలో ఒ.నితిన్, ఆర్. సౌమిత్ (జెడ్పీ హైస్కూల్, వర్షకొండ), ఎ. వేదశ్రీ, డి. సాయిదీప్ (జెడ్పీ హైస్కూల్, మోహన్ రావు పేట) విజేతలుగా నిలిచారు. జగిత్యాల ఎంఈవో గాయత్రి, జిల్లా ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ కోట మధు సూదన్, సెక్టోరియల్ అధికారి దేవేందర్, అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే 'రాణా దివస్' లక్ష్యం

- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - ఇల్లంతకుంట

ప్రజలకు మరింత చేరువగా పోలీసింగ్ వెళ్లడానికి, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "రాణా దివస్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి నెలా మొదటి వారంలో ఒక రోజు ఒక పోలీస్ స్టేషన్లో నిర్వహించి ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించి పరిష్కరిస్తూ భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. స్వయంగా ఎస్పీ 56అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారం కోసం వెనువెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా జిల్లా ఎస్పీ స్వయంగా తమ దగ్గరికి వచ్చి ఓపికతో


సమస్యలు వింటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తమ ఫిర్యాదులు స్వీకరించడం చాలా సంతోషంగా ఉందన్న అర్జీదారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ఉపేందర్, ఎస్ఐ రాజేష్, ఏఎస్సైలు మోతీ రామ్, భూమయ్య, సిబ్బంది పల్గొంది.

విద్యార్థులకు బస్సు పాసుల పంపిణీ


02కొనరావుపేట4 విద్యార్థులకు బస్ సులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ - కొనరావుపేట :

మండలంలోని మామిడిపల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను గ్రామ సర్పంచ్ కొక్కుల భారత-నర్సయ్య. పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను అమర్చిందని విద్యార్థులు సమయపాలనలో పాఠశాలకు వెళ్లాలని అన్నారు ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మురళీకష్ణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఆర్టీసీ సిబ్బంది నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో చెల్పూర్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ- హుజురాబాద్ :



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా కేంద్రంలో మంగళవారం ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఫైనాన్సియల్ లీటరసీ క్విజ్ పోటీలలో జెడ్పీహెచ్ఎస్ చెల్పూర్ విద్యార్థులు ఎం.ఆశ్రేయ, ఎం.మేరీ యాంజెల్ జిల్లాస్థాయిలో రెండవ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చిలగారే వెంకట సూర్య జనార్ధన రావు , కరీంనగర్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, ఆర్బీఐ ప్రతినిధి పాటిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు సోగాలా అంజయ్య, ఎస్ఎంసి చైర్ పర్సన్ రజిత, ఉపాధ్యాయులు అభినందించారు.

బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకు సిద్ధంగా ఉండాలి

బీజేపీ తిమ్మాపూర్ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి


నవతెలంగాణ - తిమ్మాపూర్


మాట్లాడుతున్న జగదీశ్వరా చారి

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ తిమ్మాపూర్ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి పిలుపునిచ్చారు. మహాజన సంపర్క్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మక్తపల్లిలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ మండలంలోని అన్నీ గ్రామాల్లోని బూత్ కమిటీ కార్యకర్తలు ఆయా బూత్ ల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏమైనా సమస్యలుంటే సహకరించగలరని సూచించారు. రాష్ట్ర ఈసీ మెంబర్ ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని బూత్ ల వారిగా పార్టీ పటిష్టత కోసం సమిష్టి నిర్ణయాలతో కార్యక్రమాలను రూపొందించుకుందామని తెలిపారు. తమిళనాడు నుండి వచ్చిన అల్పకాలిక విస్తారక్ సి.లక్ష్మణన్‌రాం మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో మాట్లాడినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్ తమ్మిశెట్టి మల్లయ్య, బూట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కిన్నెర అనిల్,ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి,కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల రవీందర్ యాదవ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'జీప్యాట్' ప్రవేశ పరీక్షలో వాగేశ్వరి విద్యార్థుల ప్రతిభ


నవతెలంగాణ - తిమ్మాపూర్


ప్రతిభకనబర్చిన విద్యార్థులు

మండలంలోని రామకృష్ణ కాలనీలో గల అఖిలభారత స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎం.ఫార్మసీ ప్రవేశం కొరకు నిర్వహించిన జీప్యాట్ (గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్) వాగేశ్వరి ఫార్మసీ కళాశాలకు చెందిన విద్యార్థులు భూక్యలత, చింతల వైశాలి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని రాబోవు పరీక్షల యందు మరింత మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఆశా భావం వ్యక్తం చేశారు.అనంతరం విద్యార్థులను కళాశాల సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు ప్రకాష్ రెడ్డి, వినోద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి విద్యార్థులను అభినందించారు.

ర్యాంక్‌తో సంబంధం లేకుండా రీయింబర్స్‌మెంట్ విడుదలచేయాలి

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం జిల్లా బాధ్యులు

ర్యాంక్‌తో సంబంధం లేకుండా ఇంజనీరింగ్ విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బిసి విద్యార్థి సంఘం సిరిసిల్ల డివిజన్ ఇన్‌చార్జి ఇల్లందుల ప్రకాష్ అధ్వర్యంలో సిరిసిల్లాలోని బిసి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంచర్ల రవి గౌడ్ మాట్లాడారు. బీసీ విద్యార్థులకు ర్యాంక్‌తో సంబంధం లేకుండా ఇంజనీరింగ్ విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ విద్యకు 10,000ర్యాంక్ నిబంధనను పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నిరుపేద బీసీ విద్యార్థులకు ఉన్నత(ఇంజనీరింగ్) విద్యకు దూరం చేసేందుకే ఈ నిబంధనను ప్రవేశపెట్టిందని ఆరోపించారు.

వడ్డీ వ్యాపారుల ఆస్తులను ప్రభుత్వం సాధీనం చేసుకోవాలి

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు

జిల్లాలోని అక్రమ వడ్డీ వ్యాపారుల ఆస్తులను ప్రభుత్వ సాధీనం చేసుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లాలోని వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేసి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం సిపిఐ పార్టీ స్వాగతిస్తున్నదన్నారు. సిరిసిల్ల ప్రాంతానికి చెందిన కొందరు అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తూ రూ.వందల కోట్ల దోచుకున్నారని తెలిపారు. పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని 10శాతానికి డబ్బులు వడ్డీకి ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పంతం రవి, మంచి కట్ల రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- నెలాఖరులోగా మన ఊరు-మనబడి పనులు పూర్తవ్వాలి
- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి

నవతెలంగాణ -ముస్తాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు స్థానిక, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఉపాధ్యాయులు అధిక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం మండలంలోని కస్తూరిబా పాఠశాల, గురుకుల పాఠశాల, బంధనకల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మనబడి కింద చేపట్టిన పనులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డైనింగ్ రూమ్, ఎలక్ట్రికల్ వర్క్ వంటి పనులు ఇప్పటికే పూర్తి చేయగా మిగతా సంప్, డ్రింకింగ్ వాటర్, తదితర పెండింగ్ పనులను నెలాఖరులోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బందునకల్ లోని ప్రాథమిక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో రెండు పాఠశాలల్లో గత సంవత్సరం కట్ట విద్యార్థుల సంఖ్య తగ్గడంతో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బంధనకల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు వారానికి


విద్యార్థులచే మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

మూడుసార్లు గుడ్లు ఇవ్వాల్సి ఉండగా.... ధరలు పెరిగాయని సరఫరా నిలిపివేశారని స్థానిక ప్రజాప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుక రాగాజిల్లా విద్యాధికారి మండల విద్యాధికారి, ఎగ్ సప్లయర్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించి రేపటినుండి గుడ్లు పాటశాలకు సరఫరా అయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్‌కు సూచించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మండల కేంద్రములోని కేజీబివి పాఠశా, సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.5.9 లక్షల రూపాయలు మంజూరు చేశామని వాటినీ సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కు సూచించారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు చిత్రకళలో రాణిస్తుండడంతో ఈ పాఠశాలలో ప్రత్యేకంగా ఆర్ట్ రూమ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆర్ట్ టీచర్ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు.


ఎరువులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల్లో జూన్ 30నుంచి 12వరకు స్వచ్ఛ సర్వేక్షన్ -2023 ప్రత్యేక కార్యక్రమం షెడ్యూల్‌ను ప్రభావవంతంగా అమలయ్యేలా క్షేత్ర అధికారులు చూడాలన్నారు. ముస్తాబాద్ సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రమును జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల దుకాణాల్లో విత్తనాలు, పురుగు మందుల స్టాకు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎరువులు, విత్తనాల స్టాక్ జాబితాను పరిశీలించారు. విక్రయాలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్లైన్ ఎంట్రీలను చేయాలని ప్యాక్స్ నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి ఎ రమేష్ కుమార్, ఎంపీపీ శరత్ రావు, జెడ్పీటీసీ నర్సయ్య, తహసీల్దార్ మునిందర్, ఎంపీడీవో రమాదేవి ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ముగ్గురి మృతి

రామంచ గ్రామంలో విషాదం

నవతెలంగాణ - తిమ్మాపూర్ :

బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు ఇసుక ట్రాక్టర్ ఢీకొని మృతి చెందారు. ఈ విషాద ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంటలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎల్ఎండీ పోలీసుల వివరాల ప్రకారం..చిగురుమామిడి మండలం రామంచ గ్రామానికి చెందిన శివరాత్రి ఆంజనేయులు(22) తన బైక్‌పై మిత్రులు శివరాత్రి సంపత్(19), గుడిపల్లి అరవింద్(19)లతో కలిసి వెళుతుండగా రేణిగుంట బ్రిడ్జి వద్ద హైదరాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న ఇసుక ట్రాక్టర్ వారి బైక్‌ను వెనక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరవింద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు, సంపత్‌లను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆంజనేయులు మృతి చెందాడు.



మృతిచెందిన యువకులు ఫైల్ ఫోటోస్


పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రవీందర్

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం సంపత్ మృతి చెందాడు. ఆంజనేయులు తండ్రి మల్లయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రామంచ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఒకేసారి చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న చిగురుమామిడి జెడ్పీటీసీ జి.రవీందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు సాంబారి కొమురయ్య కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చూరిలో మృతదేహాలను పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గ్రామ పంచాయతీ భవనాల మంజూరు

నవతెలంగాణ - కొనరావుపేట :



మండలంలో నాలుగు నూతన గ్రామ పంచాయతీలకు మామిడిపల్లి, మల్కపేట్, శివంగలపల్లి, ఎగ్లాస్ పూర్ గ్రామాలకు నూతన భవనాలు మంజూరు ఉత్తర్వులను సర్పంచులకు జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 16 గ్రామపంచాయితీ లకు నూతన భవనాలు, ఇప్పుడు 4 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రభాకర్‌రావు సర్పంచ్‌లు కొక్కుల భారత-నర్సయ్య, సురేష్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, ఆరె మహేందర్, యాస రాజం పాల్గొన్నారు.

గ్రామాల్లో కోకొల్లలుగా ప్రజా సమస్యలు

- సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకట్ రెడ్డి


నవతెలంగాణ - సైదాపూర్


మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

:ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం సైదాపూర్ మండలంలోని ఏక్లాస్పూర్ సోమారం బూడిదపల్లి వెన్నంపల్లి లస్మన్నపల్లి కుర్మపల్లి గ్రామాల్లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయని, వాటిని అధ్యయనం చేసిన తర్వాత పరిష్కారానికి ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, బత్తుల బాబు, గూడెం లక్ష్మీ, సైదాపూర్ మండల సీపీఐ నాయకులు కంది రవీందర్ రెడ్డి, దోనికేన అనిల్, వొడ్నాల వెంకటేష్, జడల రాజేశం, నలువాల రవీందర్, ఒజ్జ కొమురయ్య, కొమ్ముల సమ్మయ్య, భాషవేని శ్రీనివాస్, బొల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

హుజురాబాద్ డిపోకు అవార్డులు పంట

నవతెలంగాణ - హుజురాబాద్


కార్మికులను అభినందిస్తున్న టీఎస్ఆర్టీసీ ఎండి సజ్జనార్

ఆర్టీసీ కల్యాణ మండపంలో మంగళవారం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ చేతుల మీదుగా ఉద్యోగులకు అవార్డును ప్రదానం చేశారు. టీఎస్ఆర్టీసీ హుజురాబాద్ డిపోకు రాష్ట్ర స్థాయిలో అవార్డులు లభించాయి. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టీం డ్రైవర్‌గా ఇ.రవీందర్, ఈ-851362, ఉత్తమ నటి శిక్షకుడిగా ఏ.బాపు రెడ్డి, ఈ- 318164లు ఎన్నికయ్యారు. అలాగే దసరా ఛాలెంజ్‌లో భాగంగా అత్యధిక ఆదాయం సాధించినందుకు హుజురాబాద్ డిపో మేనేజర్ పి.అర్పితకు ప్రత్యేక బహుమతి, ఉత్తమ టిమ్ డ్రైవర్‌గా బి. వెంకటయ్య, కండక్టర్‌గా ఎస్.సురేఖ ఎన్నికయ్యారు. సంక్రాంతి ఛాలెంజ్‌లో భాగంగా ఉత్తమ డ్రైవర్‌గా సిహెచ్ రవీందర్, ఉత్తమ కండక్టర్‌గా టి.విజయ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రీజినల్ మేనేజర్ సుచరిత, డిపోమేనేజర్ పి. అర్పిత, ఎస్టీఐ మురళి, డిపో అధికారులు అభినందించారు.

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి

నవతెలంగాణ - వీర్నపల్లి


గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షులు లద్దురి నర్సయ్య అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు జూలై 6నుంచి సమ్మెకు సిద్ధమవగా.. మంగళవారం ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీపీలకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు వేతనం పెంచాలని, 11వ పీఆర్సీలో నిర్ణయించిన మినిమం బేసిక్ రూ.19వేలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, జీవో నెంబర్ 51ను సవరించి మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు న్యాత నరసయ్య,ఉపాధ్యక్షులు శ్రీనివాస్, గుర్రపు సురేష్, ప్రధాన కార్యదర్శి గద్దె గారి శేఖర్ ఉన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య

గీట్ల ముకుంద రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

నవతెలంగాణ - హుజురాబాద్

దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతి సభ సిపిఎం హుజురాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ ఆఫీసులో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం జరిగిన పోరాటం రైతాంగ సాయుధ పోరాటంగా మారడానికి దొడ్డి కొమరయ్య అమరత్వమే ప్రధాన కారణమన్నారు. నిజాం పాలనలో తెలంగాణలోని గ్రామాల్లో జాగీర్దార్లు, దేశ్ ముఖ్‌లు, భూస్వాములు, దేశ్ పాండేలు మొదలైన దొరల దురాగతాల కారణంగా విసిగి వేసారిన ప్రజలకు ఆంధ్రమహాసభ కమ్యూనిస్టుల సంఘం ఒక దివిటీ లాగా కనిపించేదన్నారు. జనగామ తాలూకాలో విసునూర్ దేశ్ ముఖ్ రామచంద్రారెడ్డి ఆధీనంలో ఉన్న 60 గ్రామాలలో ఒకటైన కడివెండి గ్రామంలో దేశ్ ముఖ్ రామచంద్రా రెడ్డి తల్లి దొరసాని అయిన జానకమ్మ ప్రజల పట్ల క్రూరంగా వ్యవహరించేవారు. 1946 జూలై 4వ తేదీన కమ్యూనిస్టు పార్టీ నాయకులపై దాడి జరపాలని పన్నిన కుట్రలో భాగంగా దేశ్ ముఖ్ అనుచరుడు మస్కీన్ అలీ ఆధ్వర్యంలో 40 మంది గుండాలు కడవెండి గ్రామంలోకి ప్రవేశించి చీకటి పడే సమయానికి సంఘం కార్యకర్తలను రెచ్చగొడూ వారి ఇళ్ళ మీదికి రాళ్ళు రువ్వడం మొదలెట్టారు.


హుజురాబాద్ : గీట్ల ముకుంద రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

దీనికి ధీటుగా భీంరెడ్డి నర్సింహారెడ్డి నాయకత్వం లో సుమారు 200 మందికి పైగా ప్రజలు ఏకమై దొరలకు వ్యతిరేకంగా నినాదాలతో ఆ ప్రదేశాన్నంతా హోరెత్తిస్తూ ర్యాలీగా బయల్దేరారు. వీరితో పాటు కొమరయ్య తన అన్న మల్లయ్యతో కలిసి ముందు వరుసలో నిల్చున్నాడు. దేశ్ ముఖ్‌కి సంబంధించిన ప్రైవేట్ రక్షణదళం ర్యాలీగా వస్తున్న ప్రజలపై కాల్పులు జరిపారు. ముందు వరుసలో నిలుచున్న దొడ్డి మల్లయ్య కాలికి, దొడ్డి కొమరయ్యకు పొట్టభాగంలో తూటాలు తగిలాయి. కొమరయ్య ఆంధ్రమహాసభకు జై, కమ్యూనిస్టు పార్టీకి జై అని నినదిస్తూ నేలకొరిగారని వివరించారు.

మహత్తర తెలంగాణ సాయుధ పోరాటానికి మత రాజకీయ రంగు పులుముతున్న బీజేపీ

నిజాం రాజు ముస్లిమ్ కావచ్చు కానీ, అతని తొత్తులయిన జమిందార్లు, భూస్వాములు హిందువులు. ప్రజలను ప్రత్యక్షంగా హింసించింది వీరే. తెలంగాణ గుండెల్లో విప్లవాగ్ని రగిలించిన దొడ్డి కొమరయ్యను చంపివేసింది విసునూరు దేశముఖ్ రామచంద్రారెడ్డి గుండాలు. అంతకుముందు వీరనారి చిట్యాల సాగు చేసిన భూమిలోని ధాన్యాన్ని గుంజుకున్నదీ, షేక్ బందగిని చంపిందీ ఈయన గుండాలే. భీంరెడ్డి నర్సింహారెడ్డి, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యంతోపాటు కవి షోయబుల్లా ఖాన్, మగ్దూమ్ మొయినొద్దీన్ వంటి అనేకమంది ముస్లిములు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు.

పోరాటంతో ఏ విధమైన సంబంధంలేని, చరిత్రను వక్రీకరించడంలో సిద్ధహస్తులయిన సంఘ్ పరివార్ శక్తులు, వారి రాజకీయ అంగమైన బీజేపీ చరిత్రను మసిపూసి మారేడుకాయను చేసే ప్రయత్నం చేస్తున్నారు. నిజాం ప్రభువు ముస్లిమ్ కాబట్టి మత రాజకీయాల ద్వారా హిందూ ఓట్ బ్యాంక్ పొందాలని చూస్తుంటే, ఫ్యూడల్ భావజాలం కలిగిన కేసీఆర్ రజాకార్ల వారసులైన ఎంఐఎంతో దోస్తాన్ ద్వారా ముస్లిముల ఓటు బ్యాంక్ పదిల పరుచుకోవాలని చూస్తున్నాడన్నారు. ఈ రెండు ధోరణులు తెలంగాణ అభివృద్ధికి ఆటంకమని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో విద్యార్థులు, యువకులు, కార్మికులు, కర్షకులు ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాటం చేయడమే ఆ యోధులకు నిజమైన నివాళి అన్నారు. దానికి దిక్సూచి వామపక్షమేనన్నారు.ఈ కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు గుండేటి వాసుదేవ్, నాయకులు కదిరే రమేష్, కొంకట చంద్రయ్య, రాచపల్లి సారయ్య, మహేష్, రవి, ప్రశాంత్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్ల: నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్ పర్సన్


జమ్మికుంట: దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు


కొత్తపల్లి : చిత్ర పటం వద్ద నాయకులతో రుద్ర రాజు

పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య

నవతెలంగాణ - సిరిసిల్ల : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ అరుణ అన్నారు. తెలంగాణ కోసం పోరాడి అమరుడైన తొలి వ్యక్తిగా ఆయన చరిత్రలో నిలిచారన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ వేడుకలకు జెడ్పీ చైర్‌పర్సన్ హాజరై యోధుడు దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కలెక్టరెట్ ఏఓ బి. గంగయ్య, జిల్లా బిసి అభివృద్ధి అధికారి రాఘవేందర్, డీడబ్ల్యూవో లక్ష్మీ రాజం, సిపిఓ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, డీపీఆర్‌వో దశరథం, బిసి నాయకులు, గొల్ల, కురుమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండల కేంద్రంలోని గ్రామపం చాయతీ ముందు దొడ్డి కొమరయ్య మండల యాదవ కురుమ సంఘాల నాయకులు వర్ధంతి వేడుకలు మంగళవారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శరత్ రావు, జెడ్పీటీసీ నరసయ్య, సర్పంచ్ సుమతి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కొత్తపల్లి : కొత్తపల్లి మున్సిపల్ పట్టణంలో మంగళవారం దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతి కార్యక్రమం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వీణవంక : మండలంలోని ఎల్బాక గ్రామంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని గొర్లు, మేకల పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బస్టాండ్ లో మంగళవారం దొడ్డి కొమురయ్య చిత్ర పటం ఏర్పాటు చేసి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొర్లు, మేకల పెంపకం దారుల జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి రవియాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెడ్ల విజేందర్, రొడ్ల రాజుకుమార్, కొత్తిరెడ్డి మల్లారెడ్డి, ముదం కొమురయ్య, మడికొండ సంపత్, పోలు భూమయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - చొప్పదండి : దొడ్డి కొమురయ్య కురుమ 77వ వర్ధంతి వేడుకలను మంగళవారం కురుమ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలన్నారు. జయంతి వేడుకలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు గుంటి మల్లయ్య, బైరతిరుపతి, రాజన్నల శంకర్, గుంటి రాజమల్లు, బైరవీరేశం, దాసరగొండ రవి, రాజన్నల రాజు, కురుమ యువ చైతన్య సమితి నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - జమ్మికుంట : దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు మంగళవారం మోత్కులగూడెం చౌరస్తాలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్‌రావు హాజ రై మాట్లాడారు. కార్యక్రమంలో, కౌన్సిలర్‌లు పొనగంటి సారం గం, ఎల గందుల స్వరూప శ్రీహరి కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గన్నేరువరం : మండల కేంద్రంలో గొల్ల, కురుమ యాదవ సంఘాల ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ పోరాటంలో నిజాంరక్కసిపై పోరాడి అసువులు బాసిన వీరుడని కొనియాడారు. యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, యాదవ సంఘం అధ్యక్షులు మీసం రాములు, నాయకులు జిల్లా మహేష్, కుమార్ యాదవ్, పాశం ప్రభాకర్, బొజ్జ లింగయ్య, బండి తిరుపతి, కాల్వ సంపత్ పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్య సాధనలో ఈ మూడు నెలలే కీలకం

- రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలి
- 14.67 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎంలకు సీఎండీ దిశానిర్దేశం

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి కాలరీస్ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 75 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలంటే ఈ మూడు నెలలు అతికీలకమని, వర్షాకాలంలో ఉపరితల గనుల్లో ఉత్పత్తి కుంటు పడకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలను ఇప్పటి నుండే చేపట్టాలని సీఎండీ ఎన్. శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. గత ఏడాది చరిత్రలో ఎన్నడూ లేనంతగా భారీ వర్షాలు కురవడం వల్ల రెండో త్రైమాసికంలో అతి తక్కువ బొగ్గు ఉత్పత్తి జరిగిందని.. ఈ ఏడాది జులైలో కొంత వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఉత్పత్తి సాఫీగా జరిగేలా చూడాలన్నారు. ఒకవేళ వర్షాలు కురిసినప్పటికీ ఓపెన్ కాస్ట్ గనుల్లో నీటి నిల్వ వల్ల బొగ్గు ఉత్పత్తికికు ఆటకం కలగకుండా ఉండేందుకు ఇప్పటి నుండే భారీ పంపులను గనుల వద్ద ఏర్పాటు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఅండ్ఎండీ

చేసుకోవాలని, వర్షపు నీటిని ఎప్పటికప్పుడు బయటకు తోడిపోయాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం ఏరియా రోజుకు 41 వేల టన్నుల బొగ్గు రవాణా జరపాలని మణుగూరు ఏరియా 40 వేల టన్నులు రామగుండం-2 ఏరియా 24 వేల టన్నులు, శ్రీరాంపూర్ ఏరియా 19 వేల టన్నులు, రామగుండం 3ఏరియా 14,500 టన్నులు, బెల్లంపల్లి 14 వేల టన్నులు, మందమర్రి 12 వేల టన్నులు, రామగుండం 1 ఏరియా 11,500 టన్నులు, భూపాలపల్లి 10 వేల టన్నులు, ఇల్లందు ఏరియా 9 వేల టన్నులు సాధించాలని ఆయన నిర్దేశించారు. డైరెక్టర్ (ఫైనాన్స్, పర్సనల్) ఎన్.బలరామ్, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్‌వికే శ్రీనివాస్, డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) జి వెంకటేశ్వర్ రెడ్డి, అడ్వైజర్ (మైనింగ్) డిఎన్ ప్రసాద్, అడ్వైజర్ (ఫారెస్ట్రీ) సురేంద్ర పాండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) జె.ఆల్విన్, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) ఎం.సురేష్, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) క.సూర్యనారాయణ, జనరల్ మేనేజర్(సీపీపీ) జక్కం రమేష్, జనరల్ మేనేజర్ (మెటీరియల్ ప్రొక్యూర్మెంట్) మల్లెల సుబ్బారావు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తుల అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:
తాళాలు వేసి ఉన్న ఇండ్లల్లో పార్కింగ్ చేసి ఉన్న మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న నిందితులను ఎన్టీపీసీ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో గౌతమినగర్‌లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలకొట్టి ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారని బాధితుడు జాకీర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ దొంగతనంలో ఇదివరకు పలు కేసులలో నిందితుడైన కొండ రాజేష్‌గా నిర్ధారించుకొని, ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి నిందితుడి గురించి వెతుకుతుండగా మంగళవారం ఒంటి గంట సమయంలో నిందితులు మేడిపల్లి చౌరస్తాలో ఎన్టీపీసీ వైన్ షాప్ వద్ద ఉన్నాడనే పక్కా సమాచారం మేరకు నిందితున్ని చాకచక్యంగా పట్టుకొని విచారించడం జరిగిందని తెలిపారు. నిందితుడు కొండ రాజేష్ గతంలో పలు దొంగతనాలలో జైలుకి వెళ్లి వచ్చాడని తెలిపారు. అయినప్పటికీ తన పద్ధతి మార్చుకోకుండా మరో నిందితుడు బండారి శివ కోటేశ్వరరావుతో కలిసి వారి జల్సాల కోసం చోరీకు పాల్పడుతున్నారని తెలిపారు. దొంగలించిన ఆభరణాలను, వాహనాలను నిందితుడు రిసీవర్ గుర్రాల గంగాధర్ ద్వారా అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలకు పాలడుతున్నట్లు విచారణలో తెలిందని చెప్పారు. నిందితులను దర్యాప్తు అనంతరం కోర్టుకు రిమాండ్ నిమిత్తం హాజరు పరచడం జరుగుతుందన్నారు. నిందితులపై ఎన్టీపీసీలో ఒక కేసు, గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో మూడు కేసులు నమోదు కాగా, వీరి వద్ద నుంచి 3 తులాల ఒక నల్ల పూసల దండ, ఒక తులం బంగారు చైన్ వీల్ లాకెట్, అరతులం ఒక జత చెవి కమ్మలు, పావు తులం బంగారు ఉంగరం, 15 తులాల వెండి పట్టీలు, 3 తులా వెండి బ్రాసేలేట్, 4తులాల వెండి తాళాల గుత్తి, 3. తులాల వెండి మట్టెలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు నిందితులు గోదావరిఖని పట్టణ పరిధిలో నివాసముంటున్న కొండ రాజేష్, బండారి శివ కోటేశ్వర్ రావు, గుర్రాల గంగాధర్‌గా పేర్కొన్నారు. పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రామగుండం సిఐ చంద్రశేఖర్ గౌడ్, గోదావరిఖని వన్‌టౌన్ రెండవ సిఐ ఎన్.ప్రసాద్ రావు, ఎన్టీపీసీ ఎస్ఐ జీవన్‌ను డిసిపి అభినందించి, నగదు రివార్డులను అందజేశారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-జూలపల్లి:
పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జూలపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జూలపల్లి మండల కేంద్రానికి చెందిన పాతకుల రమ్య నరేష్‌తో 11 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. పిల్లలు పుట్టడం లేదని భర్త నరేష్ మరో మహిళలతో వివాహేతర సంబంధ పెట్టుకుని మానసికంగా వేధిస్తున్నాడని తీవ్ర మనస్థాపం చెంది ఈనెల 3న గడ్డి మందు తాగింది. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. మృతురాలి చెల్లెలు గొర్రె కోమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

శ్మశాన వాటికకు నీటిపంపు అందజేత

నవతెలంగాణ-రామగిరి:
రామగుండం3 ఏరియాలోని ఓపీసీ-1 ఉపరితల గని రెమిడీయేషన్ ప్లాన్‌లో భాగంగా సింగరేణి ప్రభావిత గ్రామమైన పన్నూరులో శ్మశాన వాటిక కోసం రూ.59 వేల విలువ గల 2 హెచ్‌పి సబ్మెర్సిబుల్ నీటి పంపును మంగళవారం జీఎం కార్యాలయంలో ఆర్జీ-3 జీఎం ఎస్. సుధాకరరావు పన్నూర్ గ్రామ సర్పంచ్ అల్లం పద్మ తిరుపతికి అందజేశారు. ఎస్ఓటు జీఎం జి.రఘుపతి, సివిల్ డీజీఎం పద్మరాజు, పీఈ ఓసీపీ -1ఆర్.శ్రీనివాస్, ఇన్‌చార్జి పర్యావరణ అధికారి బీవీ సత్య నారాయణ, సివిల్ డీవైఎస్ఈ రామకృష్ణ పాల్గొన్నారు.


సర్పంచ్ పద్మ తిరుపతికి మోటార్స్ స్టార్టర్ అందజేస్తున్న జీఎం ఎస్ సుధాకర్ రావు

విద్యార్థులకు నోటుబుక్కులు, స్టేషనరీ అందజేత

నవతెలంగాణ-మల్లాపూర్:
మండలంలోని మొగిలిపేట్, ఓబులాపూర్ పల్లె ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో నోటు బుక్కులను స్టేషనరీ మంగళవారం ట్రస్ట్ చైర్మెన్ సుర్గి శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరా జ్, ఉపసర్పంచ్ రమేష్, రుద్రం రాంప్రసాద్, మోర సతీష్, పిప్పెర నరేష్, రాజేష్, రవితేజ, పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మల్లాపూర్:
అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వాల్గొండ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసుల, కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన చెట్పల్లి శంకర్ (34) బతుకుదెరువు నిమిత్తం ఇతర దేశాలకు వలస వెళ్లి ఐదు సంవత్సరాల క్రితం తిరిగి వచ్చాడు. అన్నారోగ్య సమస్యలతో శంకర్ బాధపడుతున్నాడు. ఇదే క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన శంకర్ ఇంటి వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య చెట్పపల్లి వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు.


మృతుడు శంకర్

పీవోను కలిసిన మైనింగ్ స్టాఫ్ నాయకులు

నవతెలంగాణ-రామగిరి:
సింగరేణి ఆర్జీ3 ఏరియాలోని ఓసిపి-2 ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.రాజేందర్‌ను మైనింగ్ స్టాఫ్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మైనింగ్ స్టాఫ్ కో-కన్వీనర్ నాగెల్లి సాంబయ్య, వైస్ ప్రెసిడెంట్ కాసిపేట వెంకటస్వామి,రీజియన్ వైస్ ప్రెసిడెంట్ బత్తుల రమేష్, ఓసిపి-2 ఫిట్ సెక్రటరీ సాధిక్,నాయకులు శ్రీనివాసులు, కొమ్ము రామస్వామి,సత్తిరాజు, భాజీ పాష, రౌత్ రమేష్, శ్రీనివాస్, కుమారస్వామి, రాజుకుమర్, అక్కు వంశీ, ఆధం తదితరులు పాల్గొన్నారు.


పీఓ రాజేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మైనింగ్ స్టాఫ్ నాయకులు

8వ కాలనీ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడిగా దేవనపల్లి చక్రపాణి

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ:
8వ కాలనీ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేవనపల్లి చక్రపాణి ఎన్నికైనట్టు ఆ సంఘం సభ్యులు మంగళవారం వెల్లడించారు. ప్రధాన కార్యదర్శిగా సాంబారి రాజేష్‌ను ఎన్నుకున్నారు. 8వ కాలనీ పద్మశాలి సేవా సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. 5 మెన్ కమిటీ సభ్యులు బండారి రాజమల్లు, పసునూటి సాంబశివరావు, అడిచెర్ల వెంకట నరసయ్య, నెల్లి కనకయ్య, మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు భీమనాతి విజయ చంద్రశేఖర్, కనుకుట్ల మల్లేశ్వరి పాల్గొన్నారు.


దేవనపల్లి చక్రపాణి

ఆర్జీ2లో రక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ:
ఆర్జీ-2 ఏరియా పరిధిలోని ఓసిపి-3 కృషి భవన్ వద్ద మొదటి బదిలీ ఉద్యోగులకు రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జనరల్ మేనేజర్ సేఫ్టి (కార్పొరేట్) గురువయ్య హాజరై మాట్లాడారు. ఏరియా జనరల్ మేనేజర్ ఎ.మనోహర్, జీఎం సేఫ్టి ఆర్జీ రీజియన్ ఎస్.సాంబయ్య హాజరయ్యారు. ఉత్పత్తి పరంగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ, సింగరేణికి గుండె కాయలాంటి ఓసిపి3 లో ప్రమాదాలు జరుగకుండా చూడవలసిన భాధ్యత ప్రతిఒక్కరి పైన ఉందని ఏరియా జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ తెలిపారు.



రక్షణ సమావేశంలో మాట్లాడుతున్న జీఎం ఎ. మనోహర్

దేశవ్యాప్త ఆందోళనలకు ఐఎఫ్‌టీయూ పిలుపు

నవతెలంగాణ-గోదావరిఖని:
ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కాంట్రాక్ట్ కార్మికుల పర్మినెంట్ కోసం ఆగస్టులో దేశ వ్యాప్త ఆందోళనలకు ఐఎఫ్‌టియు పిలుపునిచ్చింది. ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ సమావేశాలు ఈ నెల 2, 3 తేదీల్లో గోదావరిఖనిలో జరగగా ఐఎఫ్‌టియు జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ రెండు రోజులు జరిగిన సమావేశంలో దేశంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించారు. ఆగస్టు 15 వరకు అన్ని రాష్ట్రాలలో రాష్ట్రస్థాయి వర్క్ షాప్‌లో నిర్వహించి ఆగస్టు 21 నుండి 26 వరకు అన్ని రాష్ట్రాలలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా ఐఎఫ్‌టియు ఆందోళన కార్యక్రమాల్లో కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని చేయాలని కోరారు.


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ

క్రీడా పాఠశాల ఎంపికకు సెలక్షన్స్


జెండా ఊపి ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం మండలం లోని అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని విద్యార్థులకు స్థానిక ఎన్టీపీసీ టిఎస్ జిల్లా పరిషత్ పాఠశాలలోని క్రీడా మైదానంలో క్రీడా పాఠశాలల ఎంపికకి సెలక్షన్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ నాయకులు, పాలకుర్తి జెడ్పీ టీసీ కందుల సంధ్యారాణి జెండా ఊపి ప్రారంభించారు. కార్పొరేటర్ సుజాత, ప్రధ్యానోపాధ్యాయులు శ్రీధర్, పీఈటీలు శ్రీనివాస్, శోభారాణి, కవిత, రమ్య తదితరులున్నారు.

మాజీ జడ్పీటీసీ పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ జడ్పీటీసీ

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన పాశం మల్లేష్ సోమవారం మరణించగా, ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం మంగళవారం రమేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు బక్కతట్ల కుమార్, పెగడ కుమార్ తదితరులున్నారు.

ఘనంగా జువ్వాడి నర్సింగ్ రావు జన్మదిన వేడుకలు


అన్నదానం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ -మెట్‌పల్లి:
మెట్‌పల్లి మండలం లోని వేంపేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోరుట్ల నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం సాయి శ్రీనివాస ఆసుపత్రిలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ బెజ్జా రపు శ్రీనివాస్,డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాం ప్రసాద్, రాష్ట్ర నాయకులు డా:బెజ్జారపు శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కంభ సురేష్, యెల్ల నరేష్, ఎనుగుందుల ఉదయ్, సోమిడి శివ, సోమిడి ప్రణీత్,శ్రీధర్,ప్రసాద్, ప్రశాంత్ వైద్య సిబ్బంది డా:లక్ష్మణ్, ప్రశాంత్,సాగర్, సుజాత, నిరోషా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి,పార్లమెంట్ కో ఆర్డినేటర్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

వివేకానంద వర్ధంతి

నవతెలంగాణ -మెట్‌పల్లి:
మెట్‌పల్లి వాగ్దేవి డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వామి వివేకానంద వర్ధంతి నిర్వహించారు.విద్యార్థులు ఆయన చిత్రపటానికి పులా మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ధృవీకరణ పత్రాల జారీ వేగవంతం చేయాలి

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం తహసీల్దార్ కార్యాలయంలో కుల, నివాస, ఆదాయ ధృవీకరణ పత్రాలను పొందడం కోసం ప్రజలు, విద్యార్థులు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటికీ దాదాపు నెలరోజులు గడిచినా ఇంత వరకూ పత్రాలను జారీ చేయలేదని, ప్రక్రియ వేగవంతం చేయాలని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ధృవీకరణ పత్రాల జారీ ఆలస్యం కావడంతో లబ్ధిదారులు కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారని పేర్కొన్నారు. అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని కోరారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిస్తాం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్:
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు అన్నారు.

మంగళవారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యవసాయ మార్కెట్‌లో సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో నైజాం నవాబు నాయ కత్వంలో భూస్వాములు, జాగిర్దారులు, దేశముకులు ప్రజలతో వెట్టి చాకిరి వ్యతిరేకంగా పోరాడి వీరుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)జిల్లా కమిటీ సభ్యులు జి, జ్యోతి, సి పెల్లి రవీందర్, నాయకులు ఎస్, దిలీప్, మల్లారపు కొమరయ్య, ఎస్, వెంకటస్వామి, ఆరెపల్లి చంద్రయ్య, మామిడిపల్లి శ్రీనివాస్, అంబాల చిన్న, సురేష్, బొంకురి శంకర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి:
తెలంగాణ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా మెట్‌పల్లికు రుమ సంఘ సభ్యులతో కలిసి పాత బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు. కురుమ సంఘం అధ్యక్షులు కోటా రమేష్, ఉపాధ్యక్షులు కోరే రమేష్, ఎంపీపీ మారు సాయి రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర రావు, కౌన్సిలర్ ఓజ్జల బుచ్చిరెడ్డి ,కోట చిన్న సాయన్న, గడ్డం మల్లేశు, కోరే రవి, కాచర్ల అంజయ్య, నడిపి సాయిన్న ,మధు ,చందు తదితర కురుమ సంఘ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.


పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

నవతెలంగాణ -మెట్‌పల్లి:
మెట్‌పల్లి పట్టణంలోని తిరుమల అపార్ట్మెటంట్స్ దగ్గర, జాతీయ రహదారికి దగ్గరలో మంగళవారం ఉదయం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు అనుమానస్పద మృతిగా కేసునమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


గుర్తు తెలియని వృద్ధుని శవం

మండల కేంద్రంలో అభివృద్ధి శూన్యం

నవతెలంగాణ(బుగ్గారం):
బుగ్గారం మండల కేంద్రంలో అభివృద్ధి శూన్యం అని కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అట్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మండల కేంద్ర ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్న శాశ్వత ప్రభుత్వ భవనాలు ఏర్పరచకపోవడం, బుగ్గారం అడ్డ రోడ్డు దగ్గర ఎక్స్‌ప్రెస్‌లు ఆపకపోవడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. మండల కేంద్రం ఏర్పాటు చేసిన ఇప్పటికీ నాడు రత్నాకర్ రావు నియోజకవర్గం స్థాయిలో చేసిన అభివృద్ధి తప్ప మండలంగా మంత్రి చేసిన అభివద్ధి శూన్యమని ఎద్దేవ చేశారు. ధర్మపురి మండల అధ్యక్షులు దినేష్,బుగ్గారం మండల యువజన అధ్యక్షులు నగునూరి నర్సాగౌడ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్దినవేని శంకర్,సిగిరి అంజిత్ కుమార్,బీరుపూరి తిరుపతి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య అధికారి

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి ఆర్జీ 1 జీడీకే 1 సిఎస్‌పిలో ఏరియాఆసుపత్రి డివైసిఎంఓ డాక్టర్ కిరణ్ రాజ్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల పై మంగళవారం అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమల నుండి సంక్రమించే డెంగీ, మలేరియా, చికుంగున్యా జపనీస్ ఎంకెఫలైటిస్ వంటి వ్యాధుల గురించి, వాటి నివారణ చర్యల గురించి ఆరోగ్య అధికారి డాక్టర్ ఎన్. సుమన్ ఉద్యోగులకు వివరించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఇతర అధికారులు, కార్మిక నాయకులు, ఉద్యోగులున్నారు.

అమ్మపరివార్‌లో అన్నదానం

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖని విఠల్‌నగర్ లోని అమ్మపరివార్ ఆశ్రమంలో పీడీజీ దీపక్ భట్టాచారి పీఎం జెఫ్ జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మగువ ప్రెసిడెంట్ డాక్టర్ లక్ష్మీ వాణి, సెక్రెటరీ జి.సునీత ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. సౌజన్య, ఆశ్రమ నిర్వాహకులు మంద సంధ్యారాణి, నాగరాజు తదితరులున్నారు.


అన్నదానం నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మివాణి

న్యూ ఇండియా పార్టీని గెలిపిస్తే ఆర్థిక స్వేచ్ఛ



మాట్లాడుతున్న న్యూ ఇండియా పార్టీ జాతీయ అధ్యక్షుడు

నవతెలంగాణ-గోదావరిఖని:
న్యూ ఇండియా పార్టీని ఆదరించి గెలిపిస్తే ఆర్థిక సిద్దంతాలన్ని అమలు పరచి ఆర్థిక స్వేచ్ఛను అందిస్తుందని పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్ట ర్ జెవి రాజు అన్నారు. న్యూ ఇండియా పార్టీ ఆధ్వర్యంలో మే 1, 2023 నుండి జరుగు తున్న ఆర్థిక స్వేచ్ఛ విజయ సంకల్ప యాత్ర మంగళవారం గోదావరిఖనికి చేరు కుంది. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల్లో యాత్రను కొనసాగించారు. నాయకు లు జనగామ లక్ష్మీ నారాయణ, మాస్టర్ చానక్య తిరుపతి రెడ్డి, అశ్విని శ్రీ, బానేష, బెల్లంపల్లి శంకర్, చంద్రమౌళి, రజిత, జనగామ తిరుపతి, బాబన్న, లింగస్వామి, విక్రమ్ సింగ్ తదితరులున్నారు.

జీడీకే 11వ గనిలో సేఫ్టీ అవేర్నెస్ డ్రైవ్

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 11వ గనిలో జీఎం సేఫ్టీ రామగుండం రీజియన్ సాంబయ్య, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ బండి సత్యనారాయణ, గని ఏజంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సేఫ్టీ అవేర్నెస్ డ్రైవ్‌ను నిర్వహించారు. గని మెనేజర్ నెహ్రూ, సేఫ్టీ ఆఫీసర్ మల్లేశం, ఫిట్ ఇంజనీర్ రాజాబాబు, ఫిట్ సెక్రటరీ నాయిని శంకర్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు,చ ఫిట్ సేఫ్టీ కమిటీ మెంబర్లు, ఉద్యోగులున్నారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీ టీం ఇన్‌ఛార్జి

నవతెలంగాణ-గోదావరిఖని:
మహిళల భద్రతకు పోలీ సు శాఖ ప్రత్యేక చర్యలను తీసుకుంటుందని షీ టీం ఇన్‌ఛార్జి, ఎఎస్ఐ మల్లారెడ్డి అన్నారు. సింగరేణి ఆర్జీ 1 ఏరియా వర్క్‌షాప్‌లో మంగళ వారం షీ టీంపై అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యక రమైన సైగలు చేసిన, అసభ్యకరమైన మెసేజ్‌లు పంపిన, అశ్లీల చిత్రాలు పంపి న, మీరు ఎప్పుడైనా షీ టీంకు వాట్సాప్ 6303023700 మెసేజ్ పంపించి నట్లయితే తక్షణమే వారిపై చర్య తీసుకుంటారని అవగాహన కల్పించారు. షీటీం బృందం స్నేహలత, సురేష్, ఏరియా వర్క్‌షాప్ డిజిఎం మదన్మోహన్, డేవిడ్, శ్రీనివాస్, జితేందర్ సింగ్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

రైతుల అభ్యున్నతికి పాటుపడాలి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

నవతెలంగాణ- రాయికల్: నూతనం గా ఏర్పడ్డ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల అభ్యున్నతి పాటుపడాలని ఎమ్మె ల్యే సంజయ్ కుమార్ అన్నారు. మంగళవా రం నూతన మార్కెట్ కమిటీ పాలక వర్గ చైర్మన్‌గా మారంపెల్లి రాణి సాయికుమార్,వైస్ చైర్మన్ బర్కం మల్లేష్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం మహోత్సవానికి జడ్పీ చైర్మన్ దావ వసంత, జిల్లా లైబ్రరీ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్ తో కలిసి పాలకవర్గ ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు రాయికల్‌కు వచ్చిన ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్‌లకు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఎంపీపీ సంధ్యా రాణి సురేందర్ నాయక్, జడ్పీటీసీ అశ్విని జదవ్,వైస్ చైర్మన్ గంద్ర రమాదేవి, సింగిల్ విండో చైర్మన్లు ఏనుగు మల్లారెడ్డి, రాజలింగం, కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, మ్యాకల కాంతారావు, రాయికల్ మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


పాలకవర్గానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే





రమాదేవి కులకర్ణి... కలం ఆమె నేస్తం.. కవిత్వం ఆమె ఆరాటం.. పుస్తకం ఆమె బంధువు... మనసుని కదిలించిన సంఘటనలను అక్షరాలుగా మార్చి కాగితంపై పెడితే ఆమె మనసుకు ఎంతో ప్రశాంతం. పిల్లలతో గడపడం ఆమెకు ఓ అపురూపం. ఓ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపల్‌గా విద్యారంగంలో మార్పులను బలంగా కోరుకుంటున్నారు. దాని కోసమే ఎన్నో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆమె పరిచయం ఆమె మాటల్లోనే...

రాసేస్తే హాయిగా ఉంటది

నా బాల్యమంతా మెదక్‌లో గడిచింది. అమ్మ గిరిజమ్మ, నాన్న శంకర్‌రావు. పదవతరగతి పూర్తయ్యే సరికి నాన్న రిటైరయ్యారు. టెన్త్‌లో మంచి మార్కులతో పాసయ్యాను కానీ ఆర్థిక సమస్యలతో కాలేజీలో చేరలేకపోయాను. 15 ఏండ్ల వయసులో ఓ స్కూల్లో టీచర్‌గా చేరాను. నూట నలభై రూపాయల జీతం. కాలేజీలో పేరు ఉండేది కానీ నేను ఉండేదాన్ని కాదు. నా స్నేహితులంతా కాలేజీకి వెళ్తుంటే నేను స్కూలుకు వెళ్లి చిన్న పిల్లలకు చదువు చెప్పేదాన్ని. కాలేజీకి వెళ్లాలని ఉన్నా ఉద్యోగ రీత్యా కుదిరేది కాదు.

తెలుగంటే అమితమైన ప్రేమ

పాత పుస్తకాలు తెచ్చుకుని నాకు నేనుగా చదువుకొని ఇంటర్మీడియట్ పూర్తి చేశా. అదేం విచిత్రమో మా ఇంట్లో ఎంత ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మేం చాలా ఆనందంగా ఉండే వాళ్ళం. అమ్మా నాన్న ఎలా చేసే వాళ్ళో ఏమో... మాకు అర్థమయ్యేది కాదు. కాలేజీకి వెళ్ళకుండానే డిగ్రీ కూడా పూర్తిచేశా. దాంతోపాటు హిందీ పరీక్షలు కూడా రాస్తూ వచ్చాను. నా సెకండ్ లాంగ్వేజ్ హిందీ. అయితే తెలుగంటే ప్రేమ, విపరీతమైన అభిమానం. నా ఆలోచనలన్నీ దొరికిన పేపర్స్ మీద రాస్తుండేదాన్ని. మా కాలేజీ ఫ్రెండ్స్ నందిని సిద్ధారెడ్డిసార్ గురించి చెప్తూ ఉంటే చాలా గొప్పగా ఉండేది. సార్ పాఠం వినాలని చాలా తపనగా ఉండేది. అప్పుడప్పుడు దొంగతనంగా వెళ్లి ఆయన క్లాసులు వినేదాన్ని. మా స్నేహితులతో పాటు నేనూ డిగ్రీ పూర్తి చేశాను. టీటీసీ ఎంట్రెన్స్ రాస్తే సీట్ రాలేదు. కాస్త బాధపడ్డాను.

బాధ నుంచి ఆలోచన

బీఎడ్ తర్వాత డీఎస్సీ కోసం జనరల్ నాలెడ్జ్ నా కొడుక్కు చెప్తూ నేనూ గుర్తుంచుకునేదాన్ని. వాడే నా కంబైన్డ్ స్టడీమేట్. బాగా చదివి రాశాను. మంచి నోట్స్ ప్రిపేర్ చేసుకున్నాను. 1998 డీఎస్సీలో మంచి మార్కులు కూడా వచ్చాయి. కానీ ఫలితం మాత్రం శూన్యం. నేను కోర్సు చేసిన అలహాబాద్ యూనివర్సిటీ సర్టిఫికెట్ ఫేక్ అన్నారు. ఉద్యోగం రాలేదు, బాధపడ్డాను. కానీ ఆ బాధ నుంచి ఓ ఆలోచన వచ్చింది. నా సత్తా ఏంటో చూపించాలనుకున్నాను. ఇంగ్లీష్ నేర్చుకున్నాను. ఆ క్రమంలో చాలా అవమానాలు కూడా పడ్డాను. అయినా పట్టుదలగా నేర్చుకున్నాను. తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మే ఇంగ్లీష్ చేసాను. డిగ్రీ, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆంగ్లం పాఠాలు చెప్పాను. వందల మందికి స్పోకెన్ ఇంగ్లీష్ బేసిస్ తీసుకున్నాను.



సాహితీ ప్రస్థానం...

నా సాహితీ ప్రస్థానం అనుకోకుండగా జరిగింది. చిన్నప్పటి నుంచి రాసేదాన్ని. ఏ చిన్న చిత్తుకాగితాలు దొరికినా, ఏ పుస్తకం దొరికినా దీక్షగా చదివేదాన్ని. ఎవరు మాట్లాడుతున్నా చక్కగా వినేదాన్ని. నా కవితలు పత్రికల్లో వచ్చేసి. 2014లో నాలోని అక్షరానికి గుర్తింపు లభించింది. నా పిల్లలు ఇద్దరూ నన్ను 'నువ్వు ఇంత బాగా రాస్తావు కదా అమ్మా! నువ్వు ముందుకెళ్లు' అని ఊతమిచ్చారు. ఫేస్బుక్ వచ్చిన తర్వాత అన్నీ అందులో పెట్టేదాన్ని. దీని ద్వారానే నాకు ఐడెంటిటీ వచ్చింది. సంటి అనిల్ కుమార్ ద్వారా సాహితీ సవ్వడి గ్రూపులో చేరాను. ఆట, గురజాడ ఫౌండేషన్ ద్వారా మొదటి బహుమతి అందుకున్నాను.

సాహిత్యం పట్ల ఆసక్తితో...

చాలా మంది ప్రముఖుల పరిచయాలు అయినంపుడి శ్రీలక్ష్మి ద్వారా కలిగింది. అక్షరయాన్ ప్రారంభంలో రంగారెడ్డి జిల్లా బాధ్యతలు చూశాను. కోవిడ్‌లో వీడియో కవితలు యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయగలిగాను. కవితలు రాయడం ఎంత ఇష్టమో, వ్యాసాలు రాయడం కూడా అంతే ఇష్టం. సాహిత్యంపై ఉన్న అసక్తితో 'కణికొను ప్రారంభించాను. ఇది సాహిత్య, సామాజిక, సేవ, విద్యారంగ వాట్సాప్ వేదిక. దీని ద్వారా చాలా కార్యక్రమాలు చేస్తున్నాను. కణికకు బాసటగా ఎందరో సాహితీ వేత్తలు ఉన్నారు.

నేర్చుకోవల్సింది చాలా ఉంది

రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ కవితా పురస్కారాలు అందుకున్నాను. గురజాడ ఫౌండేషన్ వారి జాతీయ స్థాయి పురస్కారం, 2017 ముంబైలో గురజాడ ఫౌండేషన్ వారిచే రాష్ట్ర స్థాయి సాహితీ పురస్కారం, ఉగాది, సంక్రాంతి కవితా పురస్కారం, గజల్ లోగిలి, కాళోజి పురస్కారం ఇలా ఎన్నో అందుకున్నాను. నా ముద్రితాలు 'రెప్పచాటుమౌనం' కవిత సంకలనం, 'అన్ని తెలిసిన అయ్యకు వందనం'. అముద్రితాలు ఒక్కసారి ఆలోచిద్దాము, రామ కథ (బాల గేయాలు), బాల సాహిత్యం, జానపద పాటలు, 2000పైగా కవితలు, గజళ్ళు... ఇంకా చాలా ఉన్నాయి. చాలా రాయించింది జీవితం. ఇంకా చదవాల్సింది, నేర్చుకోవాల్సింది బోలెడు ఉంది. ఎంతటి బాధనై, ఆనందమైనా రాయాలనిపిస్తది. రాసేస్తే హాయిగా ఉంటది. ప్రసవం తర్వాత ఉండే హాయి అంతగా..!



మార్పు రావాలి

పిల్లలు జాతి సంపద, విద్యా విధానంలో మార్పులు రావాలి. లేదంటే యువత ఇంకా ఇంకా తప్పుదారి పట్టే ప్రమాదం ఉంది. తల్లి దండ్రులలో మార్పు రావాలి. అందుకే ప్రస్తుతం ఓ ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపల్‌గా పని చేస్తూ పిల్లలకు, యువతకు ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. నైతిక విలువలు పసితనం నుంచే నేర్పాలి. అప్పుడే సమాజం బాగుపడుతుందనే గట్టి నమ్మకం నాకు. బోధన నాకు చాలా ఇష్టం. విద్యార్థులతో గడపడం ఒక అపురూపం. నా భర్త, పిల్లల సహకారంతో సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నా. పేద పిల్లలను దత్తత తీసుకుని చదివిస్తున్నాం. కరోనా కాలంలో ఎంతో మంది ఆకలి తీర్చగలిగాను.

ఎప్పుడూ నిరాశ పడలేదు

టీటీసీ పోవడంతో బీఎడ్ ఎంట్రెన్స్ రాశాను. వంద ర్యాంక్ వచ్చింది. కానీ కాలేజీలో చేరే పరిస్థితి లేదు. అప్పటికే పెండ్లి అయ్యింది. ఆ తర్వాత హిందీ పండిట్ ట్రైనింగ్ ఎంట్రన్స్ రాసాను. స్టేట్ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. అప్పుడు కూడా కాలేజీకి వెళ్ళలేకపోయాను. కానీ నా మీద నాకు నమ్మకం వుంది. అందుకే ఎక్కడా నిరాశ పడలేదు, వెనుకంజ వేయలేదు. తర్వాత అలహాబాద్ యూనివర్సిటీ వారి కరస్పాండెన్స్ కోర్స్ ట్రైనింగ్‌లో జాయిన్ అయ్యాను.

– సలీమ



ఇంట్లోనే పెంచండిలా...

ప్రస్తుతం నిత్యావసరాల ధరలు మండి పోతున్నాయి. కూరగాయలైతే చెప్పనవసరం లేదు. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. టమాట ధర రూ.100 దాటింది. కొద్దిరోజుల్లో ఉల్లి కూడా కన్నీళ్ళు పెట్టించనుందని మార్కెట్ వర్గాల టాక్.. ఇదిలాగే కొనసాగితే రోజువారీ అవసరాలకేమీ కొనలేని పరిస్థితి రావచ్చు. అందుకే ఖర్చులను తగ్గించేందుకు ఇంట్లోనే కొన్ని రకాల మొక్కలను పెంచవచ్చు. ఇందుకు బాల్కనీ, కిటికీలను కూడా వాడొచ్చు. ఇంట్లో కూరగాయలు కట్ చేసిన తర్వాత పడేసే వ్యర్థాలతోనే ఎరువులుగా ఉపయోగించుకోవచ్చు. అది ఎలాగో ఇప్పుడు తెలుసుకుందాం...

అల్లం : చిన్న అల్లం ముక్క ఉంటే, దాన్ని మట్టిలో పెట్టండి. దీనికి క్రమం తప్పకుండా నీరు పోస్తూ ఉండండి. తగినంత సూర్యరశ్మి తగిలేలా కిటికీ దగ్గర ఉంచండి. ఇలా చేస్తే ఒక వారం తర్వాత కొత్త మొలకలు వస్తాయి. మొక్క పెరిగి ఆకులు కాస్త ముదురు రంగులోకి మారుతుంటే అల్లం ఉపయోగించుకునేందుకు తయారైనట్లే..

వెల్లుల్లి : వెల్లుల్లి పెంచడం చాలా సులభం. ఇందుకు కొన్ని వెల్లుల్లి రెబ్బలను తీసుకుని వాటిని మట్టిలో నాటాలి. వెల్లుల్లికి సూర్యకాంతి చాలా అవసరం. కాబట్టి దాన్ని రోజంతా ఎండ తగిలేలా ఉంచాలి. కొత్త వెల్లుల్లి రెబ్బల నుంచి మొలకలు వస్తాయి. ఆకుల రంగు మదురుగా మారుతుంటే లోపల వెల్లుల్లి గడ్డలు ఏర్పడినట్లే. జాగ్రత్తగా గమనించుకుని కాడలు కత్తిరించుకుని గడ్డలు తీయాలి.

పుదీనా : మార్కెట్‌కి వెళ్ళినపుడు పుదీనా తెచ్చుకుంటాం కదా.. ఆకులు గిల్లిన తర్వాత గట్టి కాడలను ఎంచుకుని మట్టిలో పాతాలి. కాస్తంత సూర్య రశ్మి తగిలేలా పెట్టాలి. క్రమంగా నీరు పోస్తుంటే వారం పది రోజుల్లోనే కొత్త ఆకులు మొదలవుతాయి.

కొత్తిమీర : ఇంట్లో దనియాలు వాడుతూనే ఉంటాం. మట్టి కాస్త తడిపొడిగా చేసి దనియాలు చల్లి పైన ఒక పొరలాగా మట్టిని చల్లాలి. రోజుకు రెండు సార్లు నీళ్ళు చిలకరించినట్లు తడి అయ్యేలా చల్లుతూ ఉండాలి. పది నుంచి పదిహేను రోజుల్లో కొత్తిమీర మొక్కలు వస్తాయి. వాటిని జాగ్రత్తగా సంరక్షించుకుంటే మరో నెలలోపే వాడుకునే వీలుగా ఆకులు వస్తాయి

గూడు..గోడు..!

(మొదటిపేజీ తరువాయి)

కోసం ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. సొంతిళ్లు లేని నిరుపేదలను ప్రామాణికంగా తీసుకొని అందజేయాలని సంకల్పించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి 3వేల ఇండ్ల చొప్పున అందజేయాలని భావిస్తోంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల చొప్పున మూడు విడతల్లో అందజేస్తామని స్పష్టం చేసింది. బేస్‌మెంట్, రూఫ్‌లెవల్, పూర్తయిన తర్వాత అందజేస్తారు. అయితే, మూడు లక్షలతో ఇంటి నిర్మాణం ఎలా సాధ్యమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం రూ. 5లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ. 10లక్షలు ఇవ్వాలని సీపీఐ(ఎం), తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక డిమాండ్ చేస్తున్నాయి. ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటం చేస్తున్నాయి.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో లబ్దిదారులు అయోమయానికి గురవుతున్నారు. తాజాగా ఇండ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు వందలాది మంది నిరుపేద మహిళలు తరలివచ్చారు. అక్కడి సిబ్బంది గేట్లు మూసివేసి లోపలికి రానీయకుండా అడ్డుకోవడం చర్చనీయాంశమైంది. నాయకులు, నిరుపేదలు అక్కడే బైటాయించడంతో స్పందించిన కలెక్టర్ వారి దరఖాస్తులు తీసుకొని రసీదులు అందించారు. ప్రభుత్వం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తుందా.. ప్రజాప్రతినిధుల ద్వారా తీసుకుంటుందా అనేదానిపై అధికారవర్గాల్లోనూ స్పష్టత లేదు.

వారం రోజుల్లో మార్గదర్శకాలు

బసవేశ్వర్, గృహనిర్మాణశాఖ నోడల్ అధికారి

ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. కానీ పూర్తిస్థాయి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. అక్కడ్నుంచి ఆదేశాలు రాగానే వాటి ప్రకారం దరఖాస్తుల ప్రక్రియపై చర్యలు తీసుకుంటాం. వారం రోజుల్లో మార్గదర్శకాలు వచ్చే అవకాశం ఉంది.

దొడ్డి కొమురయ్య బలిదానం వృథా కాదు

(మొదటిపేజీ తరువాయి)

తుమ్మల వీరారెడ్డి, డబ్బికారు మల్లేశ్, బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తదితరులు నివాళులర్పించారు.

తొలి అమరుడు కొమురయ్య : మంత్రి జగదీశ్‌రెడ్డి

తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య తొలి అమరుడని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ ఎస్.వెంకట్రావుతో కలిసి మంత్రి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సాయుధ రైతాంగ పోరాటంలో కొమురయ్య వీరోచిత పోరాటాన్ని మంత్రి గుర్తు చేశారు.

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూదాన్ పోచంపల్లిలో జీఎంపీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రామన్నపేట మండల కేంద్రంలో సీపీఐ(ఎం) దొడ్డి కొమురయ్యకు నివాళి అర్పించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హాజరై కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతిని హైదరాబాద్‌లోని విద్యానగర్ సీపీ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్ మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా జరిగిన మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ముందు భాగాన నిలిచిన వ్యక్తి దొడ్డి కొమురయ్య అని కొనియాడారు.

కాంపిటేటివ్ అథారిటీ సీట్లన్నీ తెలంగాణ విద్యార్థులకే

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులకే రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. అంతకు ముందు వీటిలో 85శాతం మాత్రమే స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15శాతం అన్ రిజర్వుడుగా ఉండేది. ఇందులో తెలంగాణతో పాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. ఎంబీబీఎస్ సీట్లు పొందేవారు. తాజా నిర్ణయం వల్ల తెలంగాణ విద్యార్థులకు ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు దక్కనున్నాయి.

తెలంగాణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించడంతోపాటు, ఇక్కడి విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు సీఎం కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రభుత్వ, ప్రయివేటులో కలిపి రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలు ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 56కు చేరింది. గతంలో తెలంగాణలో 2,850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉంటే, ఇప్పుడు 8,340 సీట్లకు పెరిగింది.

తెలంగాణ ఏర్పాటుకు ముందున్న ఉన్న 20 మెడికల్ కాలేజీల్లోని 2,850 సీట్లలో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 1,895 సీట్లు ఉండేవి. ఇందులో 15శాతం అన్ రిజర్వుడు కోటాగా 280 సీట్లు కేటాయించాల్సి వచ్చేది. ఇందులో తెలంగాణ విద్యార్థులతో పాటు, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు అవకాశం పొందేవారు. దీంతో తెలంగాణ విద్యార్థులు సీట్లు కోల్పోవాల్సి వచ్చేది. ఇదే విధానం కొనసాగితే, పెరిగిన మెడికల్ కాలేజీల్లో కూడా 15శాతం అన్ రిజర్వుడు కోటా అమలు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల మరిన్ని సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోవాల్సి వస్తుంది. దీన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, అన్ రిజర్వుడు కోటాను కేవలం పాత 20 మెడికల్ కాలేజీలకు మాత్రమే పరిమితం చేస్తూ నిబంధనలకు సవరణ చేసింది. కొత్తగా వచ్చిన 36 మెడికల్ కాలేజీలకు ఆ నిబంధన వర్తించకుండా తాజాగా సవరించింది. దీంతో 520 మెడికల్ సీట్లు తెలంగాణ విద్యార్థులకు అదనంగా లభిస్తున్నాయి. ఇప్పటికే ఎంబీబీఎస్ బి కేటగిరి సీట్లలో 85శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే చెందేలా లోకల్ రిజర్వ్ చేసుకోవడం వల్ల ఇక్కడి విద్యార్థులకు అదనంగా 1300 ఎంబీబీఎస్ సీట్లు విషయం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ రెండు నిర్ణయాల వల్ల మొత్తం 1820 సీట్లు ప్రతి ఏటా దక్కనున్నాయి. అంటే దాదాపు ఇది 20 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో సమానం. ప్రతి ఏటా కాలేజీలు పెరిగినా కొద్ది ఈ సీట్ల మరింత పెరగనుంది. కొత్త మెడికల్ కాలేజీల్లో అల్ ఇండియా కోటా కింద 15శాతం సీట్లు యధాతదంగా ఉంటాయి. దీనిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశంలో ఎక్కడివారైనా మెరిట్ ప్రకారం అడ్మిషన్ పొందవచ్చు.

కల సాకారం దిశగా అడుగులు : వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

తెలంగాణ విద్యార్థులు స్థానికంగా ఉంటూనే డాక్టర్ కలను సాకారం చేసుకునేందుకు ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించింది. ఏండ్ల కాలం నుంచి వైద్య విద్యకు దూరమైన తెలంగాణ బిడ్డలు ప్రభుత్వ నిర్ణయాల వల్ల మెడిసిన్‌కు దగ్గర అవుతున్నాయి. తెలంగాణ సోయితో ఆలోచించిన ప్రభుత్వం ఇక్కడి విద్యార్థులకు అదనంగా 1820 మెడికల్ సీట్లు వచ్చేలా చేసింది. అందువల్ల విద్యార్థులు డాక్టర్ కావాలనే కలను సాకారం చేసుకోవాలి. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తూ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఒకవైపు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తూనే, ఎక్కువ సీట్లు తెలంగాణ విద్యార్థులకు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. తెలంగాణ విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.

వైద్య విద్యార్థుల సీట్ల పెంపుపై హర్షం తెలంగాణ రాష్ట్ర వైద్య విద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్

రాష్ట్రంలో ప్రభుత్వం ఎంబీబీఎస్ సీట్లను పెంచడం పట్ల తెలంగాణ రాష్ట్ర వైద్య విద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు డి.రవిప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఇ. చంద్రశేఖర్, ముఖ్య సలహాదారులు రాయల సతీష్‌బాబు, కష్టారెడ్డి, శ్రీనివాస్‌లు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంపిటేటివ్ అథారిటీ కోటాలో 100 శాతం సీట్లు తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు దక్కే విధంగా ఉత్తర్వులు జారీ చేయడమనేది వైద్యవిద్యను అభ్యసించాలనే విద్యార్థులకు శుభవార్త అని పేర్కొన్నారు. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పీడిత వర్గాల పక్షాన పోరాడటమే



(మొదటిపేజీ తరువాయి)

అన్యాయపూరితమైన శాసనాలకు, అధికారాలకు వ్యతిరేకంగా అల్లూరి నిలబడ్డారని రాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'అల్లూరి రాబోయే తరాలకు స్ఫూర్తి నింపారు. బ్రిటీష్ వారిని పదే పదే ఓడించారు. హింసించినా, ఒత్తిడి తెచ్చినా లొంగలేదు. ప్రజలపై దాడులకు వ్యతిరేకంగా నిలబడి ప్రాణాలను అర్పించారు. ప్రజలకు అధికారం కావాలని నిలబడ్డవానిగా చరిత్రలో నిలిచారు. ప్రజల స్వాభిమానం కోసం పరితపించారు... ' అంటూ రాష్ట్రపతి కొనియాడారు. ఆయన జీవితమే స్ఫూర్తిగా వచ్చిన ఒక తెలుగు సినిమాలో శ్రీశ్రీ రాసిన 'తెలుగువీర లేవరా..... దీక్షబూని సాగరా' అనే పాటలో ఉన్నట్టు ప్రజలు మేల్కొని ముందుకుసాగాలని ఆమె పిలుపునిచ్చారు. దేశాన్ని మరింత బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తుచేశారు.

గొప్ప త్యాగాలతో గొప్ప విజయాలు సాధ్యమవుతాయనీ, అలాంటి గొప్ప త్యాగధనుడు అల్లూరి అని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ కొనియాడారు. ఆయన సామాజిక న్యాయం కోసం నిలబడ్డారని తెలిపారు. గిరిజనుల స్వేచ్ఛ, సంస్కృతి, హక్కులు, ఆకాంక్షల కోసం అల్లూరి అనేక చేశారని గుర్తుచేశారు. బలహీనులైన గిరిజనులను ఆయన ధైర్యవంతులుగా మార్చారన్నారు. ఆయన కేవలం ప్రేరణనిచ్చిన వాడు మాత్రమే కాదనీ....ప్రజలను సమీకరించి బ్రిటీష్ పాలకులపై యుద్ధం ప్రకటించారని చెప్పారు. అత్యంత సాహసవంతులైన స్వాతంత్ర్యసమరయోధులు, విప్లవకారుల్లో అల్లూరి ఒకరనితెలిపారు.

ప్రజలు పీడనకు గురైన పరిస్థితుల్లో దైవాంశసంభూతులు జన్మిస్తారన్న శ్రీకృష్ణుని మాటలు అల్లూరి సీతారామరాజు జీవితానికి వర్తిస్తాయని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి గొప్ప స్ఫూర్తిని రగిలించారని అన్నారు. అల్లూరి స్ఫూర్తిని తెలిపే గీతాలు తెలంగాణ ఉద్యమంలో తనకు స్ఫూర్తినిచ్చాయని గుర్తుచేసుకున్నారు. ' విప్లవజ్యోతి, వీరయోధుడు అల్లూరి సీతారామరాజు. మన్నెం బిడ్డల కన్నీరు తుడిచాడు. గడ్డిపరకలను గడ్డపారలుగా మార్చిన మహాయోధుడు. ఉత్సవాలు ఆయన పోరాట చైతన్యాన్ని, దేశభక్తిని కొత్తతరానికి ఘనంగా చాటిచెప్పాయి.

అణగారిన వర్గాలపై ఎప్పుడైతే దాడి సంభవిస్తుందో అప్పుడు కొందరు వీరులు ఉద్భవించి వారికి శాంతి కలుగజేస్తారు. 26 ఏండ్ల వయస్సులోనే అల్లూరి రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాండించారు. భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్ చంద్రబోస్ వంటి యోధుల సరసన, మేమూ తక్కువ కాదంటూ తెలుగు జాతిని నిలబెట్టారు. చనిపోతూ దేశం గురించే మాట్లాడారు. దేశం గురించే ప్రాణాలిడిచారు. అహింసా సిద్ధాంతాన్ని ప్రవచించిన మహాత్మాగాంధీ సైతం అల్లూరిని ప్రశంసించకుండా ఉండలేనంటూ' చెప్పారని సీఎం గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, అల్లూరి సీతారామరాజు విగ్రహ రూపశిల్పి బుర్రా ప్రసాద్, విగ్రహదాత అల్లూరి సీతారామ రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

కాలరాసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పెట్టుబడిదారులకు, బడా కాంట్రాక్టర్లకు ఈ ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కనీస వేతనాల జీవో కూడా యాజమాన్యాలకు అనుకూలంగా ఉందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచే వరకూ తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

అనంతరం భూపాల్, మల్లికార్జున్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలు పెరిగాయే కానీ కార్మికుల జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. కార్మికులతో 12 గంటలు వెట్టి చాకిరి చేయించుకొని యాజమాన్యాలు వారికి కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వలస కార్మికులు ఎక్కువగా పని చేస్తున్నారని తెలిపారు రాష్ట్రంలో కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్ 1979, అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరుగుతున్న శాస్త్ర సాంకేతికతతో రోజుకు ఏడు గంటలు, వారానికి ఐదు రోజుల పని దినాలు ఉండాలని డిమాండ్ చేశారు. జులై 4 నుంచి 13 వరకు జరిగే జీపు జాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 17న అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట జరిగే పికెటింగ్‌లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, రుద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు మరో భారీ పెట్టుబడి

(మొదటిపేజీ తరువాయి)

ఆరిజిన్ ఫార్మాస్యూటికల్ సర్వీసెస్ లిమిటెడ్ సీఈవో అఖిల్ రవిలు తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి ఈ మేరకు తమ సంస్థ నిర్ణయాన్ని మంగళవారం ప్రకటించారు. మంత్రి కేటీఆర్‌తో జరిగిన సమావేశం సందర్భంగా తమ ఆరిజిన్ ఫార్మాస్యూటికల్ సర్వీసెస్ భవిష్యత్తు ప్రణాళికలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. తాము హైదరాబాద్ నగరంలో పెడుతున్న ఈ పెట్టుబడి ద్వారా సుమారు 200 మందికి నేరుగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని, మరో 60 నుంచి 70 మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు వస్తాయని, ఇవన్నీ కూడా లైఫ్ సైన్సెస్ రంగంలో ఉన్నత నైపుణ్యం కలిగిన ఉద్యోగాలని మంత్రి కేటీఆర్‌కి వివరించారు. భవిష్యత్తులో తమ పెట్టుబడిని మరింతగా పెంచే ప్రణాళికలను కూడా సిద్ధం చేసుకున్నట్టు తెలిపారు. తాము ఏర్పాటు చేస్తున్న ఈ సంస్థ ద్వారా ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన బయోటెక్ ఇన్నోవేటర్ల భాగసామ్యంతో వారి ఆలోచనలకు, పరిశోధనలకు ఊతం ఇచ్చేలా పనిచేస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన వీరి నైపుణ్యం వలన ప్రపంచ స్థాయి బయోటెక్ ఉత్పత్తులను తయారు చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఆరిజిన్ ఫార్మాస్యూటికల్ భారీ ఎత్తున హైదరాబాద్ నగరంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం పట్ల మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. బయోటెక్ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సంస్థ విస్తరణ ప్రణాళికలు ఉన్నాయన్నారు. ఆరిజిన్ ఫార్మాస్యూటికల్ విస్తరణ ప్రణాళికలు, పెట్టుబడి బయో ఫార్మాస్యూటికల్ రంగంలో హైదరాబాద్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

హైదరాబాద్ నగరాన్ని ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ కేంద్రంగా తయారు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి ఆరిజిన్ ఫార్మాస్యూటికల్ సంస్థ సీఈవో అఖిల్ రవి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో ఉన్న మౌలిక వసతులు, మానవ వనరుల వల్లనే తాము ఈ పెట్టుబడిని హైదరాబాద్‌లో పెడుతున్నట్టు తెలిపారు. 25 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగి ఉన్న తాము, బయోటెక్నాలజీ రంగంలో మందుల తయారీ, పరిశోధన, అభివద్ధి ప్రధాన అంశాలుగా తమ సంస్థ పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచ స్థాయి బయో టెక్నాలజీ ఉత్పత్తులను తయారు చేస్తామన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు

నవచిత్రం


త్రివిక్రమ్, అల్లు అర్జున్

డబుల్ హ్యాట్రిక్ హిట్ కోసం..

అల్లు అర్జున్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో 'జులాయి', 'సన్ ఆఫ్ సత్యమూర్తి', 'అల వైకుంఠపురములో' సినిమాలు రూపొందాయి. ఈ మూడు సినిమాలు కూడా ఒకదానికి మించి మరొకటి ఘన విజయం సాధించిన విషయం విదితమే. ముఖ్యంగా 'అల వైకుంఠపురములో' సినిమా ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందింది.

గురు పూర్ణిమ శుభ సందర్భంగా వీరి కలయికలో నాలుగో సినిమా ప్రకటన వచ్చింది. ఈసారి ఈ కలయిక తెలుగు ప్రేక్షకులతో పాటు ప్రపంచ సినీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

త్రివిక్రమ్ శ్రీనివాస్ అద్భుతమైన కథాకథనాలు, ఈ కలయికలో వచ్చిన ప్రతి సినిమాని ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేశాయి. 'రవీంద్ర నారాయణ్', 'విరాజ్ ఆనంద్', 'బంటు' వంటి పాత్రల్లో అల్లు అర్జున్ జీవించారు. ప్రతి పాత్ర సినీ ప్రేమికుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని పొందాయి.

అగ్ర చిత్ర నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ప్రొడక్షన్ నెం.8 కోసం అల్లు అర్జున్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మరోసారి జతకట్టారు. వీరి కాంబోలో రూపొంది ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మూడు సినిమాలనూ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ భారీ స్థాయిలో నిర్మించడం ఓ విశేషమైతే, తాజాగా ఈ నాలుగో సినిమాని కూడా అదే భారీస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులందరినీ సంతృప్తి పరచడానికి అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌తో కలిసి 'అల వైకుంఠపురములో' నిర్మాణంలో భాగమైన గీతా ఆర్ట్స్ ఇప్పుడు ఈ చిత్ర నిర్మాణంలోనూ భాగం అవుతుంది. ఈ చిత్రాన్ని అల్లు రామలింగయ్య మమత సమర్పణలో హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

యుఎస్ఎలో పీపుల్ సినిమాస్ రిలీజ్

పవన్ కళ్యాణ్, సాయిధరమ్ తేజ్ తొలి కాంబినేషన్‌లో పి.సముద్రఖని దర్శకత్వం వహించిన సినిమా 'బ్రో'. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్, సహనిర్మాత వివేక్ కూచిబొట్ల నిర్మిస్తున్నారు. తమిళంలో సూపర్ హిట్ అయిన ఈ సినిమాకు తెలుగులో దర్శకుడు, రచయిత త్రివిక్రమ్ శ్రీనివాస్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు.


సాయి ధరమ్ తేజ్
పవన్‌కళ్యాణ్

ఈ సినిమా ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది అని చిత్ర బృందం ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. ఎన్నో అంచనాలను క్రియేట్ చేసిన ఈ ఈ చిత్రాన్ని యుఎస్ఎలో 'పీపుల్ సినిమాస్' రిలీజ్ చేయనుంది.

ఇటీవల ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది. అలాగే ఫస్ట్ లుక్‌కి, రీసెంట్‌గా రిలీజైన టీజర్‌కి కూడా అద్భుతమైన స్పందన లభించింది. ప్రస్తుతం యూట్యూబ్‌లో మిలియన్ వ్యూస్‌తో టీజర్ వైరల్ అయ్యింది. కేతిక శర్మ, ప్రియా ప్రకాష్ వారియర్, సముద్రఖని, రోహిణి, రాజేశ్వరి నాయర్, రాజా, తనికెళ్ల భరణి, వెన్నెల కిషోర్, సుబ్బరాజు, పృథ్వి రాజ్, నర్రా శ్రీను, యువలక్ష్మి, దేవిక, అలీ రెజా, సూర్య శ్రీనివాస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డీఓపీ: సుజీత్ వాసుదేవ్, సంగీతం: ఎస్.ఎస్.తమన్, ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, ఎడిటర్: నవీన్ నూలి, ఫైట్స్: సెల్వ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం.

ఫేట్ గేమ్ ఆడితే..?

నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ నీలకంఠ రూపొందించిన కొత్త సినిమా 'సర్కిల్'. సాయిరోనక్, బాబా భాస్కర్, అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా కీలక పాత్రల్లో నటించారు. ఆరా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎమ్‌వీ శరత్‌చంద్ర, టి.సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించారు. సరికొత్త థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ఈనెల 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ నేపథ్యంలో దర్శకుడు నీలకంఠ మీడియాతో ముచ్చటించారు.

'ఫేట్ (విధి) అనే కాన్సెప్ట్‌తో ఓ వందమందిని ఓ సర్కిల్‌లోకి తీసుకొచ్చి.. ఎట్లా వారి జీవితాలను అల్లకల్లోలం చేసిందని మెయిన్ థీమ్.. ఇది రొమాంటిక్, క్రైమ్ థ్రిల్లర్ కాదు. ఇన్వెస్టిగేషనల్ టైప్‌లో కాకుండా.. ఎమోషనల్ థ్రిల్లర్‌గా రన్ చేశాం.


నీలకంఠ

ఇందులో సాయిరోనక్ ఫొటో గ్రాఫర్‌గా కనిపిస్తాడు. అన్ హ్యూమన్ సర్కిల్‌లోకి అతన్ని ఎలా లాగబడ్డాడు? అక్కడి నుంచి కథ రివీల్ అవుతుంది. రొమాంటిక్ యాంగిల్ కూడా జత చేశాం. ముగ్గురు హీరోయిన్లు ఇంపార్టెంట్ రోల్స్ ప్లే చేశారు. నా గత సినిమాల్లో మాదిరే హీరోయిన్స్‌కు ఈ మూవీలో కూడా ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాను. బాబా భాస్కర్ క్యారెక్టర్ ఎవరూ ఊహించని విధంగా ఉంటుంది. ఫస్ట్ టైమ్ ఓ కీలక పాత్రలో నటించారు. నేను కాన్సెప్ట్ మీదే ఎక్కువగా వర్క్ చేస్తా. కుదిరితే త్వరలో స్టార్ హీరోలతో కూడా సినిమాలు చేస్తా. ఈ సినిమాలో కాన్సెప్ట్‌తోపాటు కమర్షియల్ ఎలిమెంట్స్‌ను కూడా చూపించాం' అని అన్నారు.

ప్రేక్షకులను బాగా నవ్వించే సినిమా

శ్రీసింహా కోడూరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'భాగ్ సాలే'. నేహా సోలంకి నాయిక. ప్రణీత్ బ్రాహ్మండపల్లి దర్శకత్వంలో క్రైమ్ కామెడీగా ఈ సినిమా తెరకెక్కింది. ఈ చిత్రాన్ని వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ నిర్మాతగా, బిగ్ బెన్, సినీ వ్యాలీ మూవీస్ అసోసియేషన్‌తో అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కళ్యాణ్ సింగనమల నిర్మించారు.

ఈనెల 7న ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత అర్జున్ దాస్యన్ మాట్లాడుతూ, 'మా చిత్రాన్ని సురేష్ డిస్ట్రిబ్యూషన్ వాళ్లు విడుదల చేస్తున్నారు. మంచి క్రైమ్ కామెడీ స్టోరీని తీశాం. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని భావిస్తున్నాం. ప్రణీత్ కథ చెప్పినప్పుడు చాలా బాగా అనిపించింది. కానీ భయం కూడా వేసింది. ఆయన చెప్పింది తీయగలుగుతాడా లేదా అని. ఫస్ట్ కాపీ చూసిన తరువాత నేను అనుకున్న దానికంటే పది రెట్లు బాగాతీశాడు. హీరో శ్రీసింహాకు ఈ జోనర్ బాగా సెట్ అవుతుంది. ఆయన 'మత్తువదలరా' మాదిరిగానే ఈ సినిమా కూడా హిట్ ఖాయం. ఇందులో హీరో పేరు అర్జున్. సులభంగా ఎదగాలనే అనుకునే కుర్రాడు. ఈ క్రమంలో మోసాలు చేయడం.. ఎదురయ్యే సమస్యలపై హీరో పాత్ర ఉంటుంది. ఓ రింగ్ ఈ సినిమాలో కీ రోల్ ప్లే చేస్తుంది. ఇటీవల 'ది వరల్డ్ ఆఫ్ భాగ్ సాలే' పేరుతో ఒక యానిమేషన్ వీడియో విడుదల చేశాం. దీనికి సిద్ధూ జొన్నలగడ్డ వాయిస్ అందించారు. ఈ వీడియోకు మంచి రెస్పాన్స్ వచ్చింది. కాల భైరవ అద్భుతమైన సంగీతం అందించారు' అని చెప్పారు.


అర్జున్ దాస్యన్


ఎవరూ గెస్ చేయలేరు



అర్జున్ సర్జా, రాధిక కుమారస్వామి, జె.డి.చక్రవర్తి, ఫైజల్ ఖాన్ కీలక పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'ఇద్దరు'. ఎఫ్ఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డి.ఎస్.రెడ్డి సమర్పణలో ఫర్హీన్ ఫాతిమా నిర్మిస్తున్నారు. ఎస్.ఎస్ సమీర్ దర్శకుడు. ఈ నెల 7న విడుదల కానున్న ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ముషీరా బాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ప్రసన్నకుమార్, తీన్మార్ మల్లనతోపాటు చిత్ర బృందం ఈ వేడుకలో పాల్గొని సినిమా సక్సెస్ కావాలని ఆకాంక్షించారు. దర్శకుడు ఎస్.ఎస్ సమీర్ మాట్లాడుతూ, 'ప్రజెంట్ జనరేషన్‌కు బాగా కనెక్ట్ అయ్యే చిత్రమిది. అర్జున్, జె.డి.చక్రవర్తి ఈ కథకు యాప్ట్ అయ్యారు. యాక్షన్‌తోపాటు చక్కని వినోదాన్ని పంచే సినిమా ఇది. నిర్మాత సహకారం మరువలేనిది' అని అన్నారు. 'సినిమాలో హీరో ఎవరు, విలన్ ఎవరు అనేది చివరి వరకూ గెస్ చేయలేరు. క్లైమాక్స్ సినిమాకు హైలైట్ అవుతోంది. మంచి టాక్‌తో హిట్ అవుతుందని ఆశిస్తున్నాం' అని నిర్మాత చెప్పారు. నటుడు సమీర్ మాట్లాడుతూ, 'దర్శకుడు మంచి కాన్సెప్ట్‌తో ఈ సినిమా చేశారు. అవుట్‌పుట్ చూసిన అందరూ సినిమా హిట్ అని అంటున్నారు' అని తెలిపారు.

ప్రేమలో కొత్త కోణం..

లవ్ స్టోరీల్లో డిఫరెంట్ యాంగిల్ తీసుకుని సరికొత్త ప్రేమకథా చిత్రంగా 'ఓ సాథియా' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. నేటితరం ఆడియన్స్ కనెక్ట్ అయ్యే సన్నివేశాలతో ఈ చిత్రాన్ని తన్వికా-జశ్వికా క్రియేషన్స్ పతాకంపై రూపొందిస్తున్నారు. ఆర్యన్‌గౌరా, మిస్టీ చక్రవర్తి జంటగా నటిస్తున్నారు. ఈ మూవీతో దివ్య భావన దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. చందన కట్టా, సుభాష్ కట్టా నిర్మిస్తున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ బోర్డ్ నుంచి క్లీన్ యూ సర్టిఫికెట్ పొందింది.


ఆర్యన్‌గౌరా, మిస్టీ చక్రవర్తి

ఈ సినిమా చూసిన సెన్సార్ సభ్యులు చిత్ర యూనిట్‌ని ప్రత్యేకంగా అభినందించారు. చిత్రంలోని సన్నివేశాలపై పాజిటివ్ ఫీడ్ బ్యాక్ ఇస్తూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. అలాగే ఈ సినిమా ప్రమోషన్స్ జోష్‌లో నటులు అలీ ఇంటరాక్ట్ కావడం, లెజెండరీ రైటర్ విజయేంద్ర ప్రసాద్ ఇంటర్వ్యూ చేయడంలాంటి అంశాలు ఈ సినిమాపై అంచనాలు పెంచాయి. చిన్న సినిమా అయినా పెద్ద బ్యాక్‌అప్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీ విడుదల కాబోతోంది. పలు సూపర్ హిట్ చిత్రాలను రిలీజ్ చేసిన యుఎఫ్ఓ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని ఈనెల 7న గ్రాండ్‌గా విడుదల చేయబోతోంది. ప్రతి వ్యక్తి జీవితంలో మధుర జ్ఞాపకంగా నిలిచే ఫస్ట్ లవ్ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది.

3 కోట్ల వ్యూస్..

బ్యాక్ టూ బ్యాక్ చార్ట్ బస్టర్స్ హిట్ సాంగ్స్ అందిస్తూ టాలీవుడ్‌లో సంగీత దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు శేఖర్ చంద్ర. తాజాగా సందీప్ కిషన్ నటిస్తున్న 'ఊరు పేరు భైరవకోన' సినిమా కోసం ఆయన కంపోజ్ చేసిన 'నిజమే నే చెబుతున్నా' లవ్ సాంగ్ యూ ట్యూబ్‌లో 30 మిలియన్ వ్యూస్ క్రాస్ చేసి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అలాగే ఇన్స్టాలో రీల్స్‌తో ట్రెండింగ్‌లో ఉంది. శేఖర్ చంద్ర స్వరపరిచిన ఈ పాటకి శ్రీమణి సాహిత్యం అందించగా, సిద్ శ్రీరామ్ పాడారు. శేఖర్ చంద్ర, సిద్ శ్రీరామ్ కాంబినేషన్‌లో ఇప్పటికే 'బాగుంటుంది నువ్వు నవ్వితే', 'ప్రియతమా ప్రియతమా', 'మనసు దారి తప్పెనే' వంటి సూపర్ హిట్ సాంగ్స్ వచ్చాయి. వీరిద్దరి కాంబోలో వచ్చిన నాలుగవ సాంగ్ ఇది.

ఈ సందర్భంగా శేఖర్ చంద్ర మాట్లాడుతూ, 'నిజమే చెబుతున్నా' సాంగ్ ఇంత సక్సెస్ అవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఈ సాంగ్‌ని ఓన్ చేసుకుంటూ రీల్స్ చేస్తున్న అందరికీ థ్యాంక్స్. రిలీజయ్యాక చాలా మెస్సేజెస్ వచ్చాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు వి.ఐ. ఆనంద్‌కి కృతజ్ఞతలు. ఆయనతో నాకు ఇది రెండో సినిమా. మా కాంబోలో ఇంకా మరిన్ని మంచి పాటలు వస్తాయి. అలాగే హీరో సందీప్ కిషన్‌కి, నిర్మాతలకు ధన్యవాదాలు. సిద్ శ్రీరామ్ పాడిన తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. మా కాంబోలో మరిన్ని సాంగ్స్ రానున్నాయి.మూవీ రిలీజయ్యాక ఈ పాట ఇంకా ఎక్కువ రీచ్ అవుతుందని నమ్ముతున్నాను' అని అన్నారు.


శేఖర్ చంద్ర

విత్తు.. వి'పత్తి'

- వర్షాలు కురవకపోవడంతో మొలకెత్తని గింజలు
- ఏ ఒక్కచోటా నమోదు కాని కనీస వర్షపాతం
- 60 మి.మీ వాన కురిస్తేనే పత్తి మొలకలు
- పెట్టుబడులు పెట్టి దిక్కుతోచని స్థితిలో రైతులు

పులకపోస్తూ.. నీటి తడులిస్తూ.. తంటాలు


భూమిలో మొలకెత్తకుండా ఉన్న పత్తి గింజలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే పంటల్లో వరి తర్వాత స్థానం పత్తిదే. వర్షాధార పంటైన పత్తి బెట్ట తల్లడిల్లుతోంది. గతేడాది అధిక వర్షాలతో పత్తి దెబ్బతినగా ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో మొలకలు రాక విలవిలలాడుతోంది. పులకపోసి కొందరు, నీటి తడులిస్తూ మరికొందరు పత్తిని కాపాడుకునేందుకు పడుతున్న తంటాలు వర్ణనాతీతం. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల ఎకరాలకు పైగా సాగయ్యే పత్తి ఈ ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 4 లక్షల ఎకరాల్లో సేద్యం చేయవచ్చని వ్యవసాయశాఖ అంచనా వేసింది. దీనిలో ఇప్పటి వరకు సగం విస్తీర్ణంలో పత్తి గింజలు నాటారు. కానీ వర్షాలు పూర్తిగా ముఖం చాటేయడంతో గింజలు నాటిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 60 మి.మీ వర్షం కురిస్తేనే పత్తి గింజలు మొలకెత్తుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్కచోటా గింజలు మొలకెత్తే స్థాయిలో వానలు కురవలేదు. వర్షాభావ పరిస్థితులపై ఆదివారం సీఎం కేసీఆర్ వ్యవసాయ అధికారులతో జరిపిన సమావేశంలో ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. పరిస్థితులకు తట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు.

గతేడాది అతివృష్టి.. ఈ సంవత్సరం అనావృష్టి..

ఖమ్మం జిల్లాలో గతేడాది 2.26 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 60వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గింజలు నాటారు. జూన్‌లో జిల్లా సాధారణ వర్షపాతం 105.2 మి.మీ నమోదు కావాల్సి ఉండగా గతేడాది 121.4 మి.మీ వర్షం కురిసింది. కురవాల్సిన దానికన్నా 15.4 మి.మీ అధికంగానే కురిసింది. పలు ప్రాంతాల్లో 60 మి.మీ మించి వర్షపాతం నమోదవడంతో నేలల్లో నాటిన గింజలు అధిక తేమతో కుళ్లిపోయాయి. ఇక ఈ ఏడాదికి వచ్చేసరికి జూన్‌లో 49.5 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. అంటే సాధారణ వర్షపాతం కన్నా 52.0 మి.మీ వర్షపాతం తక్కువగా కురిసింది. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితులే ఉన్నట్టు వాతావరణశాఖ నివేదికలు చెబుతున్నాయి.

ఎకరానికి రూ.7వేలకు పైగా నష్టం..

పత్తి గింజలు ఇప్పటికే వేసి అవి మొలకెత్తని రైతులు ఎకరానికి రూ.7వేలకు పైగా నష్టపోతున్నట్టు చెబుతున్నారు. ఎకరానికి దున్నుడు కూళ్లు రూ.5వేలు, పత్తి గింజల ప్యాకెట్లు ఎకరానికి రెండు చొప్పున రూ.1,700, గింజలు నాటు కూళ్లు ఇద్దరికి రూ.500 ఇలా ఎకరంలో గింజలు మొలకెత్తకుంటే రూ.7వేలకు పైగా నష్టం వాటిల్లుతుంది. నీటి వసతి ఉన్న రైతులు తడులు ఇస్తున్నారు. లేని రైతులు కొందరు పులకబోస్తున్నారు. సరిపడా పదునుకాక నష్టపోతున్నారు. ఇద్దరు మనుషులను పెట్టి నీరు పోయిస్తే రూ.500 ఖర్చు వస్తుంది. కొందరు ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చిపోస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.2,000 వెచ్చిస్తున్నారు. కానీ ఇవన్నీ వృథా ప్రయత్నాలేనని.. నీటి వసతి ఉంటే ఇబ్బంది లేదు కానీ, లేదంటే ఇలాంటి బెట్ట పరిస్థితుల్లో పత్తి గింజలు నాటకపోవడమే ఉత్తమమని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

60 మి.మీ వర్షం కురిస్తేనే నాటాలి..

మరో 15 రోజుల వరకు పత్తి గింజలు నాటుకోవచ్చు. ఆలోగా సరిపడా వర్షం రాకపోతే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడమే మంచిది. ఒకటి, రెండు తేలికపాటి వర్షాలు కురవగానే తొందరపడి పత్తి గింజలు నాటొద్దు. 60మి.మీ వర్షం ఉంటేనే పత్తి గింజలు మొలకెత్తుతాయి. పులకపోస్తే గింజ మొలకెత్తడానికి సరిపడా పదును ఉండదు. గింజల విషయంలో ఒకటే రకం కాకుండా రెండు, మూడు రకాలు నాటితే ఉత్తమం. వర్షాధారంగా సాగు చేస్తే త్వరగా పూతకొచ్చేవి, నీటి వసతైతే మధ్యస్థంగా, ఆలస్యంగా పూత, కాతకు వచ్చే రకాలను ఎంచుకోవాలి. బీటీ విత్తనాలైతే 3-2 లేదా 4-2 అడుగుల అచ్చులు చేయాలి. తేలిక నేలల్లో అధిక సాంద్రత పత్తిని 10-5 సెం.మీ దూరంలో నాటాలి. పత్తి గింజలు విత్తిన 48 గంటల్లో తేమ ఉన్నప్పుడు పెండిమిథాలిన్ ఎకరానికి 1.2 గ్రాములు పిచికారీ చేయాలి.



- డాక్టర్ జే. హేమంత్‌కుమార్,
వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో హక్కుల సాధన కోసం పోరాటం

ఏఐకేఎస్ సీనియర్ నాయకులు సారంపల్లి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని ఏఐకేఎస్ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సారంపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న భూ పోరాటాలు, ఇండ్ల స్థలాల పోరాటాలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాలు కొనసాగుతాయన్నారు. నేటికి తెలంగాణలో 88 వేల ఎకరాల సీలింగ్ భూములు భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్‌రాములులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో

దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తితో మరో భూ పోరాటానికి సంసిద్ధం కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సభను మంగళవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ నాటి రజాకార్లకు మించిన వారు ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్నారని ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు తెలిపారు. ఈ క్రమంలో మతోన్మాద నియంతృత్వానికి చరమగీతం పాడాలని సూచించారు. టీపీఎస్‌కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని తెలిపారు. పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచారని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ సభ్యులు బుచ్చి రెడ్డి దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ నీరజకు అరుదైన గుర్తింపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం వీసీ డాక్టర్ నీరజా ప్రభాకర్‌కు అరుదైన గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని వేదగిరిలోని భారతీయ ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ రీసెర్చ్ అడ్వైజరీ కమిటీకి చైర్మెన్‌గా కేంద్ర వ్యవసాయ పరిశోధన మండలి నియమించింది. ఈ సందర్భంగా నీరజా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమైందని పేర్కొన్నారు.

ప్రాజెక్టుల వల్ల పెరిగిన సాగునీరు అందుబాటులో ఉన్నదున ఆయిల్‌పామ్ సాగు చేయాలని రైతులను కోరారు.

భూస్వామ్య పాలకులపై తిరగబడిన దొడ్డి కొమురయ్య

శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భూస్వామ్య పాలకులపై దొడ్డి కొమురయ్య తిరగబడ్డారని శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ...ఆంధ్ర మహాసభలో చురుకైన నాయకుడిగా ఎదిగిన తీరు ఆయన నాయకత్వ లక్షణానికి అద్దం పడుతున్నదని పేర్కొన్నారు. ఆయన పోరాట పటిమను గుర్తించి అనేక మంది ప్రజలు సంఘటితం అవుతున్న నేపథ్యంలో ఆనాటి రజాకార్లు స్థానికంగా ఉండే భూస్వాముల సహకారంతో ఆయన్ను హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యెగ్గే మల్లేష్, బీఆర్ఎస్ఎల్పీ కార్యదర్శి రమేష్ రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత్ కాన్సులేట్‌పై దాడి: ఖండించిన అమెరికా

న్యూయార్క్ : శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ధ్వంసం చేయడాన్ని, పైగా ఆ కార్యాలయానికి నిప్పంటించడానికి జరిగిన ప్రయత్నాన్ని అమెరికా తీవ్రంగా ఖండించింది. అమెరికాలోని విదేశీ దౌత్యవేత్తలపై లేదా దౌత్య కార్యాలయాలపై విధ్వంసం లేదా హింసకు పాల్పడడమనేది క్రిమినల్ నేరమని విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ 3వ తేదీన ట్వీట్ చేశారు. ఖలిస్తాన్ మద్దతుదారులు ఈ నెల 2వ తేదీన ట్విటర్‌లో ఈ వీడియో పోస్ట్ చేశారు. కెనడాలోని భారత దౌత్యవేత్తలను బెదిరిస్తూ ఖలిస్తాన్ పోస్టర్లు వెలియడంతో కెనడా హై కమిషనర్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ సమన్లు పంపింది. "హింస హింసను పుట్టిస్తుంది అన్న మాటలతో వున్న ఆ వీడియోలో కెనడాకి చెందిన ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ (కెటిఎఫ్) చీఫ్ హర్‌దీప్ సింగ్ నిజార్ మృతికి సంబంధించిన వ్యాసాలను కూడా ప్రదర్శించారు. గత నెల్లోనే కెనడాలో గురుద్వారా వెలుపల నిజార్‌ను కాల్చి చంపారు. ఆదివారం తెల్లవారు జామున 1.30-2.30గంటల మధ్య భారత కాన్సులేట్ కార్యాలయానికి నిప్పంటించారని అమెరికాలో దక్షిణాసియా బ్రాడ్‌కాస్ట్ టివి నెట్‌వర్క్‌కి చెందిన దియా టివి పేర్కొంది. వెంటనే శాన్‌ఫ్రాన్సిస్కో అధికారులు మంటలను ఆర్పివేశారని, ఎవరూ గాయపడలేదని, నష్టం పరిమితంగానే వుందని తెలిపారు.

ఫ్రాన్స్ సంఘటన మరువక ముందే దక్షిణాఫ్రికాలో పోలీసుల దుశ్చర్య

కారు నుండి లాగి మరీ వ్యక్తులపై పిడిగుద్దులు

బయటకు వచ్చిన వీడియోపై ప్రజల ఆగ్రహం

కేప్‌టౌన్ : కారును ఆపనందుకు టీనేజర్‌ను కాల్చి చంపిన ఫ్రాన్స్ పోలీసుల దుశ్చర్యను, అక్కడి ప్రజల ఆగ్రహావేశాలను ఇంకా మరువక ముందే దక్షిణాఫ్రికాలో కూడా అటువంటి ఘటనే చోటు చేసుకుంది. సివిల్ దుస్తుల్లో వచ్చిన సాయుధులైన పోలీసు అధికారులు కారు నుంచి ఓ వ్యక్తిని బయటకు లాగి, ఆ వ్యక్తి తలపై, శరీరంపై పిడిగుద్దులు గుద్దుతున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. తన్నులు తిన్న ఆ వ్యక్తి వెల్లకిలా, చలనరహితంగా పడివున్నట్టు కనిపిస్తోంది. మరో వ్యక్తిపై కూడా పోలీసు అధికారులు చేయి చేసుకోవడం ఆ వీడియోలో కనిపిస్తోంది. పోలీసులు తంతుంటే తలపై చేతులు అడ్డు పెట్టుకుని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం కనిపిస్తోంది. ఈ వీడియో చూసిన దక్షిణాఫ్రికా ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కిరాతకంగా వ్యవహరించడం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళనలు వెలిబుచ్చారు. దక్షిణాఫ్రికా డిప్యూటీ అధ్యక్షుడు పాల్ మషటిలె భద్రతా బృందానికి చెందినవారే ఆ పోలీసు అధికారులని, ఈ ఘటన జోహాన్నెస్‌బర్గ్‌లో జరిగిందని ఆయన కార్యాలయం మంగళవారం తెలిపింది. దక్షిణాఫ్రికాలోని పోలీసు రక్షణ దళాన్ని 'బ్లూ లైట్ బ్రిగేడ్'గా పిలుస్తారు. అనవసరంగా బల ప్రయోగానికి దిగుతారనే అప్రదిష్ట వారిపై వుంది. అనవసర బల ప్రయోగాన్ని ముఖ్యంగా నిరాయుధులైన పౌరులపై బల ప్రదర్శనను ఉపాధ్యక్షుడు తీవ్రంగా అసహ్యించుకుంటారని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సంఘటనకు సంబంధం లేని వ్యక్తి మరో కారులో నుండి ఈ వీడియో తీసి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఆ సంఘటన జరిగిన వెంటనే ఆ పోలీసు అధికారులు రెండు నల్ల కారుల్లో అక్కడ నుండి వెళ్ళిపోయారు.

ఆ పక్కనే రోడ్డుపై మరో వ్యక్తి పడివుండడం కూడా కనిపిస్తోంది. అయితే ఆ వ్యక్తిని కూడా తన్నారా లేదా అనేది తెలియడం లేదు. ఈ సంఘటనపై ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో జాతీయ పోలీసు ప్రతినిధి బ్రిగేడియర్ అథ్లెండా మాథె ఒక ప్రకటన చేస్తూ, సంబంధిత పోలీసు అధికారులను గుర్తించి, వారిపై అంతర్గత విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సంఘటనలోని బాధితులను కూడా పోలీసులు గుర్తించారని చెప్పారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.